మన సమగ్ర
ప్రజావాణి
తెలుగు డైలీ
RNI NO:TGTEL/25/A5443
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

రాజన్న సిరిసిల్ల	శనివారం	24.10.2026	సంపుటి : 01	సంచిక : 294	పేజీలు : 12	వెల : 2/-
RAJANNA SIRICILLA	SATURDAY	24.10.2026	Volume : 01	Issue : 294	Pages : 12	Cost : 2/-

సమన్వయంతో నేరాలను అరికడదాం

హైదరాబాద్ ఎస్ఆర్‌పీసీసీ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం
- సాంకేతిక పరిజ్ఞానంతో పటిష్ఠమైన పోలీసు వ్యవస్థ నిర్మాణం
- దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దాలి

హైదరాబాద్, అక్టోబర్ 23: దక్షిణాది రాష్ట్రాల పోలీసు బలగాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రాల సరిహద్దులతో సంబంధం లేకుండా పోలీసులు పరస్పరం సమన్వయంతో పనిచేసేలా పటిష్ఠ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్' (ఐసీసీసీ)లో శుక్రవారం జరిగిన దక్షిణ ప్రాంతీయ పోలీసు సమన్వయ కమిటీ (ఎస్ఆర్‌పీసీసీ)

మిగతా 2లో

కేసీఆర్ సీఎం కావడం ఖాయం

దేశ రాజకీయాల్లో కేసీఆర్ చక్రం తిప్పే రోజులు వస్తున్నాయి: కేటీఆర్

- రేవంత్ రెడ్డి పాలన తాత్కాలికమేనని, త్వరలో కేసీఆర్ సీఎం అవుతారని ధీమా
- కాంగ్రెస్, బీజేపీయేతర కూటమి దేశంలో కీలకపాత్ర పోషిస్తుందని జోస్యం
- కరెంట్ కోతలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వంపై విమర్శ
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు యువత తగిన గుణపాఠం చెబుతుందన్న కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 23:
దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక పాత్ర పోషించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, ఆయన జాతీయ స్థాయిలో చక్రం తిప్పే సమయం ఆసన్నమైందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ హడావిడి కొద్దిరోజులు మాత్రమేనని, ఆ తర్వాత మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో

ప్రియాంక వర్సెస్ రాహుల్..

బీజేపీ సంచలన ఆరోపణలు

- రైహాన్ ఎగ్జిబిషన్ వివాదంపై రాహుల్ మౌనాన్ని ప్రశ్నించిన భండారీ
- రైహాన్ వివాదంపై ఇప్పటి వరకు బహిరంగంగా స్పందించని రాహుల్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 23:
కాంగ్రెస్‌లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మధ్య అంతర్గత పోరు సాగుతోందని బీజేపీ ఆరోపించింది. ప్రియాంక కుమారుడు రైహాన్ వాద్రా ఫొటో ఎగ్జిబిషన్‌లో కొన్ని చిత్రాలను తొలగించిన వివాదంపై రాహుల్ గాంధీ

మిగతా 2లో

అరుణాచల్‌ప్రదేశ్ సరిహద్దులో

చైనా కవ్వింపు

- ఘర్షణల్లో శౌర్య కమాండోలు ప్రతిభ చూపారని ప్రశంస
- చైనాతో 3,488 కిలోమీటర్ల ఎల్ఏసీకి ఐటీబీపీ కాపలా
- అన్ని సరిహద్దు యూనిట్లలో డ్రోన్ ప్లటూన్ల ఏర్పాటు
- గల్వాన్ తరహా పరిస్థితుల కోసం ప్రత్యేక శిక్షణ
- ఐటీబీపీ డీజీ శత్రుజీత్ కపూర్

2లో.

మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కండి

తుమ్మిడిహట్టి బ్యారేజీపై అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

- బ్యారేజీ ఎత్తు, ముంపు ప్రభావంపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచన
- అక్టోబర్ 23 తర్వాత మహారాష్ట్ర సీఎంతో చర్చలు జరపనున్నట్టు వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 23:
రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో నిర్వహించనున్న చర్చలకు సర్వసన్నద్ధంగా ఉండాలని

మిగతా 2లో

2లో.

100 పతకాల మార్క్ దాటిన భారత్

- ఏషియన్ పారా గేమ్స్: ప్రపంచ రికార్డుల మోత..
- ఏషియన్ పారా గేమ్స్‌లో ఐదో రోజు భారత్‌కు స్వర్ణాల పంట
- షూటర్ మోనా అగర్వాల్ ప్రపంచ రికార్డుతో రెండో స్వర్ణం కైవసం
- అథ్లెటిక్స్‌లో ప్రపంచ రికార్డులతో సందీప్ కుమార్, హనీలకు పసిడి పతకాలు
- 100 పతకాల మైలురాయిని దాటిన భారత బృందం
- బ్యాడ్మింటన్, ఆర్చరీలోనూ భారత్‌కు స్వర్ణ పతకాలు

54 మందిపై కేసులు నమోదు

ఏపీలో నామినేషన్ల హింస..

- 54 మందిపై కేసులు నమోదు చేశామన్న డీజీపీ
- 13 జిల్లాల్లో 31 ఘర్షణలు, దాడుల కేసుల నమోదు
- వాహనాల దహనం, జేసీబీతో ఇల్లు కూల్చివేత
- ఓ అభ్యర్థిని తరలిస్తున్న పోలీసు వాహనంపై దాడి

2లో.

మూడు దశల్లో లక్ష ప్లాట్ల నిర్మాణం

- ఇందిరమ్మ టవర్ల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ఆదేశాలు
- ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి సూచన
- లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసి పారదర్శకత పాటించాలని స్పష్టం

హైదరాబాద్, అక్టోబర్ 23:
హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ప్రతిపాదించిన ఇందిరమ్మ టవర్ల నిర్మాణం కోసం యుద్ధప్రాతిపదికన భూములను గుర్తించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

మిగతా 2లో

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

: చంద్రబాబుపై జగన్ ఫైర్

- నామినేషన్ కేంద్రాల్లో వైసీపీ అభ్యర్థులపై దాడులు చేశారన్న జగన్
- వైసీపీ నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని మండిపాటు
- సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత కూడా ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదని విమర్శ

2లో.

నేడు ఢిల్లీకి చంద్రబాబు

- అర్ధరాత్రికి మళ్లీ అమరావతికి చేరుకోనున్న సీఎం
- కేంద్ర పెద్దలను కలిసే అవకాశం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు ఢిల్లీలో పర్యటించనున్నారు. ఇది కేవలం ఒక్కరోజు పర్యటన మాత్రమే కావడం గమనార్హం.

2లో.

సమన్వయంతో నేరాలను అరికడదాం

(మొదటి పేజి తరువాయి)

సమావేశంలో ఆయన మాట్లాడారు.
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళం రాష్ట్రాల డీజీపీలు, ఐజీలు, అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరి, లక్షద్వీప్ ప్రతినిధులు, కేంద్ర దర్యాప్తు సంస్థల ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దే బాధ్యత పోలీసు అధికారులపై ఉందని సీఎం పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రాలతో సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఐసీసీసీ వ్యవస్థలను పంచుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. నేరాల స్వరూపం మారుతున్న నేపథ్యంలో పోలీసింగ్ విధానాల్లోనూ నిరంతర సంస్కరణలు అవసరమని రేవంత్‌రెడ్డి అన్నారు. పోలీసులకు కేటాయించే నిధులను ఖర్చుగా కాకుండా మెరుగైన సమాజ నిర్మాణానికి, ప్రజల భద్రతకు చేసే పెట్టుబడిగా చూడాలని చెప్పారు. ప్రజలు సమర్థంగా పనిచేసే, నైతిక విలువలను పాటించే, పక్షపాతం లేకుండా వ్యవహరించే పోలీసు వ్యవస్థను ఆశిస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ పోలీసు వ్యవస్థను మూడు కమిషనరేట్లుగా పునర్వ్యవస్థీకరించామని సీఎం తెలిపారు. దీనివల్ల ప్రతి పోలీసు కమిషనర్ తన పరిధిపై ప్రత్యేకంగా దృష్టి సారించే అవకాశం ఉంటుందన్నారు. వివిధ రకాల నేరాల నియంత్రణ కోసం హైడ్రా, ఈగల్, టీ-సేఫ్ వంటి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.
సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ట్రాఫిక్ సమస్యలు ప్రస్తుతం కీలక సవాళ్లుగా మారాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వీటిని ఎదుర్కొనేందుకు సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, సిబ్బందికి శిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.
సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ప్రధాని అధ్యక్షతన జరిగిన ప్రగతి సమీక్ష సమావేశంలో గుర్తించినట్లు సీఎం తెలిపారు. తెలంగాణను నక్సలిజం రహిత రాష్ట్రంగా మార్చడంలో పోలీసుల కృషిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసించారని చెప్పారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఈగల్ విభాగానికి కేంద్ర ప్రభుత్వం 80 శాతానికి పైగా స్కోరు ఇచ్చిందన్నారు. సైబర్ నేరాల్లో బాధితులు కోల్పోయిన డబ్బును తిరిగి ఇప్పించడంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోందని పేర్కొన్నారు. ఆహార కల్తీని అరికట్టడం, ఔషధాల నియంత్రణ కోసం అమెరికా ఎఫ్‌డీఏ తరహాలో వివిధ శాఖల మధ్య సమన్వయం కల్పించేలా టీ-సేఫ్ విభాగాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. చెరువులు, సరస్సులు, ఇతర జలవనరులను పరిరక్షించి పునరుద్ధరించడంలో హైడ్రా కృషికి ప్రజల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ, ప్రజా ఆస్తుల పరిరక్షణకు కూడా ఈ సంస్థ పనిచేస్తోందన్నారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగంలో ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని సీఎం పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం పణంగా పెట్టే పోలీసు సిబ్బంది సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తు తనకు అత్యంత ప్రాధాన్యమని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, కర్ణాటక డీజీపీ ఎం.ఏ.సలీం, తమిళనాడు డీజీపీ మహేశ్ అగర్వాల్, పుదుచ్చేరి డీజీపీ షాలినీ సింగ్, లక్షద్వీప్ ఏడీజీపీ బి.శంకర్ జైస్వాల్, కేరళం ఐజీ అజితా బేగం, ఏపీ ఐజీపీ రవికృష్ణ, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ తదితరులు పాల్గొన్నారు

100 పతకాల మార్క్ దాటిన భారత్

ఏషియన్ పారా గేమ్స్: ప్రపంచ రికార్డుల మోత..

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 23:
ఐచి-నగోయా వేదికగా జరుగుతున్న 2026 ఏషియన్ పారా గేమ్స్‌లో భారత క్రీడాకారులు విశ్వరూపం ప్రదర్శిస్తున్నారు. ఐదో రోజు మన అథ్లెట్లు ప్రపంచ రికార్డుల మోత మోగించి స్వర్ణాల వర్షం కురిపించారు. ఈ అద్భుత ప్రదర్శనతో భారత్ పతకాల సంఖ్య 100 మైలురాయిని దాటింది. షూటింగ్‌లో మోనా అగర్వాల్ అద్భుతం చేసింది. మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఎస్‌హెచ్1 విభాగంలో 357.5 స్కోరుతో ప్రపంచ రికార్డు సృష్టించి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ గేమ్స్‌లో ఆమెకు ఇది రెండో స్వర్ణం కావడం విశేషం. చైనా క్రీడాకారిణి కుయిపింగ్ జాంగ్‌పై 3.8 పాయింట్ల భారీ ఆధిక్యంతో మోనా విజయం సాధించింది. అథ్లెటిక్స్‌లోనూ భారత హవా కొనసాగింది. టీ44 400 మీటర్ల స్ప్రింట్‌లో సందీప్ కుమార్ కేవలం 52.28 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేసి ప్రపంచ రికార్డుతో స్వర్ణం గెలుచుకున్నాడు. ఈ పతకంతో భారత్ పతకాల సంఖ్య 100 దాటింది. ఇదే ఈవెంట్‌లో అజయ్ కుమార్ 53.61 సెకన్లతో కాంస్య పతకం సాధించాడు. జావెలిన్ త్రో ఎఫ్37 విభాగంలో హనీ తన చివరి ప్రయత్నంలో 60.49 మీటర్లు విసిరి ప్రపంచ రికార్డు నెలకొల్పి స్వర్ణ పతకాన్ని ముద్దాడాడు.
ఇతర క్రీడల్లోనూ భారత్ సత్తా చాటింది. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 బ్యాడ్మింటన్ ఆల్-ఇండియన్ ఫైనల్‌లో ప్రమోద్ భగత్‌ను ఓడించి నితేష్ కుమార్ స్వర్ణం గెలుచుకోగా, ప్రమోద్ రజతంతో సరిపెట్టుకున్నాడు. పారా ఆర్చరీ పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో హర్విందర్ సింగ్, విజయ్ సుండి ద్వయం 5-1 తేడాతో చైనాపై గెలిచి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది.

మూడు దశల్లో లక్ష ఫ్లాట్ల నిర్మాణం

(మొదటి పేజి తరువాయి)

ఈ సందర్భంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లతో కలిసి 'క్యూర్' ఇందిరమ్మ టవర్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకాల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు.
ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, క్యూర్ పరిధిలో మూడు దశల్లో మొత్తం లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కొనసాగుతున్న మొదటి దశతో పాటు, రెండు, మూడవ దశలకు అవసరమైన భూములను త్వరితగతిన సేకరించాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి అత్యంత పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపిక కోసం నిర్వహించే లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. నగరంలోని పేదలకు వారి నివాస ప్రాంతాలకు, ఉపాధి మార్గాలకు సమీపంలోనే గృహ వసతి కల్పించాలనేదే ఇందిరమ్మ టవర్ల ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. పేదలను నగర శివార్లకు తరలించకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందే వారికి ఫ్లాట్‌పై పూర్తి యాజమాన్య హక్కులతో పాటు, అవిభాజ్య భూమి వాటాను ఎటువంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి శంకుస్థాపనలు జరిగాయని, కొన్ని ప్రాంతాల్లో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని మంత్రి గుర్తుచేశారు. లబ్ధిదారుల అర్హతలను నిశితంగా పరిశీలించిన తర్వాత బహిరంగ డ్రాల ద్వారా ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే లక్షలాది ఇళ్లను మంజూరు చేసిన ఇందిరమ్మ పథకంలో భాగంగా, పట్టణ ప్రాంత గృహ నిర్మాణానికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. భూముల గుర్తింపుతో పాటు ఇతర అనుబంధ ప్రక్రియలను వేగవంతం చేసి, ప్రాజెక్టుల నిర్మాణ వేగాన్ని కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.

ప్రియాంక వర్సెస్ రాహుల్.. : బీజేపీ సంచలన ఆరోపణలు

(మొదటి పేజి తరువాయి)

స్పందించకపోవడాన్ని ఆ పార్టీ ప్రస్తావించింది. ఈ వివాదాన్ని సృష్టించి తన కుమారుడిని రాజకీయంగా తెరపైకి తీసుకొచ్చేందుకు ప్రియాంక ప్రయత్నిస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శించారు. రాహుల్‌పై ప్రియాంకకు రాజకీయ విశ్వాసం తగ్గిందా? అని ప్రశ్నించారు. వ్యక్తిగత పర్యటన కోసం గత ఆదివారం వియత్నాం వెళ్లిన రాహుల్ గాంధీ.. రైహాన్ ఎగ్జిబిషన్ వివాదంపై ఇప్పటివరకు బహిరంగంగా స్పందించలేదు. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్ పరిస్థితి నెలకొందని భండారీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. అయితే, కొన్ని రోజుల క్రితమే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో రాహుల్, ప్రియాంక కలిసి పాల్గొన్న విషయం తెలిసిందే. ఢిల్లీలో ఇటీవల జరిగిన విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ఫొటోలను తన ఎగ్జిబిషన్ నుంచి తొలగించారని కళాకారుడు, ఫొటోగ్రాఫర్ రైహాన్ వాద్రా బుధవారం వెల్లడించారు. 'నో ఐడియా ఈజ్ ఫైనల్' పేరుతో బికనీర్ హౌస్‌లో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్ ప్రారంభానికి కొన్ని గంటల ముందు 105 ఫొటోల్లో 74 చిత్రాలను తొలగించాలని లేదా వాటి స్థానంలో వేరేవి పెట్టాలని నిర్వాహకులు కోరినట్లు రైహాన్ తెలిపారు. ప్రదర్శన ప్రారంభమయ్యే సమయానికి 35 ఫ్రేములు మాత్రమే మిగిలాయని చెప్పారు. ఈ చిత్రాల సేకరణ కోసం మూడేళ్లు కష్టపడ్డానని పేర్కొన్నారు. అక్టోబరు 15నే ఎగ్జిబిషన్ లేఅవుట్‌ను బికనీర్ హౌస్ యాజమాన్యానికి పంపించానని, దానికి సంబంధించిన అంగీకార సమాచారం కూడా అందిందని రైహాన్ వెల్లడించారు. చిత్రాల ఏర్పాట్లు ప్రారంభించిన తర్వాతే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని ఆయన తండ్రి రాబర్ట్ వాద్రా తెలిపారు. మరోవైపు, తమ ప్రాంగణ విధానాలకు అనుగుణంగా లేవని గుర్తించిన ఫొటోలను తొలగించాలని కోరినట్లు బికనీర్ హౌస్ ప్రకటించింది. ఈ వివాదంపై స్పందించిన ప్రియాంక గాంధీ.. యువత గొంతును అణచివేసే ప్రయత్నంగా అభివర్ణించారు. రైహాన్ పంపిన ఇమెయిల్, ఎగ్జిబిషన్ ప్రతిపాదనకు సంబంధించిన స్క్రీన్‌షాట్లను బీజేపీ పంచుకుంది. జూన్ 10న పంపిన ప్రతిపాదనలో ప్రకృతి, వన్యప్రాణులు, అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్, పోర్ట్రెయిట్లు, శిల్పాల వంటి అంశాలే ఉన్నాయని భండారీ పేర్కొన్నారు. అందులో రాజకీయ అంశాల ప్రస్తావన లేదని అన్నారు. జూన్ 30న బికనీర్ హౌస్ ఈ ప్రతిపాదనను అంగీకరించిందని బీజేపీ తెలిపింది. అక్టోబరు 21న బికనీర్ హౌస్ యాజమాన్యం రైహాన్‌కు నోటీసు పంపి 74 ఫొటోలను తొలగించాలని కోరినట్లు భండారీ పేర్కొన్నారు. తొలుత రాజకీయ అంశాలు లేని ప్రదర్శనకు అంగీకారం పొందిన తర్వాత, కుటుంబం ఒత్తిడితో రాజకీయ ఫొటోలను చేర్చి ఉంటారని ఆరోపించారు. ఈ ఇమెయిళ్లు, ప్రతిపాదనలు ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ చేస్తున్న వాదనల్లోని అసత్యాలను బయటపెడుతున్నాయని బీజేపీ విమర్శించింది.

కేసీఆర్ సీఎం కావడం ఖాయం

(మొదటి పేజి తరువాయి)

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. తీవ్రమైన విద్యుత్ కోతల వల్ల రైతులు అల్లాడుతున్నారని, వారి కష్టాలను పట్టించుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంపై నిపుణులు పది నెలల ముందే హెచ్చరించినప్పటికీ, ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోయిన అన్ని వర్గాల ప్రజలు ఇప్పుడు మళ్లీ బీఆర్ఎస్ వైపే చూస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి హడావిడి మరికొద్దిరోజులు మాత్రమే ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు.
జాతీయ రాజకీయాల గురించి ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో కాంగ్రెస్, బీజేపీయేతర పార్టీలే దేశంలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయని కేటీఆర్ జోస్యం చెప్పారు. రాహుల్ గాంధీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆశించిన ఫలితం ఉండదని, అటు ప్రధాని మోదీ పాలనలోనూ దేశానికి చేకూరిన ప్రయోజనం ఏమీ లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ నుంచి గెలిచిన ఎంపీలెవరూ పార్లమెంటులో గళం విప్పడం లేదని ఆయన దుయ్యబట్టారు.
రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు యువత తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాల వల్లే నేడు యువత రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్ర అభివృద్ధిని విస్మరించి, కేవలం ప్రతిపక్షాలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆయన ఆరోపించారు.

అరుణాచల్‌ప్రదేశ్ సరిహద్దులో చైనా కవ్వింపు

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 23: అరుణాచల్‌ప్రదేశ్ సరిహద్దులో చైనా సైనికులతో పలుచోట్ల ముఖాముఖి ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయని ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ కపూర్ వెల్లడించారు. ఈశాన్య సరిహద్దులో ప్రస్తుత పరిస్థితిపై అధికారికంగా ఈ స్థాయిలో వెల్లడించడం ఇదే తొలిసారి అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. "గత కొన్ని రోజులుగా అరుణాచల్‌లో పలుచోట్ల చైనా సైనికులతో ముఖాముఖి పరిస్థితులు ఏర్పడ్డాయి. అవి ఇంకా కొనసాగుతున్నాయి" అని ఐటీబీపీ సిబ్బంది వార్షిక సత్కార కార్యక్రమంలో కపూర్ తెలిపారు. ఈ పరిణామాల్లో ఐటీబీపీకి చెందిన శౌర్య కమాండోలు అసాధారణ ప్రతిభ కనబరిచారని ప్రశంసించారు. ఎత్తైన పర్వత ప్రాంతాల్లో యుద్ధం చేయడంలో ప్రత్యేక శిక్షణ పొందినవారే శౌర్య కమాండోలు. సరిహద్దుల్లో వీరు కీలక పాత్ర పోషిస్తున్నారని ఐటీబీపీ చీఫ్ చెప్పారు. 1962లో ఏర్పాటైన ఈ బలగం చైనాతో ఉన్న 3,488 కిలోమీటర్ల వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి కాపలా బాధ్యతలు చూస్తుంటుంది.
2004లో సరిహద్దు రక్షణ బాధ్యతలు అప్పగించినప్పటికీ, పర్వత ప్రాంతాల్లో గెరిల్లా యుద్ధానికి సంబంధించిన తమ అసలు నైపుణ్యాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని కపూర్ పేర్కొన్నారు. చైనాతో ఉన్న సరిహద్దు అత్యంత క్లిష్టమైనదని ఐటీబీపీ డీజీ అభిప్రాయపడ్డారు. సరిహద్దు ప్రాంతాల్లోని అన్ని యూనిట్లలో డ్రోన్ ప్లటూన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గల్వాన్ లోయ తరహా పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక పోరాట శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. భూగర్భ మౌలిక సదుపాయాలను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. అయితే తాజా ముఖాముఖి ఘటనలు ఏ ప్రాంతాల్లో జరిగాయి? ఎంతమంది సైనికులు పాల్గొన్నారు? ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి? అనే వివరాలను ఐటీబీపీ చీఫ్ వెల్లడించలేదు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు: చంద్రబాబుపై జగన్ ఫైర్

అమరావతి, అక్టోబర్ 23:
ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో రావణకాసుర పాలన నడుస్తోందని ఆయన మండిపడ్డారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ అభ్యర్థులపై దాడులు చేసి, వారి నామినేషన్ పత్రాలను చించివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేయడం, పోలీస్ స్టేషన్లకు పిలిపించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ అక్రమాలపై తాము ఆధారాలు సేకరించి రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ), గవర్నర్‌తో పాటు సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించామని తెలిపారు.
తమ పిటిషన్‌పై స్పందించిన సుప్రీంకోర్టు, అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25 వరకు వాయిదా వేయాలని, నామినేషన్ల దాఖలుకు స్వేచ్ఛ కల్పించాలని, అభ్యర్థులకు రక్షణ, సీసీటీవీ రికార్డింగ్ ఏర్పాటు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని జగన్ గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.
రాష్ట్రంలోని 19 మున్సిపాలిటీలలో తమ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, కానీ ఎస్ఈసీ కేవలం పరిమిత సంఖ్యలో కొన్ని చోట్ల మాత్రమే రీ-నామినేషన్లకు అవకాశం ఇచ్చిందని జగన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏకపక్ష విజయాల కోసం చంద్రబాబు నిబంధనలు మార్చుతున్నారని, ఇది మహాభారతంలోని మాయాజూదాన్ని తలపిస్తోందని ఆయన విమర్శించారు.

నేడు ఢిల్లీకి చంద్రబాబు

అమరావతి, అక్టోబర్ 23:
నేడు మధ్యాహ్నం అమరావతి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి, అక్కడ అధికారిక కార్యక్రమాలు ముగించుకుని అదే రోజు అర్ధరాత్రికి తిరిగి అమరావతి చేరుకుంటారు.
ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంలోని పలువురు ముఖ్య నేతలతో భేటీ అయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ అంశాలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై చర్చించే వీలుంది. అలాగే ఢిల్లీలోని జన్‌పథ్‌లో జరగనున్న ఒక ప్రత్యేక అధికారిక కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని తెలుస్తోంది. అయితే, ఢిల్లీ పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్, ఎవరెవరితో సమావేశమవుతారనే వివరాలు అధికారికంగా వెలువడాల్సి ఉంది.

మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కండి

(మొదటి పేజి తరువాయి)

అధికారులను ఆదేశించారు. రైతుల ప్రయోజనాలే పరమావధిగా ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రధానంగా తుమ్మిడిహట్టి, దిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలపై చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే ఎల్లంపల్లి వరకు నీటిని తరలించే అవకాశం ఉంటుందని, అయితే దీనివల్ల సుమారు 2,300 ఎకరాల మేర ముంపునకు గురవుతుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అదే 150 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే ముంపు వెయ్యి ఎకరాల లోపే మాత్రమే ఉంటుందని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం, మహారాష్ట్రలో ముంపు ప్రభావాన్ని అంచనా వేస్తూనే, తెలంగాణకు గరిష్ఠంగా నీటి లభ్యత ఉండేలా బ్యారేజీ డిజైన్‌ను రూపొందించాలని సూచించారు. అక్టోబర్ 23 తర్వాత చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు మహారాష్ట్ర ముఖ్యమంత్రి సంకేతాలిచ్చారని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ఇటీవల కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల మధ్య జరిగిన సమావేశ వివరాలతో పాటు, సీడబ్ల్యూసీ కోరే ఎలాంటి సమాచారానికైనా సిద్ధంగా ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. దిండి ప్రాజెక్టుకు సంబంధించి ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీలు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. శ్రీశైలం నుంచి అదనంగా 0.6 టీఎంసీల నీటిని తీసుకునేందుకు, శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు నీటిని మళ్లించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, డి. శ్రీధర్ బాబు, సాగునీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏపీలో నామినేషన్ల వేళ హింసాత్మక ఘటనలు

- 13 జిల్లాల్లో 31 ఘటనలు..
54 మంది నిందితుల గుర్తింపు

అమరావతి, అక్టోబర్ 23: ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా పలు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో 31 ఎన్నికల సంబంధిత ఘటనలు నమోదైనట్లు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడించారు. వీటిలో 22 ఘర్షణలు, దాడులు కాగా, మరో తొమ్మిది ఘటనల్లో నామినేషన్ పత్రాలను లాక్కోవడం, చించివేయడం వంటి చర్యలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనల్లో రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలకు నిప్పుపెట్టారు. కొన్ని చోట్ల రాళ్లు, కర్రలతో దాడులు జరగగా, ఒక ఇంటిని యంత్రంతో కూల్చివేసిన ఘటన కూడా నమోదైంది. అభ్యర్థులకు రక్షణగా వెళు తున్న పోలీసు వాహనంపై రాళ్లదాడి జరగడంతో ఓ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఒక అభ్యర్థితో సహా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. జిల్లాల వారీగా అత్యధికంగా అనంతపురంలో ఎనిమిది ఘటనలు నమోదయ్యాయి. అన్నమయ్య, కడప, ప్రకాశం, తిరుపతి జిల్లాల్లో మూడేసి, చిత్తూరు, శ్రీ సత్యసాయి, పల్నాడు జిల్లాల్లో రెండేసి ఘటనలు చోటుచేసుకున్నాయి. నెల్లూరు, కర్నూలు, మార్కాపురం, నంద్యాల, ఏలూరు జిల్లాల్లో ఒక్కో ఘటన నమోదైంది. ఈ ఘటనలకు సంబంధించి ఇప్పటివరకు 16 కేసులు నమోదు చేయగా, మరో 11 ఘటనల్లో కేసుల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం 54 మందిని నిందితులుగా గుర్తించినట్లు డీజీపీ తెలిపారు. హింసకు పాల్పడినవారు ఏ రాజకీయ పార్టీకి చెందినవారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సున్నితమైన ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సమయంలో బెదిరింపులు, దాడులు ఎదురైతే 100 లేదా 112 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

సమయపాలనతో వైద్య సేవలు అందించాలి

● డి ఎం హెచ్ ఓ కట్టా వెంకటేశ్వర్లు

అనంత పురం బ్యూరో అక్టోబర్ 23 ప్రజా వాణి ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలు అందించడంలో సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, ఏ మాత్రం అలసత్వం నిర్లక్ష్యం ప్రదర్శించినా ఉపేక్షించబోమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం నగరంలోని టీ బి నియంత్రణ కార్యాలయం, పీపీ యూనిట్ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల హాజరు, విధుల నిర్వహణ గురించి సమీక్షించారు. సమయపాలన పాటించడం ద్వారా రోగులకు సరైన సేవలు అందించాలని కోరారు. పోస్టు పార్టం యూనిట్లో అందిస్తున్న ఆరోగ్య సేవల వివరాలపై ఆరా తీశారు. వ్యాసక్టమి శస్త్ర చికిత్సలు నిర్వహించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతర్ ఇంజక్షన్లు, ఐ యు డి లు నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు .ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ఉమామహేశ్వరి, రవికాంత్ ఆరోగ్యపరవేక్షికులు దాస చంద్రమోహన్, విజయ్ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఐరాల జడ్పీటీసీ అభ్యర్థిగా ఎం. మహేష్ స్వేరో నామినేషన్

చిత్తూరు, అక్టోబర్ 23: ప్రజావాణి: చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండల జడ్పీటీసీ అభ్యర్థిగా జనసేన పార్టీ నాయకుడు ఎం. మహేష్ స్వేరో శుక్రవారం చిత్తూరు నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా మహేష్ స్వేరో మాట్లాడుతూ.. ఉమ్మడి కూటమి ప్రభుత్వ పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మరింత కృషి చేయవచ్చని తెలిపారు. పూతలపట్టు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఐరాల మండల జడ్పీటీసీ అభ్యర్థిగా తనను ఆదరించి, ఓటు వేసి గెలిపించాలని మండల ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ప్రత్యక్షంగా సేవ చేసే అవకాశం కల్పించిన జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌కు, చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావుకు కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ఐరాల మండలంలోని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ఇతర నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. వారి సహకారంతో ఐరాల మండల ప్రజలకు సేవ చేస్తానని మహేష్ స్వేరో పేర్కొన్నారు.

అనంతపురం నగరాన్ని మళ్లీ అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలంటే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి..

● వైయస్సార్ సీపీ మేయర్ అభ్యర్థి సి.రమేష్.

అనంతపురం బ్యూరో అక్టోబర్ 23 ప్రజా వాణి అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రహీమ్ ఖాద్రి మస్జీద్(ఖబ్రస్తాన్), నూరని మస్జీద్ ల సమీపంలో వైయస్సార్ సీపీ మేయర్ అభ్యర్థి సి.రమేష్ మైనార్టీ ముఖ్య నాయకులు లతో కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనతో పాటు కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి హయాంలో ముస్లిం మైనార్టీలకు జరిగిన మేలును వివరించారు. అనంతపురం నగరాన్ని మళ్లీ అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలంటే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఫయాజ్, వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, వైస్సార్సీపీ రాష్ట్ర సెక్రటరీ గౌస్ బేగ్, రాష్ట్ర మైనారిటీ విభాగం సెక్రటరీ నదీమ్, మైనార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మార్నింగ్ వాకింగ్‌తో పాటు, ఇంటింటా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర..

● అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి..

భూపాలపల్లి మున్సిపాలిటీ, అక్టోబర్ 23 మన ప్రజావాణి :భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో మార్నింగ్ వాకింగ్‌కు వచ్చిన ప్రజలను భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి ఆప్యాయంగా పలకరించి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్యం లో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.అనంతరం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు, 26వ వార్డు టి2 క్వార్టర్స్, 5వ వార్డు కృష్ణ కాలనీ, 24వ వార్డు కార్ల్ మార్క్స్ కాలనీలలో విస్తృతంగా పర్యటించి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. ఆయా కుటుంబాల్లోని పట్టభద్రులతో పాటు వారి కుటుంబ సభ్యులను కలిసి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమం

● స్థానిక సంస్థల ఎన్నికల్లో అ న్ని స్థానాల్లో విజయం సాధిస్తాం: మంత్రి సవిత

అనంత పురం బ్యూరో అక్టోబర్ 23 ప్రజా వాణి కూటమి ప్రభుత్వం రెండున్నరేళ్లుగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తమ విజయానికి బాటలు వేస్తాయని బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత ధీమా వ్యక్తం చేశారు. పెనుకొండ మున్సిపల్ చైర్మన్, 23 వార్డులతో పాటు 5 మండలాల ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారని ఆమె పేర్కొన్నారు. పెనుకొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఎంపీటీసీ అభ్యర్థులు మంత్రి సవితమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిర్వహించిన నామినేషన్ కార్యక్రమం అట్టహాసంగా సాగింది. ఈ కార్యక్రమంలో అభ్యర్థులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువయ్యాయని పేర్కొన్నారు. ప్రజల ఆదరణతో నియోజకవర్గంలోని అన్ని స్థానిక సంస్థల స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారనే విశ్వాసాన్ని మంత్రి వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు సమన్వయంతో ముందుకు సాగాలని, ప్రజలతో మమేకమై పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

కూటమి ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెబుదాం

- నగరాన్ని నాశనం చేసేందుకే బీజేపీ ఎత్తుగడలు
- కూటమి ప్రభుత్వ ఆపద్దపు హామీలను నమ్మకండి
- అనంతపురం నగరాన్ని కాపాడుకుందాం..
- వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్, సీపీఐ నాయకులు

అనంతపురం బ్యూరో అక్టోబర్ 23 ప్రజా వాణి కూటమి ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెబుదామని అనంతపురం నగర మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్, సీపీఐ నాయకులు జగదీష్, జాఫర్‌లు అన్నారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. 2024 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడుస్తుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నగరంలో మేయర్, ఎంపీ, ఎమ్మెల్యేలు మూడు ముక్కలాటాడుతూ నగరాన్ని నాశనం చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కోవిడ్, వరదలు వచ్చినప్పటికీ సంక్షేమం ఎప్పటికీ ఆగలేదన్నారు. ప్రజల ఓట్లతో గెలిచి సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వ నాయకులు పక్కన పెట్టారన్నారు. నగర ప్రజలందరూ కలిసి కూటమి ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పే రోజు వచ్చిందన్నారు. సీపీఐ, సీపీఎం, వైసీపీ కలిసి అనంతపురం నగరాన్ని కాపాడుకుందామన్నారు. ఢిల్లీ గర్వానికి.. అనంతపురం ఆత్మవిశ్వాసానికి జరుగుతున్న పోరాటం ఇది అన్నారు. బిజెపి ప్రభుత్వం అనంతపురం నగరాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాలని చూస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లలో అనంతపురం నగరాన్ని నాశనం చేసిందన్నారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ ఎన్నికల ముందు ధర్మవరం నియోజకవర్గానికి ఇచ్చిన హామీలను పక్కనపెట్టి.. మళ్లీ మోసం చేసేందుకు అనంతపురానికి కొత్త హామీలు తీసుకురావడం విడ్డూరంగా ఉందన్నారు. డంపింగ్ యార్డ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అని అబద్ధపు హామీలు ఇచ్చి అనంత నగర ప్రజలను మోసం చేయొద్దని సూచించారు. అనంతపురం నగర ప్రజల రుణం తీర్చుకునేందుకు వైసీపీ మేయర్ అభ్యర్థిగా తనకు నియమించినందుకు సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం సీపీఐ నాయకులు జగదీష్ తదితరులు మాట్లాడుతూ..సీఎం చంద్రబాబు నాయుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలీసులు అడ్డం పెట్టుకుని నామినేషన్ వేయకుండా ఏవిధంగా చేస్తున్నారో రాష్ట్ర ప్రజలందరూ చూస్తూనే ఉన్నారన్నారు. మళ్లీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే.. ఏవిధంగా ఉంటుందో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తెలుసుకోవాలన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద గంజాయి, రౌడీలను పెట్టించి నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన వారిపై దాడులు చేయడం తగదన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిపితే.. కూటమి ప్రభుత్వం ఓడిపోతుందన్న భయంతో వైసీపీ, సీపీఐ, సీపీఎం నాయకులు నామినేషన్ వేయనీకుండా చేస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు చేస్తున్న అరాచకాలను చూసిన ప్రజలు వారికి ఓటు వేయరన్న ఉద్దేశంతోనే బిజెపి అభ్యర్థిని ఇక్కడ పెట్టారని, అయితే ప్రశాంతతకు మారుపేరైన అనంతపురం నగరాన్ని కుల, మత కల్లోలాలు సృష్టించేందుకే బీజేపీ అభ్యర్థిని ఇక్కడ పెట్టారన్నారు. అన్ని పార్టీల నాయకులంతా ఏకతాటిపై ఉంటూ బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించడమే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. సమష్టి కృషితో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్‌తోపాటు 60 వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థులు, 2 సీపీఐ, సీపీఎం కార్పొరేటర్ అభ్యర్థులను కూడా గెలిపించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నారాయణస్వామి, మల్లికార్జున, రాజారెడ్డి, శ్రీరాములు, రాజేష్ గౌడ్, కృష్ణుడు, లింగమయ్య, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అజ్జమర్రి గ్రామంలో “ఖేత్ బచావో అభియాన్” కార్యక్రమం

చిలిపిచేడు, అక్టోబర్ 22 మన ప్రజావాణి నియోజకవర్గం ప్రతినిధి చిలిపిచెడ్ మండలంలోని అజ్జమర్రి గ్రామంలో బుధవారం “ఖేత్ బచావో అభియాన్” (పొలాన్ని కాపాడుకుందాం) కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కృషి విజ్ఞాన కేంద్రం (ఖఎఖ) తునికి శాస్త్రవేత్త శ్రీ రవికుమార్, మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ గౌడ్, ఏఈఓ వంశీ హాజరై రైతులకు అవగాహన కల్పించారు.ఈసందర్భంగామాట్లాడుతూ... వరి కోత అనంతరం కొయ్యకాలను (వరి గడ్డిని) కాల్చడం వల్ల భూమి సారం తగ్గిపోతుందని, భూమిలోని సూక్ష్మ జీవులు చనిపోయి దిగుబడి తగ్గుతుందని తెలిపారు. కాబట్టి వరి కొయ్యకాలను కాల్చకుండా, కట్టలు కట్టే యంత్రాలను ఉపయోగించి, నేలలో కలియదున్నాలని సూచించారు.అదేవిధంగా రసాయన ఎరువులను ప్రతి పంటకు సూచించిన మోతాదులో మాత్రమే వాడాలని, జీవన ఎరువులను ఉపయోగించి నేల ఆరోగ్యాన్ని కాపాడాలని వివరించారు. కలుపు మందులను, రసాయన ఎరువులను క్రమంగా తగ్గించి సేంద్రియ, సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఎల్-నినో ప్రభావంతో రానున్న యాసంగిలో నీటి కొరత ఉండే అవకాశం ఉందని, నీటి లభ్యత తక్కువగా ఉన్న పరిస్థితుల్లో వరి సాగు చేయకుండా ఆరుతడి పంటలైన జొన్న, కుసుమ, మినుములు, పెసర మరియు కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యశోద బిక్షపతి, కార్యదర్శి ప్రశాంతి, పరశురాం రెడ్డి, నగేష్ తదితర రైతులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలి

● కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలి

● సీపీఎం మండల కార్యదర్శి ఎస్.కె. యాకూబ్ డిమాండ్

గరిడేపల్లి, అక్టోబర్ 23 (ప్రజావాణి):ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని, కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలని సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గరిడేపల్లి మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఎస్.కె. యాకూబ్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువత, మహిళలపై పోలీసులు దాడులు చేయడం, అక్రమ కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే వారిపై దాడులను తక్షణమే నిలిపివేయాలని కోరారు.ఎన్నికల కమిషన్‌లో ముగ్గురు సభ్యులు ఉన్నప్పటికీ నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయని యాకూబ్ అన్నారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడాలని డిమాండ్ చేశారు.

డబుల్ ఇంజన్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్ల హక్కులకు నష్టం జరుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే 13 కోట్ల 52 లక్షల ఓట్లు తొలగించబడ్డాయని ఆరోపిస్తూ, తొలగించిన ఓట్లను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పాల్గొన్న నాయకులు: ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు దోసపాటి బిక్షం, రాయరాల శ్రీనివాస్, నందిపాటి మట్టయ్య, మండవ సైదులు, బి. శ్రీనివాస్, పందిరి వీరారెడ్డి, గుండెబోయిన సైదులు, మార్కపూడి వీరస్వామి, ఎలావల నారాయణ, జిలకర పెంటయ్య, సారెడ్డి సైదిరెడ్డి, బాలయ్య, ఎస్.కె. నాగులు, ఎల్. సంతోష్, కందుకూరి శ్రీనివాస్, బొడ్డుపల్లి బిక్షం, పోలేపల్లి వెంకన్న, రాంబాబు తదితరులు పాల్గొన్నారు

కూకట్‌పల్లిలో అలయ్ బలయ్ సందడి.. తెలంగాణ ఆత్మీయతకు అద్దం పట్టిన వేడుక!

● మక్కపాటి రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం

● ఐక్యత, సోదరభావం, సంస్కృతి పరిరక్షణకు చాటిచెప్పిన సందేశం

కూకట్‌పల్లి, అక్టోబర్ 23 (ప్రజావాణి):తెలంగాణ సంప్రదాయాల పరిమళం.. ఆత్మీయ పలకరింపుల సందడి.. ఐక్యతా స్ఫూర్తిని చాటే అలయ్ బలయ్ వేడుక! కూకట్‌పల్లి గ్రామంలో మక్కపాటి రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో అలయ్ బలయ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకలో పలువురు ప్రముఖులు పాల్గొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. ప్రజలను కలిపే పండుగ.. బంధాలను బలోపేతం చేసే సంప్రదాయం!

అలయ్ బలయ్ అనేది కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదు.. ప్రజల మధ్య ఆత్మీయతను పెంచే, పరస్పర గౌరవాన్ని చాటే తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయం. భిన్నాభిప్రాయాలు, భిన్న నేపథ్యాలు ఉన్నప్పటికీ అందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి సోదరభావాన్ని చాటడమే ఈ వేడుక ప్రత్యేకత.మక్కపాటి రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం తెలంగాణ సంస్కృతి పరిరక్షణ, సామాజిక ఐక్యత ఆవశ్యకతను చాటిచెప్పింది. ఇలాంటి వేడుకల ద్వారా ప్రజల మధ్య స్నేహసంబంధాలు మరింత బలపడటంతో పాటు, సంప్రదాయాల గొప్పతనాన్ని భావితరాలకు అందించవచ్చనే అభిప్రాయం వ్యక్తమైంది.సంప్రదాయమే మన బలం.. ఐక్యతే మన శక్తి! తెలంగాణ సంస్కృతిని కాపాడుకుంటూ, ప్రజల మధ్య ప్రేమాభిమానాలను పెంపొందించే కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని పలువురు ఆకాంక్షించారు. ఆత్మీయ వాతావరణంలో సాగిన ఈ వేడుక తెలంగాణ సంప్రదాయాల పట్ల ఉన్న అభిమానాన్ని మరోసారి చాటిచెప్పింది.

15 ఏళ్ల రహదారి సమస్యకు తాత్కాలిక పరిష్కారం!

- వడ్డేపల్లి రాజేశ్వరరావు చొరవతో శక్తి నగర్‌లో మట్టి రోడ్డు నిర్మాణం ప్రారంభం

ఖైతలాపూర్, అక్టోబర్ 23 (ప్రజావాణి): కూకట్‌పల్లి నియోజకవర్గం లోని ఖైతలాపూర్ డివిజన్ పరిధి శక్తి నగర్‌లోని వైట్ వాటర్ అపార్ట్‌మెంట్స్ సమీపంలో గత 15 ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న రహదారి సమస్యకు ఎట్టకేలకు తాత్కాలిక పరిష్కారం లభించింది. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు చొరవ, సహకారంతో నూతనంగా మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులకు ఈ రోడ్డు కొంత ఉపశమనం కలిగించింది. గత వారం స్థానిక డివిజన్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు, రహదారి నిర్మాణానికి ఎదురవుతున్న అడ్డంకులను తొలగించేందుకు కృషి చేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తాత్కాలికంగా మట్టి రోడ్డు నిర్మాణానికి తనవంతు సహకారం అందించారు. ఈ నేపథ్యంలో నూతనంగా నిర్మించిన మట్టి రోడ్డును వడ్డేపల్లి రాజేశ్వరరావు డివిజన్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రారంభించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: వడ్డేపల్లి రాజేశ్వరరావు

ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గత 15 ఏళ్లుగా రహదారి సౌకర్యం లేక స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, అందుబాటులో ఉన్న మార్గాల ద్వారా తాత్కాలికంగా మట్టి రోడ్డు నిర్మాణానికి సహకరించినట్లు తెలిపారు. ప్రజలకు కనీస రవాణా సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్రయత్నం చేశామని వెల్లడించారు. శక్తి నగర్ కాలనీ అభివృద్ధికి అవసరమైన సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రోడ్డు నిర్మాణంలో కృషి చేసిన డివిజన్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, ఇతర నాయకులను అభినందించారు. రాబోయే రోజుల్లో కూకట్‌పల్లిలో బీజేపీ బలోపేతానికి కృషి చేసి కాషాయ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

హర్షం వ్యక్తం చేసిన స్థానికులు

ఏళ్ల తరబడి రహదారి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొన్న తమకు మట్టి రోడ్డు నిర్మాణంతో కొంత ఉపశమనం లభించిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కాలనీ అభివృద్ధికి భవిష్యత్తులోనూ సహకరిస్తామని, ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్న వడ్డేపల్లి రాజేశ్వరరావుకు అండగా ఉంటామని తెలిపారు.

నాయకులు, కార్యకర్తల పాల్గొనడం

డివిజన్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు విజయ భవాని, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి యంజల పద్మయ్య, ఓబీసీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి కోడిచెర్ల వినోద్, బీజేపీ సీనియర్ నాయకులు తూము శైలేష్, ఐలయ్య, జీవన్, శేఖర్ గుప్తా, పిట్ల మనోహర్, ఈ. సాయి, స్థానిక డివిజన్ నాయకులు రాజేందర్ గౌడ్ (బబ్లు), మనోజ్, శ్రీనివాస్ చారి, కృష్ణ యాదవ్, చక్రవర్తి,వంశీ నేతతోపాటు కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నార

తొండపు జగన్మోహన్ రావు ఆధ్వర్యంలో టీడీపీ,జనసేన బీజేపీ (కూటమి) పార్టీల నుండి బలపరిచిన ఎంపీటీసీ అభ్యర్థి నామినేషన్

- లింగాల - పోచవరం - గంగవల్లి ఎంపీటీసీగా మాడుగుల అరుణ నామినేషన్ దాఖలు

వత్సవాయి, అక్టోబర్ 23 మన ప్రజావాణి లింగాల, పోచవరం, గంగవల్లి గ్రామాలకు ఎంపీటీసీ అభ్యర్థిగా మాడుగుల అరుణ ఈ రోజున వత్సవాయి ఎంపీడీఓ కార్యాలయంలో సంబంధిత అధికారికి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు టీడీపీ, జనసేన, బీజేపీ (కూటమి)పార్టీల నుంచి బలపరిచిన అభ్యర్థిగా మాడుగుల అరుణ బరిలోకి దిగారు. కూటమి సీనియర్ నాయకులు తొండపు జగన్మోహన్ రావు ఆధ్వర్యంలో భారీగా నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా తొండపు జగన్మోహన్ రావు మాట్లాడుతూ మూడు గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని తెలిపారు. మాడుగుల అరుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారంలో ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్

నారాయణఖేడ్ నియోజకవర్గం (ప్రజావాణి):- ఇంచార్జ్ మదుసుదన్ ఝురాసంగం :- శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి దేవస్థాన నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్, మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఏ. చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్‌తో పాటు పాలక మండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి వారి ఆశీస్సులతో ఆలయం మరింత అభివృద్ధి చెందాలని, ఆధ్యాత్మిక కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి ఎన్నికైన బీఎస్ వీర్ శెట్టిని ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్, పీసీసీ సభ్యులు శంకరయ్య స్వామి ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ శంకర్ పాటిల్, హుగ్గెల్లి రాములు, భాస్కర్ రెడ్డి, సువర్ణ--మల్లన్న పాటిల్, పవన్ రాథోడ్, మాజీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్, శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్షద్ అలీ, బడంపేట్ రాచన్న స్వామి ఆలయ కమిటీ చైర్మన్ జగదీష్ స్వామి, కాంగ్రెస్ నాయకులు ముల్తానీ, ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయాన్ని సందర్శించి గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుపై అవగాహన కల్పించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర..

- గ్రాడ్యుయేట్లందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి...

జయశంకర్ భూపాలపల్లి, బ్యూరో అక్టోబర్ 23 (మన ప్రజావాణి):- భూపాలపల్లి సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయాన్ని సందర్శించిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి జనరల్ మేనేజర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులను మరియు జనరల్ మేనేజర్ ని కలిసి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. అర్హులైన గ్రాడ్యుయేట్లందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ...

వరంగల్--ఖమ్మం--నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు నమోదు ప్రక్రియలో అర్హులైన గ్రాడ్యుయేట్లందరూ భాగస్వాములు కావాలన్నారు. నవంబర్ 6వ తేదీ వరకు నమోదు చేసుకునేందుకు గడువు ఉన్నందున చివరి తేదీ వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రాధాన్యతను ప్రజలకు వివరించేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇందులో భాగంగా భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో మార్నింగ్ వాకర్స్‌ను కలిసి, సింగరేణి కార్మికుల క్వార్టర్స్‌తో పాటు 5, 6, 7, 24వ వార్డుల్లో ప్రజలను కలుస్తూ ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

అదే క్రమంలో సింగరేణి జీఎం కార్యాలయంలోని ఉద్యోగులను కలిసి, అర్హులైన గ్రాడ్యుయేట్లందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఉద్యోగులు కూడా సానుకూలంగా స్పందిస్తున్నారని ప్రస్తుతం భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలో సుమారు 5,000 మంది వరకు గ్రాడ్యుయేట్లు ఓటరుగా నమోదు చేసుకున్నట్లు సమాచారం ఉందని, గతంలో నమోదైన ఓట్ల సంఖ్యతో పోలిస్తే చాలా తక్కువగా నమోదు అయింది అని ఇంకా మరింత మంది నమోదు చేసుకోవాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన హక్కు. అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటును నమోదు చేసుకొని, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు, టిబిజికెఎస్ నాయకులు పాల్గొన్నారు.

జుక్కల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే బిచ్కుంద పార్టీ ఆఫీస్ కార్యాలయంలో ఘనంగా దసరా అలయ్ బలయ్ కార్యక్రమం..

- జుక్కల్ నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే విజయదశమి
- శుభాకాంక్షలు తెలిపిన డోన్ గావ్ సర్పంచ్ ఖానాపూరే శ్రీనివాస్..

మన ప్రజావాణి జుక్కల్ ఆర్ సి ప్రతినిధి అక్టోబర్ 23 విజయదశమి (దసరా) పండుగను పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలోని డోన్ గావ్ గ్రామ సర్పంచ్ ఖానాపూరే శ్రీనివాస్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే నివాసంలో అలయ్ బలయ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జుక్కల్ నియోజకవర్గ పరిధిలోని జుక్కల్, కౌలాస్, సావర్గావ్, లాడే గావ్ , సోపూర్, లొంగన్, వజ్రకండి, వివిధ గ్రామాల నుండి అలాగే వివిధ మండలాల నుండి తదితర గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ని మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. సంప్రదాయం ప్రకారం జమ్మి ఆకులను బంగారంగా భావించి పరస్పరం ఇచ్చిపుచ్చుకుంటూ పండుగ శుభాకాంక్షలు పంచుకున్నారు. దసరా అలయ్ బలయ్ కార్యక్రమం సంప్రదాయాలు, ఆత్మీయత, సోదరభావానికి ప్రతీకగా నిలిచింది. ఈ సందర్భంగా జుక్కల్ నియోజకవర్గ ప్రజలందరికీ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డోన్ గావ్ గ్రామ సర్పంచ్ ఖానాపూరే శ్రీనివాస్, బాపు పటేల్, మనోజ్ పటేల్, తదితరులు పాల్గొన్నారు..

శంకరాజుపల్లిలో అభివృద్ధి పనుల జోరు.. కేకే గూడెం కాలనీలో డ్రైనేజీ పనులు ప్రారంభం

- సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క సహకారంతో గ్రామాభివృద్ధికి పెద్దపీట.

ఏటూరునాగారం అక్టోబరు 23 ప్రజావాణి: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లి గ్రామంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క సహకారంతో గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారు. గ్రామ సర్పంచ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవులపల్లి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో, 6వ వార్డు సభ్యురాలు తాటి శ్రీలత--నీలాద్రి సమక్షంలో కేకే గూడెం కాలనీలో డ్రైనేజీ పనులను ప్రారంభించారు. కాలనీలో మురుగునీటి సమస్యలను పరిష్కరించి, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు ఈ పనులు ఎంతగానో దోహదపడనున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడటంతో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తగ్గి, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు అవకాశం కలగనుంది. శంకరాజుపల్లి గ్రామ అభివృద్ధి కోసం ఎస్సీఎస్డిఎఫ్ అభివృద్ధి నిధుల కింద రూ.1.95 కోట్లు, ఐటీడీఏ నిధుల కింద రూ.50 లక్షలు కలిపి మొత్తం రూ.2.45 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుంటూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు స్థానిక నాయకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్య సదుపాయాల కల్పనతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

బిగ్ టీవీ ప్రసాద్ కుటుంబ వేడుకల్లో బండి రమేష్, ఎమ్మెల్యే గాంధీ

- కుమార్తెలకు ఆశీస్సులు.. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

కూకట్‌పల్లి అక్టోబర్ 23 (ప్రజావాణి): కూకట్‌పల్లి లోని ఇతిహాస్ రెస్టారెంట్--వేద ఫంక్షన్ హాల్‌లో మీడియా మిత్రుడు బిగ్ టీవీ ప్రసాద్ కుటుంబం లో నిర్వహించిన శుభ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రసాద్ పెద్ద కుమార్తె లంగా వోణీ వేడుక, రెండో కుమార్తె తొలి పుట్టినరోజు వేడుకలను కుటుంబ సభ్యులు, బంధు మిత్రుల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.

ఈ వేడుకలకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. బిగ్ టీవీ ప్రసాద్‌కు, ఆయన కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ చిన్నారులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, వారి భవిష్యత్తు ఆనందమయంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రసాద్ కుటుంబంలో ఎల్లప్పుడూ సంతోషాలు వెల్లివిరియాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మీడియా మిత్రుడు హరి, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాజేష్, శంకర్ కుమార్ గౌడ్, కేపీహెచ్‌బీ డివిజన్ అధ్యక్షుడు అరవింద్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రమణ, రవి, కళ్యాణ్, వాసు, పిడికిడి గోపాల్ చౌదరి తదితరులు పాల్గొని వేడుకల్లో సందడి చేశారు.

నోముల గ్రామంలో పొలంబడి కార్యక్రమం

- రైతులకు వ్యవసాయ మెలకువలపై అవగాహన కల్పించిన అధికారులు
- రైతులే శాస్త్రవేత్తలుగా మారాలి: ఇబ్రహీంపట్నం ఏడీఏ శశిధర్ రెడ్డి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 23 (ప్రజావాణి): మంచాల మండలం నోముల గ్రామ పరిధిలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఏడీఏ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు సమగ్ర వ్యవసాయ మెలకువలను పాటించాలని, రైతులే శాస్త్రవేత్తలుగా మారాలని సూచించారు. ప్రతి రైతు తన పొలానికి వెళ్లినప్పుడు పంటను నిశితంగా పరిశీలించాలని, పోషక లోపాలు, పురుగుల వల్ల కలిగే నష్టాలను గుర్తించాలని తెలిపారు. పంటలకు తెగుళ్లు కలిగించే కారకాలను ముందుగానే గుర్తించి, తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం వరి పంట గింజ పాలు పోసుకునే దశ నుంచి కోత దశ వరకు ఉందని తెలిపారు. ఈ దశలో కంకినల్లి, సుడిదోమ, అగ్గితెగులు వంటి సమస్యల లక్షణాలను గుర్తించి, వాటి నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రైతులకు వివరించారు. తెగుళ్ల నివారణలో విత్తనశుద్ధి ఎంతో ముఖ్యమని, విత్తనాలను ఎంపిక చేసుకునే సమయంలో ప్రతి రైతు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలని కోరారు. పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనందున పత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్ ద్వారా జిల్లాలోని ఏ సీసీఐ కొనుగోలు కేంద్రంలోనైనా విక్రయానికి సమయాన్ని నమోదు చేసుకొని పత్తిని అమ్ముకోవచ్చని తెలిపారు. రబీ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులందరూ తప్పనిసరిగా ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంచుకొని, వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించే దిశగా ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేష్, వ్యవసాయ విస్తరణ అధికారి సాయి సిరి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

● సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం డిమాండ్

ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, అక్టోబర్ 23: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న నిరవధిక ధర్నా కార్యక్రమానికి ఆయన మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా తాండ్ర సదానందం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఎన్‌హెచ్‌ఎం పరిధిలో వేలాది మంది ఉద్యోగులు అనేక సంవత్సరాలుగా ప్రజలకు నిరంతరాయంగా వైద్య ఆరోగ్య సేవలు అందిస్తూ ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. కోవిడ్–19 వంటి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లోనూ తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం అంకితభావంతో సేవలందించారని పేర్కొన్నారు.గ్రామీణ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ వైద్య ఆరోగ్య కార్యక్రమాల అమలులో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సేవలు ఎంతో కీలకమని అన్నారు. ఇన్నేళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్నప్పటికీ ఉద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత, క్రమబద్ధీకరణ, సమాన పనికి సమాన వేతనం, వేతన సవరణ, ఉద్యోగుల కుటుంబ భద్రతతో పాటు ఇతర న్యాయమైన సేవా హక్కులను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సేవలను గుర్తించి, వారి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు చేపట్టే పోరాటాలకు సిపిఐ అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కల్లేపల్లి నవీన్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కార్యదర్శి కొమ్ము కొమురయ్య, బుచ్చయ్య, సాయి ఆజాద్, మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చెల్లించేది ఒక్క కూపన్ కే...?

- చేతివాటంతో మాన్యువల్ బిల్లులు...?
- ఓటీపీలు ఓసీలు అసలే ఉండవు..
- చిన్నమండవలో కొనసాగుతున్న ఇసుక దందా...?
- చిక్కుముడులు ఎన్ని ఉన్నప్ప టికీ... ఓటీపీలు లాగిన్ లో లేకుండా జాగ్రత్తలు...?
- ఒక్కొక్క కూపన్ కు.. 10 ట్రిప్పులదాకా రవాణా..?
- పట్టించుకోని రెవెన్యూ రవాణా విజిలెన్స్ శాఖలు..?

ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి ఖమ్మం జిల్లా చింతకాని మండలం చిన్న మండవ మున్నేరు ఇసుక రీచ్ నుండి దర్జాగా మాన్యువల్ బిల్లులతో ఒకే ఒక్కసారి 780 ప్రభుత్వ ధరను చెల్లించి మీ సేవలలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ఓసీలు ఓటీపీలు లేకుండా ఇసుకను తరలిస్తున్న సంబంధిత రెవెన్యూ విజిలెన్స్ రవాణా శాఖలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం కు గండి పడుతుందని చింతకాని మండల ప్రజలు స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక అవసరాల కోసం దరఖాస్తు చేసుకొని అనుమతులు తీసుకొని ఒకే ఒక్క కూపన్ 780 రూపాయలు చెల్లించి ఓసీలు డ్రైవర్ కు 1 చొప్పున సంబంధిత రెవెన్యూ అధికారులకు ఒకటి చొప్పున తీసుకోని ఇసుకను తరలించుకోవాలని నిబంధనలు ఉన్నప్పటికీ కొందరు రెవెన్యూ సిబ్బంది మండల అధికారుల తీరుతో యధావిధిగా ఓటీపీలు లేకుండా లాగిన్ కాకుండా సంబంధిత ఇంచార్జి జిపిఓ మ్యానువల్ గా ఆమోదముద్ర వేస్తూ ఒక్కొక్క ట్రాక్టర్ లెక్కలేనన్ని ట్రిప్పులు వేస్తున్నట్లు విమర్శలు ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధన ప్రకారం ప్రహరీ గోడ నిర్మాణం కానీ సీసీ రోడ్లు ఇతర అభివృద్ధి పనులకు పరిమిత సంఖ్యలో ఐదు కూపన్లకు అనుమతులు ఉంటాయని తెలిసింది. అయినప్పటికీ అడ్డదారుల్లో ఒకే ఒక్క కూపన్ కు సంబంధిత మీ సేవలలో నగదును చెల్లించి ఎటువంటి ఓసీలు లేకుండా రెవెన్యూ అధికారులు సంబంధిత యాప్ లో లాగిన్ కాకుండా ఓటీపీలు అంతకంటే లేకుండా ఓసీలు అనే రికార్డులను సైతం విస్మరించి దర్జాగా అక్రమ ఇసుక రవాణాకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ దండిగా దండుకుంటున్నట్లు విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో అధికారుల పాత్ర పై పలు అనుమానాలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన సంబంధిత శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రభుత్వ ఖజానాకు నిత్యం గండిపడుతుందని పలువురు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై మన ప్రజావాణి తెలుగు దినపత్రిక వర్ష కథనాలు వెలువడుతున్నప్పటికీ సంబంధిత పర్యవేక్షణ శాఖలలో చలనం లేకపోవడం విశేషం. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమార్కులపై సమగ్ర విచారణ చేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఓసీలు ఓటీపీలో లేకుండా జరుగుతున్న అక్రమ దందాను అడ్డుకోవాలని పలువురు మండల ప్రజలు బహిరంగంగా కోరుతున్నారు.

మ్యానువల్ బిల్లుల సృష్టి.. స్థానిక చింతకాని తహసిల్దార్ రెవిన్యూ డివిజనల్ అధికారి వివరాలతో.. మరో కథనంలో వేచి చూడండి..!

ఆరుట్లలో అంగరంగ వైభవంగా దుర్గామాత శోభాయాత్ర

● వేణుగోపాల స్వామి భజన మండలి ఆధ్వర్యంలో ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 23 (ప్రజావాణి):మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో వేణుగోపాల స్వామి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్న దుర్గామాతకు పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి సంబంధించిన వస్తువుల వేలంపాట నిర్వహించారు.ఈ వేలంపాటలో అమ్మవారి ముక్కుపుడకను సాతిరి పరమేష్ రూ.2 లక్షలకు దక్కించుకున్నారు. అమ్మవారి పెద్ద చీరను తవిటి యాదగిరి ముదిరాజ్ రూ.38 వేల రూపాయలకు, కుంకుమార్చన చీరను గోనిశెట్టి అక్షయ్ రూ.45 వేల రూపాయలకు, అమ్మవారి కలశాన్ని సిద్దగోని యాదయ్య గౌడ్ రూ.51 వేల రూపాయలకు దక్కించుకున్నారు.అనంతరం ఆరుట్ల గ్రామ సర్పంచ్ మానిపాటి శోభా కుమార్, ఉపసర్పంచ్ నూకం రాజు ముదిరాజ్, మంచాల సహకార సంఘం మాజీ చైర్మన్ మొద్దు సికిందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ చీరాల రమేష్, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, వైఎస్సార్ మాధగోని జంగయ్య గౌడ్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, వివిధ కుల సంఘాల నాయకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొబ్బరికాయలు కొట్టి శోభాయాత్రను ప్రారంభించారు.శోభాయాత్రలో మహిళలు బతుకమ్మ ఆటలతో సందడి చేయగా, చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. వీధి భాగోతాల కళాకారుల ప్రదర్శనలు, యువకుల డీజే నృత్యాలు, వివిధ కళాకారుల ప్రదర్శనలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.గ్రామంలోని పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని దుర్గామాత శోభా యాత్రను విజయవంతం చేయడం జరిగింది.

వెయ్యేళ్ల నాటి శివాలయానికి పునర్వైభవం

- నవంబరు 20వ తేదీన పునర్నిర్మాణ పనులకు శ్రీకారం
- భక్తులు, దాతలు సహకరించాలి:
- ఆలయ చైర్మన్ జనమంచి సీతారామ శర్మ ద్వివేది

ప్రజావాణి,నంగునూరు అక్టోబర్ 23: చాళుక్యుల కాలం నాటి వెయ్యేళ్ల చరిత్ర కలిగిన పురాతన శివాలయానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు పునర్నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. కాల గమనంలో శిథిలావస్థకు చేరిన ఈ చారిత్రక ఆలయాన్ని పునరుద్ధరించి భావితరాలకు ఆధ్యాత్మిక వారసత్వంగా అందించాలనే లక్ష్యంతో నవంబరు 20వ తేదీన ఉదయం 9.30 గంటలకు పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు, దాతలు ఉదారంగా సహకరించాలని ఆలయ చైర్మన్ జన మంచి సీతారామ శర్మ ద్వివేది పిలుపునిచ్చారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకులలోని సుమారు వెయ్యేళ్ల చరిత్ర కలిగిన శివాలయం శిథిలావస్థకు చేరడంతో దాని పునర్నిర్మాణానికి ఆలయ నిర్వాహకులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నవంబరు 20న ఉదయం 9.30 గంటలకు పునర్నిర్మాణ పనులను ప్రారంభిస్తామని ఆలయ చైర్మన్ జనమంచి సీతారామ శర్మ ద్వివేది తెలిపారు. చాళుక్యుల కాలంలో నిర్మించిన ఈ శివాలయం పురాతన చరిత్రకు, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. ఎన్నో ఏళ్లుగా భక్తుల పూజలందుకున్న ఈ ఆలయం కాలక్రమేణా శిథిలావస్థకు చేరుకుంది. ఆలయ ప్రాశస్త్యాన్ని కాపాడటంతో పాటు భవిష్యత్తు తరాలకు ఈ చారిత్రక వారసత్వాన్ని అందించాలనే సంకల్పంతో పునర్నిర్మాణ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఆలయాన్ని పూర్వ వైభవంతో తీర్చిదిద్ది భక్తులకు మెరుగైన ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా పనులు చేపట్టనున్నారు.శృంగేరి జగద్గురువుల సూచన మేరకు 2023లో ఆలయ పునరుద్ధరణకు సంబంధించి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా శత చండి యాగం, స్థలశుద్ధి కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం బాలాలయాన్ని నిర్మించి, శివుడిని పునః ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమాలతో ఆలయ పునరుద్ధరణకు పునాది పడింది. ప్రస్తుతం ప్రధాన ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వెయ్యేళ్ల చరిత్ర కలిగిన శివాలయాన్ని పునర్నిర్మించి ఆధ్యాత్మిక వైభవాన్ని పునరుద్ధరించేందుకు భక్తులు, శివభక్తులు, దాతలు తమవంతు సహకారం అందించాలని ఆలయ చైర్మన్ జనమంచి సీతారామ శర్మ ద్వివేది కోరారు. ధార్మిక కార్యక్రమాలకు సహకరించే దాతల భాగస్వామ్యంతో ఆలయ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు. చారిత్రక ఆలయ పరిరక్షణను సామూహిక బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ ఈ మహత్తర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పురాతన ఆలయాల పరి రక్షణతో చరిత్ర, సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాలు సజీవంగా ఉంటాయని, అందువల్ల ఈ శివాలయ పునర్నిర్మాణానికి భక్తుల సహకారం ఎంతో అవసరమని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మంథని బస్టాండ్ ఎదుట షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలి

● మంత్రులు, ఆర్టీసీ ఎండీకి మున్సిపల్ పాలకవర్గం వినతిపత్రం

మంథని నియోజకవర్గ ప్రతినిధి, అక్టోబర్ 23,ప్రజావాణి:మంథని పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట రోడ్డు విస్తరణలో భాగంగా దుకాణాలు కోల్పోతున్న చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ వసతి కల్పించాలని మున్సిపల్ పాలకవర్గం కోరింది. బస్టాండ్‌కు సంబంధించిన కొంత స్థలాన్ని కేటాయించి, అక్కడ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డికి వినతిపత్రాలు అందజేశారు.మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యుడు ఎల్లెంకి వంశీధర్ కలిసి సంబంధిత ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ ఆవశ్యకతను వివరించారు.రోడ్డు విస్తరణతో దుకాణాలు కోల్పోతున్న చిరు వ్యాపారులకు తిరిగి వ్యాపారాలు నిర్వహించుకునే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడితే స్థానిక వ్యాపారులకు ఉపాధి భద్రత కలగడంతోపాటు, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో వాణిజ్య కార్యకలాపాలు మెరుగుపడతాయని తెలిపారు.మంథని పట్టణం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రయాణికులు, వ్యాపారులు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ఈ ప్రతిపాదన ఉపయోగపడుతుందని వివరించారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయింపు, అనుమతులు, నిధుల మంజూరుపై పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రులు, ఆర్టీసీ ఎండీని కోరారు.

జుక్కల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే కు బిచ్కుంద పార్టీ ఆఫీస్ కార్యాలయంలో ఘనంగా దసరా అలయ్ బలయ్ కార్యక్రమం..

- బిఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు భాను ప్రసాద్ గౌడ్ జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే కు వారి సతీమణి శోబమ్మ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు..
- జుక్కల్ నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన జుక్కల్ మండల యూత్ అధ్యక్షులు భాను గౌడ్

మన ప్రజావాణి జుక్కల్ ఆర్ సి ప్రతినిధి అక్టోబర్ 23 విజయదశమి (దసరా) పండుగను పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలోని జుక్కల్ బిఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షులు భాను ప్రసాద్ గౌడ్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే నివాసంలో అలయ్ బలయ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జుక్కల్ నియోజకవర్గ పరిధిలోని జుక్కల్, కౌలాస్, సావర్గావ్, లాడే గావ్ , సోపూర్, లొంగన్, వజ్రకండి, వివిధ గ్రామాల నుండి అలాగే వివిధ మండలాల నుండి తదితర గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ని మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వారి కుమారుడు హరీష్ షిండేకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. సంప్రదాయం ప్రకారం జమ్మి ఆకులను బంగారంగా భావించి పరస్పరం ఇచ్చిపుచ్చుకుంటూ పండుగ శుభాకాంక్షలు పంచుకున్నారు.దసరా అలయ్ బలయ్ కార్యక్రమం సంప్రదాయాలు, ఆత్మీయత, సోదరభావానికి ప్రతీకగా నిలిచింది. ఈ సందర్భంగా జుక్కల్ నియోజకవర్గ ప్రజలందరికీ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ యూత్ మండల అధ్యక్షులు భాను ప్రసాద్ గౌడ్,వగ్మారే మారుతి, మొగులాజి, రహీం, మాజిత్ తదితరులు పాల్గొన్నారు..

బెజ్జంకిలో ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

● 80 మందికి నేత్ర పరీక్షలు.. 27 మందికి శస్త్రచికిత్సలు అవసరమని నిర్ధారణ

బెజ్జంకి, అక్టోబర్ 23 (ప్రజావాణి):సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, రేకుర్తి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మొత్తం 80 మందికి వైద్యులు నేత్ర పరీక్షలు నిర్వహించగా, వారిలో 27 మందికి శస్త్రచికిత్సలు అవసరమని నిర్ధారించారు. దీంతో వారిని తదుపరి చికిత్స నిమిత్తం రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు.శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఉచిత రవాణా, భోజన వసతితో పాటు అద్దాలు, మందులు కూడా ఉచితంగా అందజేయనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జానకి రాములు తెలిపారు. చూపు సమస్యలతో బాధపడుతున్న పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం సంతోషంగా ఉందన్నారు. వేలాది రూపాయలు ఖర్చయ్యే నేత్ర వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్న రేకుర్తి కంటి ఆసుపత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొల్లం శ్రీధర్, ఉపసర్పంచ్ దుమాల మహేష్, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్ రెడ్డి, నేత్ర వైద్య నిపుణులు చింతల ప్రభాకర్, లయన్స్ క్లబ్ కార్యదర్శి సుధాకర్ రెడ్డి, కోశాధికారి రామంచ రవీందర్, కచ్చు రాజయ్య, చీరాల రవీందర్, ఎలుక రవీంద్ర ప్రసాద్, కారోబార్ బోనగిరి లక్ష్మణ్, గ్రామపంచాయతీ సిబ్బంది శివ, సంపత్ తదితరులు పాల్గొన్నారు

శనివారం,
అక్టోబర్ 24, 2026
మన సమగ్ర ప్రజావాణి తెలుగు డైలీ

హుజూర్‌నగర్ బీఆర్‌ఎస్‌లో నాయకత్వ శూన్యతకు తెరదించాలి

- వెంటనే నియోజకవర్గ ఇన్‌చార్జిని నియమించాలి
- ఇతర సామాజిక వర్గాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి
- పార్టీ ఫండ్ దుర్వినియోగంపై విచారణ జరపాలి: గుగులోత్ నీలహేమ్లా నాయక్

గరిడేపల్లి, అక్టోబర్ 23 (ప్రజావాణి): హుజూర్‌నగర్ నియోజకవర్గంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలంటే వెంటనే సమర్థవంతమైన నియోజకవర్గ ఇన్‌చార్జిని నియమించాలని హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ గిరిజన నాయకుడు గుగులోత్ నీలహేమ్లా నాయక్ పార్టీ అధిష్ఠానాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో నాయకత్వంపై స్పష్టత లేకపోవడం, కార్యకర్తల సమస్యలు పరిష్కారం కాకపోవడం, పార్టీ కార్యక్రమాల్లో సమన్వయం కొరవడటంతో శ్రేణుల్లో అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు.

ఇతర సామాజిక వర్గాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

పార్టీలో ఒక నిర్దిష్ట సామాజిక వర్గానికే రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తూ, ఇతర సామాజిక వర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను విస్మరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయని నీలహేమ్లా నాయక్ అన్నారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు సాగాల్సిన బీఆర్ఎస్‌లో వర్గ రాజకీయాలకు తావుండకూడదని స్పష్టం చేశారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన నాయకులు వ్యక్తిగత ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నారనే ఆరోపణలపై అధిష్ఠానం దృష్టి సారించాలని కోరారు.

ఎన్నికల్లో పనిచేసిన కార్యకర్తలకు న్యాయం చేయాలి

గత ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పార్టీ నిధులను సక్రమంగా వినియోగించలేదని, నిధుల దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలు ఉన్నాయని నీలహేమ్లా నాయక్ పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పార్టీ అధిష్ఠానం నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలకు అండగా నిలవాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. కార్యకర్తల సంక్షేమాన్ని విస్మరించి, పార్టీ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే క్షేత్రస్థాయిలో పార్టీ బలహీనపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

అధిష్ఠానం వెంటనే స్పందించాలి

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పరిస్థితిని పార్టీ అధిష్ఠానం సమీక్షించాలని నీలహేమ్లా నాయక్ కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, కార్యకర్తల సమస్యలను పరిష్కరించగల సామర్థ్యం ఉన్న నాయకుడిని వెంటనే నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలపై విచారణ జరిపి, తప్పులు చేసినట్లు నిర్ధారణ అయితే తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. నాయకుల మధ్య ఆధిపత్య పోరు, వర్గ రాజకీయాలు, పరస్పర అనుమానాలు కొనసాగితే పార్టీతోపాటు దానిని నమ్ముకున్న కార్యకర్తలు కూడా నష్టపోతారని హెచ్చరించారు. అన్ని సామాజిక వర్గాలకు సముచిత గుర్తింపు, పార్టీ శ్రేణులకు గౌరవం, నాయకులకు బాధ్యత కల్పించినప్పుడే బీఆర్ఎస్‌ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు.

వర్గ రాజకీయం కాదు.. కార్యకర్తల ఐక్యత ముఖ్యం! పదవుల రాజకీయం కాదు.. ప్రజల కోసం పోరాటమే లక్ష్యం కావాలి! ఇదే హుజూర్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల ఆకాంక్ష అని గుగులోత్ నీలహేమ్లా నాయక్ పేర్కొన్నారు.

ఓటు హక్కుల తొలగింపును అరికట్టాలి.. ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలి

- దళితులు, ఆదివాసీలు, మైనారిటీల ఓట్లను లక్ష్యంగా చేసుకుంటున్నారని ప్రజా సంఘాల ఆరోపణ

ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి అక్టోబర్ 23 పెద్దపల్లిలో కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై నిరసన.. జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మ దహనానికి యత్నందేశవ్యాప్తంగా అమలు చేస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ ప్రక్రియ ద్వారా దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, యువత ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజా సంఘాల పిలుపు మేరకు శుక్రవారం పెద్దపల్లిలో సీఐటీయూ, కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలి: కల్లెపల్లి అశోక్

ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కల్లెపల్లి అశోక్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, మైనారిటీల ఓటు హక్కులకు నష్టం కలిగించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆరోపించారు. తమకు వ్యతిరేకంగా ఓటు వేసే ప్రజల ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా అనేకమంది యువత ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. ఈ విధానానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత, ప్రజాస్వామికవాదులు ఆందోళనలు చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను బాధ్యతల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

ఓటు హక్కును కాపాడాలి: సీఐటీయూ నాయకురాలు జి. జ్యోతి

సీఐటీయూ జిల్లా నాయకురాలు జి. జ్యోతి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా దేశంలో కోట్లాది మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాల్సిన వ్యవస్థలో అక్రమాలకు తావివ్వడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ఓటు హక్కును తొలగించడం అంటే ప్రజల ప్రజాస్వామిక హక్కులను హరించడమేనని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం తీరుపై ప్రతిపక్షాలు, విద్యార్థులు, యువత నిరసన వ్యక్తం చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేసి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆమె డిమాండ్ చేశారు.

తొలగించిన ఓట్లను తిరిగి చేర్చాలి: ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జిల్లాల ప్రశాంత్

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జిల్లాల ప్రశాంత్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత ఉద్యమాలు చేస్తున్నారని తెలిపారు. శాంతియుతంగా నిరసనలు తెలియజేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తూ, వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రజల నిరసనలను అణచివేసే ప్రయత్నాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో తొలగించిన ఓట్లను తిరిగి ఓటరు జాబితాలో చేర్చాలని, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ, కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ నాయకులు సిపెల్లి రవీందర్, మోదెంపల్లి శ్రావణ్, కొమురయ్య, రాకేష్, ఆదికృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, గౌతమ్ సాహు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ సర్కార్ నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో ‘కృత్రిమ కరువు’

- బీఆర్ఎస్ నేతలు బొడ్డు రవీందర్, ఉ ప్పు రాజ్‌కుమార్
- కాళేశ్వరం పునరుజ్జీవం కోసమే 400 కిలోమీటర్ల సైకిల్ యాత్ర
- అక్టోబర్ 28న మేడిగడ్డ ను ంచి కొండపోచమ్మ సాగర్ వరకు యాత్ర

ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, అక్టోబర్ 23

కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ, రైతాంగానికి తక్షణమే సాగునీటి విడుదల డిమాండ్‌తో ఈ నెల 28 నుంచి మేడిగడ్డ బ్యారేజ్ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు సుమారు 400 కిలోమీటర్ల మేర మహా సైకిల్ యాత్రను చేపడుతున్నట్లు బీఆర్ఎస్ గోదావరిఖని పట్టణ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ బొడ్డు రవీందర్, బీఆర్ఎస్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఉప్పు రాజ్‌కుమార్ సంయుక్తంగా ప్రకటించారు. శుక్రవారం పెద్దపల్లి కమాన్ రోడ్డులోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బొడ్డు రవీందర్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి దశాబ్దాల తెలంగాణ నీటి గోసను తీర్చారని గుర్తుచేశారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం కేసీఆర్‌పై ఉన్న రాజకీయ అక్కసుతోనే కాళేశ్వరం ప్రాజెక్టును నిరుపయోగంగా మార్చి, రాష్ట్రంలో కృత్రిమ కరువు సృష్టించిందని మండిపడ్డారు. మేడిగడ్డ వద్ద 80 పిల్లర్లలో ఒకటి రెండు పిల్లర్లకు సమస్య వస్తే, చిన్నపాటి గ్రౌటింగ్ లేదా తాత్కాలిక మరమ్మతులు చేసి నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం కావాలనే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నిత్యం 20 వేల క్యూసెక్కులకు పైగా గోదావరి జలాలు వృథాగా సముద్రం పాలవుతున్నా, 90-93 మీటర్ల లెవెల్ ఉన్నప్పుడు పంపులు ఆన్ చేసి నీటిని లిఫ్ట్ చేయకపోవడం దుర్మార్గమన్నారు. ప్రాజెక్టులోని వందల కిలోమీటర్ల టన్నెల్స్, పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్లు అన్నీ సక్రమంగా ఉన్నా, మొత్తం ప్రాజెక్టే పనికిరాదంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు.

10 నియోజకవర్గాల మీదుగా సాగనున్న సైకిల్ యాత్ర

బీఆర్ఎస్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్

గతంలో గోదావరి కన్నీటి గోస పేరుతో 180 కిలోమీటర్ల పాదయాత్ర చేసినప్పటికీ ప్రభుత్వంలో ఎలాంటి చలనం రాలేదని బీఆర్ఎస్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఉప్పు రాజ్‌కుమార్ అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతులు రెండో పంట వేసుకోవద్దని ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటని, రైతుల కష్టాలను స్వయంగా తెలుసుకుంటూ ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఈ 400 కి.మీ. సైకిల్ యాత్రను చేపడుతున్నామని వివరించారు. ఈ యాత్ర అక్టోబర్ 28న మేడిగడ్డ వద్ద ప్రారంభమై దాదాపు 10 అసెంబ్లీ నియోజకవర్గాల గుండా సాగి కొండపోచమ్మ సాగర్ వద్ద ముగుస్తుందని తెలిపారు. కాళేశ్వరం పునరుజ్జీవం కోసం తాము చేపట్టే ఈ పోరాటానికి తెలంగాణవాదులు, ఉద్యమకారులు, యువత, రైతులు, పాత్రికేయ మిత్రులు పెద్ద ఎత్తున మద్దతు తెలిపి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కాశిపాక వాసు, పల్లె మధు, లక్ష్మణ్ గౌడ్, ముత్యం తదితరులు పాల్గొన్నారు.

ఝరాసంగం కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో

- ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్
- నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి ఎన్నికైన
- బీఎస్ వీర్ శెట్టి కి ప్రత్యేక సన్మానం

ప్రజా వాణి న్యూస్ అక్టోబర్ 23 సంగారెడ్డి జిల్లా ఝరాసంగం శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి దేవస్థాన నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్, మాజీ మంత్రివర్యులు, జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి డా. ఏ. చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్ కి, పాలక మండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి వారి ఆశీస్సులతో ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలు మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి ఎన్నికైన బీఎస్ వీర్ శెట్టి ని జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్ పీసీసీ సభ్యులు శంకరయ్య స్వామి ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ శంకర్ పాటిల్, హుగ్గెల్లి రాములు, భాస్కర్ రెడ్డి, సువర్ణ--మల్లన్న పాటిల్, పవన్ రాథోడ్, మాజీ మండల అధ్యక్షులు హన్మంత్ రావు పాటిల్, శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆర్షద్ అలీ, బడంపేట్ రాచన్న స్వామి ఆలయ కమిటీ చైర్మన్ జగదీష్ స్వామి, కాంగ్రెస్ నాయకులు ముల్తానీ, ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోలీసు వ్యవస్థపై అవగాహన

- ఓపెన్ హౌస్ ద్వారా పోలీసుల విధులు, మహిళల భద్రతపై వివరించిన అధికారులు

బెజ్జంకి, అక్టోబర్ 23 (ప్రజావాణి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సిద్దిపేట జిల్లా బెజ్జంకి పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పోలీసుల విధులు, బాధ్యతలు, పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాల పనితీరును వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర, ప్రజల రక్షణ కోసం చేపట్టే చర్యలను వివరించడంతో పాటు విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. మహిళల భద్రత, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పిస్తూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. చిన్నతనం నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించడం, పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచడం, పోలీసు సేవలను ప్రజలకు చేరువ చేయడం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో బెజ్జంకి పోలీస్ స్టేషన్ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా జెస్సు అనిల్ కుమార్

- ఘనంగా సన్మానించిన ఆర్మూర్ బార్ అసోసియేషన్

ఆర్మూర్ టౌన్, అక్టోబర్ 23 (మన సమగ్ర ప్రజావాణి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిజామాబాద్ జిల్లా ఎన్నికల్లో విజయం సాధించి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన ఆర్మూర్ పట్టణ ప్రముఖ న్యాయవాది, మాజీ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్ కుమార్‌ను ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఘనంగా సన్మానించింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్ చందర్ అధ్యక్షతన ఆర్మూర్ బార్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జెస్సు అనిల్ కుమార్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ, జెస్సు అనిల్ కుమార్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమితులు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆయన ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వాలను విస్తరించడంతో పాటు, సేవా దృక్పథంతో కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ప్రజలకు రెడ్‌క్రాస్ సొసైటీ అందించే వైద్య, ఆరోగ్య సేవలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో యువతలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, యువతను చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రక్తదానం, అవయవదానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయడంలో రెడ్‌క్రాస్ సొసైటీ కీలక పాత్ర పోషించాలని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా జెస్సు అనిల్ కుమార్ మాట్లాడుతూ, తనను సన్మానించిన ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తృతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని, ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సుదర్శన్‌తో పాటు సీనియర్ న్యాయవాదులు లోక భూపతిరెడ్డి, గంగారెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, శ్రీధర్, కిష్టయ్య, జక్కుల శ్రీధర్, జగన్, మురళి, తెడ్డు నర్సయ్య, పవన్, తాజొద్దిన్, ఖాందేశ్ సంగీత, బోచ్‌కర్ వీణ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు

మద్దూరులో జ్ఞానేశ్ కుమార్ దిష్టి బొమ్మ దగ్ధం

మద్దూరు అక్టోబర్23, ప్రజా వాణి, కేంద్ర ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ ను వెంటనే పదవి నుంచి తొలగించాలని గొర్రెల మేకల పెంపకదారుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలేటి యాదగిరి డిమాండ్ చేశారు. శుక్రవారం మద్దూరు మండల కేంద్రంలో సిఐటియు, రైతు సంఘం, గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం, ప్రజానాట్యమండలి ,సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎస్ఐఆర్ పేరుతో జ్ఞానేష్ కుమార్ నాయకత్వంలో ప్రతిపక్షాల నాయకులవి, ప్రశ్నించే వారి ఓట్లను పెద్ద ఎత్తున తొలగిస్తున్నారని ఈ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని బాధ్యులైన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఎండి షఫీ,రైతు సంఘం మండల కార్యదర్శి బెజాడి మల్లారెడ్డి,ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వేల్పుల విజయ్ కుమార్,నాయకులు పిట్టల నరేష్, మల్లేశం,మురళి, సాయిలు,ప్రభాకర్,తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం...

- ప్రసంగిస్తున్న ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఆయిలయ్య.

యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23 యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని శుక్రవారం రోజు నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ , ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఆయిలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించేందుకు పార్టీ నాయకులు , కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని ఆయన కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని , పట్ట భద్రులను కలిసి అభ్యర్థికి మద్దతు కోరాలని పిలుపు నిచ్చారు. ఎన్నికల సన్నాహాల్లో భాగంగా పార్టీ శ్రేణులు సమష్టిగా పని చేస్తూ ప్రచార కార్య క్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్...

● ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య

యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23 యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరిగుట్ట మండలం మైలార్ గూడెం గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ , ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య శుక్రవారం రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వ కొనుగోలు ప్రక్రియను సద్వినియోగం చేసు కోవాలని సూచించారు. రైతులకు ధాన్యం విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత నిస్తూ , ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు సమన్వయం తో పనిచేయాలని సూచించారు.

బాలవికాస ఆధ్వర్యంలో అనాథ వృద్ధులకు ఆపన్నహస్తం

● ఒక్కొక్కరికి రూ.5 వేల విలువైన నిత్యావసర సరుకులు,దుస్తుల పంపిణీ

బెజ్జంకి,అక్టోబర్ 23 (ప్రజావాణి): సేవాభావంతో వృద్ధులకు అండగా నిలవాలనే లక్ష్యంతో సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల పరిధిలోని బెజ్జంకి క్రాసింగ్‌లో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో అనాథ వృద్ధుల ఆదరణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు నిత్యావసర సరుకులు, దుస్తులను పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి సుమారు రూ.5 వేల విలువైన వస్తువులను అందజేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బెజ్జంకి ఎస్సై తోట తిరుపతి మాట్లాడుతూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు మానవత్వానికి ప్రతీకగా నిలుస్తాయని అభినందించారు. వృద్ధులకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ వారి జీవితాల్లో భరోసా నింపడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించి, బాలవికాస సంస్థ సేవా కార్యక్రమాలను పరిచయం చేసిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై సంస్థ నిర్వహించే కార్యక్రమాల్లో తన వంతు బాధ్యతగా సహకరిస్తానని హామీ ఇచ్చారు.బాలవికాస సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అమూల్య సంస్థ ఆధ్వర్యంలోఅమలవుతున్న వివిధ పథకాలు, సేవా కార్యక్రమాల గురించి వివరించారు. సమాజంలోని నిరాదరణకు గురైన వృద్ధులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి గ్రామ సర్పంచ్ గాజె రవళి, దాచారం ఉపసర్పంచ్ బాల నర్సు, మీ సేవ శ్రీనివాస్, నాచారం విజయ, బాలవికాస కోఆర్డినేటర్లు అన్నమేరి, వట్టి సుజాత, గాదె సుజాత,వనిత, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, నిత్యవసర సరుకుల పై కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు తీసుకోవాలి!

నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి ఎల్‌నినో ప్రభావం వల్ల పంటల దిగుబడి పడిపోతుందనే సాకుతో కొందరు వ్యాపారులు బియ్యం తదితర నిత్యావసర సరుకులను అక్రమంగా నిల్వ చేస్తూ కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారని తెలంగాణ ఉద్యమకారులు కళ్లెం సురేందర్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన చండూరులో మాట్లాడుతూ.. దీనిని అరికట్టేందుకు రేషన్ షాపులు మరియు రైతు బజార్ల ద్వారా నిత్యావసరాలను అందుబాటులోకి తేవడానికి చర్యలు చేపట్టాలని కోరారు. బియ్యం ధరలు ఒక్కసారిగా క్వింటాలుకు రూ. 8000 నుంచి రూ. 10,000 పెరగడంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలను తీవ్రంగా ఆందోళనకు గురి చేస్తోందని, నిత్యావసర వస్తువులను తక్కువ ధరలకు అందిస్తాయని భావించే కొన్ని రిటైల్ స్టోర్లలోనే బియ్యం ధరలు గణనీయంగా పెరిగినట్లు వినియోగదారులు చెపుతున్నారు అని అన్నారు. దీంతో బహిరంగ మార్కెట్‌లో పరిస్థితి ఇంకెంత తీవ్రంగా ఉందో అని ఆవేదన చెందారు. బియ్యం ధరల పెరుగుదలకు ఎల్ నినో ప్రభావమే ప్రధాన కారణమని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో బియ్యం నిల్వలు, సరఫరా, మార్కెట్‌లో జరుగుతున్న ధరల మార్పులపై సమగ్రంగా సమీక్ష నిర్వహించాలని అన్నారు. ఎల్ నినో కారణంగానే ధరలు పెరుగుతున్నాయా? లేక కొందరు వ్యాపారులు పరిస్థితిని ఆసరాగా చేసుకుని కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా? అనే అంశంపై పూర్తిస్థాయి విచారణ జరిపి ధరలను నియంత్రించే చర్యలు తీసుకోవాలని కోరారు.

గోపతండలో ఉద్యోగ విరమణ సన్మానం

● ఉద్యోగికి ఘన వీడ్కోలు.. ప్రతిభావంతులకు ప్రోత్సాహం

● విద్యాభివృద్ధికి ఉద్యోగుల అసోసియేషన్ చేయూత.. విద్యార్థులకు ప్లేట్లు గ్లాసులు పంపిణీ

ప్రజావాణి మోతె, అక్టోబర్ 23: గ్రామీణ యువతకు ప్రోత్సాహం.. విద్యార్థులకు చేయూత.. గ్రామాభివృద్ధికి ఐక్య కార్యాచరణే లక్ష్యంగా గోపతండ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన కోర్ర రాంకోటిని ఘనంగా సన్మానించారు. గోపతండ నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించిన తొలి వ్యక్తిగా గుర్తింపు పొందిన ఆయన సేవలను కొనియాడారు. ఆయన ప్రస్థానం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

ప్రతిభకు పట్టం.. విద్యార్థులకు చేయూత

ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులతో పాటు ఉద్యోగ రంగంలో రాణిస్తున్న మహిళలు, ఐఐటీ, నీట్, ఎంబీబీఎస్, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యా రంగాల్లో ప్రతిభ చాటిన వారిని శాలువాలతో సత్కరించి అభినందించారు. వారి విజయాలు గ్రామానికి గర్వకారణమని, మరింత మంది విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. గ్రామ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసి విద్య ప్రాముఖ్యతను చాటిచెప్పారు.

గ్రామాభివృద్ధికి ఐక్యంగా ముందుకు గ్రామంలో విద్య, ఉపాధి అవకాశాలు, మహిళల ప్రోత్సాహం, యువత భవిష్యత్తు, స్థానిక సమస్యల పరిష్కారంపై చర్చించారు. గ్రామ ప్రజలంతా ఐక్యంగా ముందుకు సాగి అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్య భిక్కు నాయక్, గ్రామ పెద్దలు, ఉద్యోగులు, యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొత్తగూడెం డీఎస్పీ అధ్వర్యంలో సఫాయి బస్తి ఏరియాలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

● ఈ ఆపరేషన్ 49 వాహనాలపై జరిమానాలు, 87 మద్యం సీసాలు స్వాధీనం..

భద్రాద్రి జిల్లా బ్యూరో, అక్టోబర్ 23 (మన ప్రజావాణి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సఫాయి బస్తి ఏరియాలో శుక్రవారం రోజు తెల్లవారుజామున 4:00 గంటల నుంచి ఉదయం 7:00 గంటల వరకు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ పర్యవేక్షణలో సబ్ డివిజన్ పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 47 ద్విచక్ర వాహనాలు, 2 త్రిచక్ర వాహనాలను గుర్తించి మొత్తం 49 వాహనాలపై చట్టప్రకారం జరిమానాలు విధించారు. అదేవిధంగా 87 ఐఎంఎఫ్ఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా డీఎస్పీ ఆదినారాయణ స్థానికులతో మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఎన్‌డీపీఎస్ చట్టం కింద ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించారు. గంజాయి సేవించే వ్యక్తుల గురించి లేదా మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మాదకద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించి, అవసరమైన చర్యలు చేపట్టేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ, వారు ఎవరితో స్నేహం చేస్తున్నారు, ఎక్కడికి వెళుతున్నారు. అనే విషయాలపై తగిన పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. పేకాట, జూదం, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా ఓటీపీ, యూపీఐ మోసాలు, నకిలీ ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని, ప్రాంతంలో మతసామరస్యాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో సీఐలు ఇంద్రసేనారెడ్డి, జితేందర్‌తో పాటు పోలీసు అధికారులు, సుమారు 80 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

● భద్రాద్రి జిల్లా డీఆర్వో పద్మావతి

● ప్రమాదాలు జరిగే ప్రదేశంలో భద్రతా చర్యలు తీసుకోవాలి.

భద్రాద్రి జిల్లా బ్యూరో, అక్టోబర్ 23 (మన ప్రజావాణి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ భద్రతా చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. శుక్రవారం రోజు ఐడీఓసీ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో జిల్లాలో నమోదైన రోడ్డు ప్రమాదాలు, మరణాలు, గాయపడిన వారి వివరాలతో పాటు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. జిల్లాలో జనవరి 1 నుంచి అక్టోబర్ 15 వరకు మొత్తం 410 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయని అధికారులు వివరించారు. వీటిలో 179 ప్రాణాంతక ప్రమాదాలు కాగా, 231 ప్రాణాపాయం లేని ప్రమాదాలుగా నమోదయ్యాయి. ఈ ప్రమాదాల్లో 191 మంది ప్రాణాలు కోల్పోగా, 26 మంది తీవ్రంగా, 383 మంది స్వల్పంగా గాయపడ్డారు. నమోదైన మొత్తం 410 ప్రమాదాలకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. రోడ్డు ప్రమాదాల కారణంగా విలువైన ప్రాణాలు కోల్పోతుండటంపై ఆందోళన వ్యక్తం చేసిన డీఆర్వో, ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.రహదారుల వారీగా ప్రమాదాల వివరాలను పరిశీలిస్తే, జాతీయ రహదారులపై అత్యధికంగా 177 ప్రమాదాలు జరిగి 75 మంది మృతి చెందారు. గ్రామీణ రహదారులపై 71 ప్రమాదాల్లో 41 మంది, ఇతర జిల్లా రహదారులపై 66 ప్రమాదాల్లో 33 మంది, రాష్ట్ర రహదారులపై 54 ప్రమాదాల్లో 21 మంది ప్రాణాలు కోల్పోయారు. స్థానిక రహదారులపై 31 ప్రమాదాల్లో 16 మంది, ప్రధాన జిల్లా రహదారులపై ఆరు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందినట్లు అధికారులు వివరించారు. ప్రమాదాలు అధికంగా నమోదవుతున్న రహదారులను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని డీఆర్వో ఆదేశించారు. అక్టోబర్ 1 నుంచి 15 వరకు జిల్లాలో 21 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా, వీటిలో 10 ప్రాణాంతక ప్రమాదాలు నమోదయ్యాయి. ఈ పదిహేను రోజుల వ్యవధిలోనే 10 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. ఇటీవల జరిగిన ప్రమాదాలకు గల కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డీఆర్వో సూచించారు.ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు, రోడ్ మార్కింగ్‌లు, రిఫ్లెక్టర్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రమాదకర మలుపులు, కూడళ్లు, రహదారులపై ఉన్న ఇతర సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. రహదారుల భద్రతకు సంబంధించిన పనుల్లో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఆర్వో పద్మావతి సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు తదితర వాహనదారులు సీట్‌బెల్ట్ వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై పోలీస్, రవాణా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.జిల్లాలో నమోదైన హిట్ అండ్ రన్ కేసుల వివరాలను అధికారులు సమావేశంలో వివరించారు. మొత్తం ఎనిమిది కేసులు నమోదు కాగా, బూర్గంపహాడ్, టేకులపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండేసి కేసులు, అన్నపురెడ్డిపల్లి, దమ్మపేట, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒక్కొక్క కేసు నమోదైనట్లు తెలిపారు. ఇటువంటి ఘటనలపై తగిన చర్యలు తీసుకుంటూ, బాధితులకు సకాలంలో సహాయం అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని డీఆర్వో అన్నారు. ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటికి గల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ రోడ్డు ప్రమాదాలు, మరణాలు, గాయాల సంఖ్యను తగ్గించే దిశగా కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి భూషిత్ రెడ్డి, డీఆర్ఎం జి. బాలాజీ, జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి సిహెచ్ వెంకటేశ్వర్లు, డీఎస్పీ వెంకన్న బాబు, జిల్లా వైద్య శాఖ అధికారులు, ఆర్‌అండ్‌బీ ఈఈ, ట్రాఫిక్ ఎస్ఐ, కలెక్టరేట్ సీ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

వెట్టి చాకిరి, బానిసత్వానికి సంకెళ్ళు...

■ అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్

■ కార్మికుల హక్కుల పరిరక్షణకు చట్టాలపై అవగాహన అవ సరం..

■ కార్మికుల శ్రమకు గౌరవం, తగిన ప్రతిఫలం అందేలా చూడాలి.

■ వెట్టి చాకిరి బాధితుల గుర్తింపు, పునరావాసానికి ప్రాధాన్యం

భద్రాద్రి జిల్లా బ్యూరో, అక్టోబర్ 23 (మన ప్రజావాణి): సమాజంలో కొనసాగుతున్న వెట్టి చాకిరి, బానిసత్వం వంటి అమానవీయ దురాచారాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులను పరిరక్షించడంతో పాటు, వారి శ్రమకు తగిన గుర్తింపు, ప్రతిఫలం లభించేలా చూడాలని అన్నారు. వెట్టి చాకిరి నిర్మూలనపై కార్మిక శాఖ రూపొందించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం రోజు ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ ఆవిష్కరించారు. అనంతరం అసంఘటిత రంగ కార్మికులకు వెట్టి చాకిరి నిర్మూలన, కార్మిక హక్కులు, సంబంధిత చట్టాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వెట్టి చాకిరి అనేది మానవ హక్కులకు, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించే అమానవీయ విధానమని అన్నారు. ఎవరినైనా బలవంతంగా పనులు చేయించడం, శ్రమకు తగిన ప్రతిఫలం చెల్లించకుండా పనిచేయించుకోవడం, కార్మికుల ఆర్థిక, సామాజిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని వారి శ్రమను దోపిడీ చేయడం వంటి చర్యలను అరికట్టాలని సూచించారు. ప్రతి కార్మికుడికి గౌరవప్రదమైన జీవితం గడిపే హక్కు ఉందని, వారి హక్కులకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు.తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'స్వేచ్ఛా ధనం' రాష్ట్రవ్యాప్త అవగాహన కార్యక్రమం ద్వారా వెట్టి చాకిరి నిర్మూలన, బాధితుల గుర్తింపు, వారికి పునరావాసం కల్పించడం, కార్మికుల హక్కులపై అవగాహన పెంపొందించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రజలకు చేరువ చేయడం ద్వారా వెట్టి చాకిరి నిర్మూలనకు విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నట్లు వివరించారు. వెట్టి చాకిరికి గురవుతున్న కార్మికులను గుర్తించడం, వారికి చట్టపరమైన రక్షణ కల్పించడం, బాధితులకు పునరావాసం అందించడం ఈ కార్యక్రమంలో ముఖ్యమైన అంశాలని తెలిపారు. కార్మికులు తమ హక్కులు, వాటి పరిరక్షణకు అమలులో ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎవరైనా బలవంతంగా పనులు చేయిస్తున్నా, వెట్టి చాకిరికి గురిచేస్తున్నా, శ్రమకు తగిన ప్రతిఫలం చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. వెట్టి చాకిరికి సంబంధించిన ఫిర్యాదులు, సహాయం కోసం 080-69434343 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ ద్వారా సంప్రదించి సమాచారం పొందవచ్చని తెలిపారు. కార్మికులు, బాధితులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా చట్టపరమైన సహాయం పొందేందుకు ముందుకు రావాలని సూచించారు.ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు, క్వారీలతో పాటు ఇతర పని ప్రదేశాల్లో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికులకు ప్రచార రథం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా వెట్టి చాకిరి వల్ల కలిగే అనర్థాలు, కార్మికులకు చట్టపరంగా కల్పించిన హక్కులు, రక్షణ చర్యలు, ఫిర్యాదు చేసే విధానాలపై అవగాహన కల్పించనున్నారు. కార్మికుల శ్రమకు గౌరవం లభించేలా, వారు చేసిన పనికి తగిన ప్రతిఫలం అందేలా చూడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. వెట్టి చాకిరి, బానిసత్వం వంటి దురాచారాల నిర్మూలనకు ప్రభుత్వ శాఖలు, యజమానులు, కార్మికులు, ప్రజలు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్మిక కమిషనర్ శ్యామల ప్రమోద్ కుమార్, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కె.శ్రీరామ్, సహాయ కార్మిక అధికారులు బి. నాగరాజు, పి.వి.కె. శాస్త్రి, ఎ. యేసుపాదం, చి.రజిత, ఏహెచ్‌టీఓ బృందం, ఏఐడీ ఎన్‌జీఓ ప్రతినిధులు, ఐజేఎం ప్రచార సాధకులు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగు లను రెగ్యులరైజేషన్ చేయాలి...

- ఎన్ హెచ్ ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్.

యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23
11 వ రోజు నిరవధిక సమ్మెలో భాగంగా ఏఐటీయూసీ సంపూర్ణ సంఘీభావం తెలిపిన యాదాద్రి భువనగిరి జిల్లా ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి ఎం.డి ఇమ్రాన్
సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు.
నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ , ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సుమారు 20 సంవత్సరాల నుండి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న వారికి ఉద్యోగ భద్రత , సమాన పనికి సమాన వేతనం , మహిళ ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల సెలవులు మంజూరు చేయాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రోజున కలెక్టరేట్ కార్యాలయం ముందట యాదాద్రి భువనగిరి జిల్లా స్థాయి సమావేశం యాదాద్రి జిల్లా ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి ఎం.డి ఇమ్రాన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రామ రాజేష్ ఖన్నా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కనీస వేతన చట్టం

ప్రకారం జీతాలు అమలు చేయ కుండా అతి తక్కువ జీతాలతో విధులు నిర్వ హిస్తున్నారన్నారు. డ్యూటీ చార్ట్ ప్రకారం విధులు చేయించకుండా అనేక రకాల క్రింది స్థాయి పను లను వారిపై రుద్దుతూ పని భారాన్ని పెంచటం అన్యాయమని ఆయన తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. ఉద్యోగులందరూ డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ ద్వారా ఎన్నిక చేయబడి నటువంటి ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు కనీస వేత నాలు పెంచి ఇవ్వాలని , అధిక పనిభారాన్ని వారిపై మోపుతూ అన్ని స్థాయిలో పనులు వారితో చేయించు కోవడం అన్యాయ మన్నారు. ఉద్యోగులకు న్యాయం జరిగే వరకూ కొండంత అండగా ఉండి పోరాటం చేస్తానని తెలియ జేశారు. మరొక ముఖ్య అతిథి ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ నూకల అంజి యాదవ్ మాట్లాడుతూ ఇతర ఏడు రాష్ట్రాలలో రెగ్యులరైజేషన్ చేసిన మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలో కూడా ఎన్ హెచ్ ఎం ఉద్యోగు లందరినీ బేసరత్తుగా రెగ్యులరైజేషన్ చేయాలని , ఐదు శాతం కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఐదు శాతం వేతనం ఇవ్వట్లేదని నూకల అంజి యాదవ్ మండిపడ్డారు. యాదాద్రి భువనగిరి ఎన్ హెచ్ ఎం ఆల్ క్యాడర్స్ నూతన కమిటీని రామ రాజేష్ ఖన్నా నేతృత్వంలో ఎన్నుకోవడం జరిగింది. జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఎం.డి ఇమ్రాన్ , జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ షాహిద్ అలీ , వర్కింగ్ ప్రెసిడెంట్ బానోత్ నెహ్రూ నాయక్ , ఉపాధ్యక్షులు డాక్టర్ మురళీమోహన్ , డాక్టర్ హరీష్ , డాక్టర్ గిరిజా , ప్రధాన కార్యదర్శి అనూష , జాయింట్ సెక్రెటరీ డాక్టర్ కోటేశ్వర రావు , డాక్టర్ మాల్యాంక కోశాధికారి శ్రీదేవి , మధు , కార్యవర్గ సభ్యులుగా జోష్ణ , అన్నపూర్ణ , రమా , చైతన్య లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు ఏరువుల నరసింహ , అన్ని క్యాడర్స్ ఉద్యోగులు సుమారుగా 106 మంది పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ పారిశ్రామిక మరణాలు.. కార్మికుల ప్రాణాలకు భద్రతేది?

- సిగాచి విషాదం మరువకముందే సరాక పరిశ్రమలో మరో ఘోరం!
- గ్యాస్ లీకేజీతో ఇద్దరు కార్మికుల మృతి
- సిగాచి ఘటన నుంచి గుణపాఠం నేర్చుకోని రేవంత్ సర్కార్: ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ధ్వజం
- మృతుల కుటుంబాలకు ఒక్కొక్క రికి రూ. 70 లక్షల పరిహారం..
- అంత్యక్రియలకు అదనంగా రూ.లక్ష సాయం
- కార్మికుల ప్రాణాలతో చెల గాటమాడితే సహించేది లేదని హెచ్చరిక

పటాన్‌చెరు,అక్టోబర్ 23 (ప్రజావాణి): పారిశ్రామిక అభివృద్ధి పేరుతో కార్మికుల ప్రాణాలను పణంగా పెడుతున్నారా? పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు గాలికొదిలేశారా? వరుస ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వ యంత్రాంగం ఎందుకు మేల్కోవడం లేదు? సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదం తాలూకు విషాదం ఇంకా కళ్లముందు కదలాడుతుండగానే గడ్డపోతారం పారిశ్రామికవాడలోని సరాక పరిశ్రమలో గ్యాస్ లీకేజీ కారణంగా ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించడంలో

పరిశ్రమల యాజమాన్యాలు విఫలమవుతుంటే, వాటిని నియంత్రించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం ప్రేక్షకపాత్ర పోషిస్తోందని మండిపడ్డారు. సిగాచి ఘటన నుంచి గుణపాఠం నేర్చుకోవడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తీవ్రస్థాయిలో విమర్శించారు. సరాక పరిశ్రమలో ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. పరిశ్రమ యాజమాన్యం, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పటాన్‌చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా పరిశ్రమ యాజమాన్యంతో చర్చలు జరిపి ఒక్కో కుటుంబానికి రూ.70 లక్షల చొప్పున పరిహారం, అంత్యక్రియల ఖర్చుల కోసం అదనంగా రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించేలా నిర్ణయించినట్లు వెల్లడించారు. ప్రమాదంలో గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పరిశ్రమలు లాభాల కోసం పనిచేయడమే కాకుండా అక్కడ చెమటోడ్చే కార్మికుల ప్రాణాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యతను గుర్తించాలని స్పష్టం చేశారు. పటాన్‌చెరు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ కార్మికుల భద్రత విషయంలో నిర్లక్ష్యం కొనసాగడం దురదృష్టకరమన్నారు. పరిశ్రమల్లో ప్రమాద నివారణ వ్యవస్థలు పనిచేస్తున్నాయా? గ్యాస్ లీకేజీలను గుర్తించే పరికరాలు ఉన్నాయా? అత్యవసర పరిస్థితుల్లో కార్మికులను రక్షించేందుకు సరైన ఏర్పాట్లు చేశారా? అనే అంశాలపై అధికారులు నిరంతరం తనిఖీలు ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేయడం, విచారణల పేరుతో కాలయాపన చేయడం కాకుండా ప్రమాదాలు జరగకముందే నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సరాక పరిశ్రమలో గ్యాస్ లీకేజీ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, భద్రతా లోపాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని అన్ని పరిశ్రమల్లో ప్రత్యేక భద్రతా తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘించే యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిగాచి వంటి ఘోర ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలని హితవు పలికారు. పరిశ్రమల అభివృద్ధి ఎంత ముఖ్యమో కార్మికుల ప్రాణాలు అంతకంటే ముఖ్యమని, కార్మికుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు న్యాయం జరిగే వరకు స్థానిక శాసనసభ్యుడిగా అండగా ఉంటానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి భరోసా ఇచ్చారు.

పెద్దపల్లి జిల్లాలో 40 ప్రభుత్వ పాఠశాలల్లో 'మైండ్‌సెట్ ఆఫ్ ఎ మేకర్' కార్యక్రమం

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం
- గత ఏడాది 1,800 మందికి పైగా విద్యార్థులకు ఆవిష్కరణలపై అవగాహనలి
- 1,061కి పైగా ప్రకటనలు, 96కి పైగా ప్రాథమిక నమూనాల రూపకల్పన
- డ్రీమ్ స్టార్ట్ రైజ్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్, టీ-వర్క్స్ సంయుక్తంగా కార్యక్రమం అమలు

మంథని నియోజకవర్గ ప్రతినిధి, అక్టోబర్ 23 ప్రజావాణి: విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను పెంపొందించడం, నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తిని కలిగించడం, సమాజంలో ఎదురయ్యే సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పరిష్కారాలను కనుగొనే నైపుణ్యాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా డ్రీమ్ స్టార్ట్ రైజ్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ (డ్రీమ్ స్టార్ట్ రైస్ ఇన్నోవేషన్ నెట్వర్క్), టీ-వర్క్స్ (టి - వర్క్స్) సంయుక్తంగా 'మైండ్‌సెట్ ఆఫ్ ఎ మేకర్' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయి.ఈ విద్యా సంవత్సరంలో పెద్దపల్లి జిల్లాలోని 40 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది.

విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణల నైపుణ్యాల అభివృద్ధిలి
విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, తమ చుట్టూ ఉన్న సమస్యలను గుర్తించి, వాటికి సృజనాత్మక పరిష్కారాలను రూపొందించేలా ఈ కార్యక్రమం ప్రోత్సహిస్తోంది. సమస్యల గుర్తింపు, ఆలోచనల అభివృద్ధి, డిజైన్ థింకింగ్, నమూనాల తయారీ (ప్రోటోటైపింగ్) వంటి అంశాలపై ప్రాయోగిక అనుభవాన్ని అందిస్తోంది.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సమస్యలను విశ్లేషించే సామర్థ్యం, వినూత్నంగా ఆలోచించడం, కొత్త ఆలోచనలను ఆచరణలోకి తీసుకురావడం వంటి నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు. విద్యార్థులు తమ పరిసరాల్లో ఎదురయ్యే సమస్యలను

గుర్తించి, వాటికి సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారాలను రూపొందించేలా ప్రోత్సహిస్తున్నారు.

గత ఏడాది కార్యక్రమం ద్వారా విశేష పురోగతి
'మైండ్‌సెట్ ఆఫ్ ఎ మేకర్' కార్యక్రమం గత ఏడాది గణనీయమైన ఫలితాలను సాధించింది. ఆవిష్కరణల సంస్కృతిని విద్యాసంస్థలకు విస్తరించడంతో పాటు విద్యార్థుల్లో సమస్యల పరిష్కార నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషించింది.

36కి పైగా విద్యాసంస్థలు:
ఆవిష్కరణల కార్యక్రమాలను విద్యాసంస్థలకు విస్తరించారు.

1,800 మందికి పైగా విద్యార్థులు: సృజనాత్మక ఆలోచనలు, సమస్యల పరిష్కారం, ఆవిష్కరణలపై అవగాహన పొందారు.

1,061కి పైగా సమస్యా ప్రకటనలు: విద్యార్థులు, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి సమస్యా ప్రకటనలుగా రూపొందించారు.

96కి పైగా ప్రాథమిక నమూనాలు:
కొత్త ఆలోచనలకు తక్కువ ఖర్చుతో ప్రాథమిక రూపాలను అభివృద్ధి చేశారు.20 ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ నమూనాలు: ప్రతిపాదించిన ఆలోచనల సాధ్యాసాధ్యాలను ప్రాథమికంగా నిరూపించే నమూనాలను రూపొందించారు.

ఈ ఫలితాలు విద్యార్థుల్లో సమస్యలను విశ్లేషించడం, కొత్తగా ఆలోచించడం, ఆలోచనలను ఆచరణలోకి తీసుకురావడం వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో కార్యక్రమం సాధించిన పురోగతిని తెలియజేస్తున్నాయి.

విద్యార్థుల నుంచి పరిశ్రమల వరకు ఆవిష్కరణలకు ప్రోత్సాహం
డ్రీమ్ స్టార్ట్ రైజ్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్, టీ-వర్క్స్ సంస్థలు పాఠశాల విద్యార్థులతో పాటు ఆవిష్కర్తలు, స్టార్టప్ సంస్థలు, మేకర్స్,

పారిశ్రామికవేత్తలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ ఎమ్ఈ ఎస్), ఇతర పరిశ్రమలు, స్థానిక సమాజాలకు నూతన ఆలోచనలను అభివృద్ధి చేసుకునే అవకాశాలను ప్రోత్సహిస్తున్నాయి.కొత్త ఉత్పత్తుల రూపకల్పన, ప్రాథమిక నమూనాల తయారీ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ద్వారా ఆలోచనలను వాస్తవ రూపంలోకి తీసుకురావడానికి టీ-వర్క్స్ తన మేకర్‌స్పేస్, సాంకేతిక వనరుల ద్వారా సహకరిస్తోంది. ఆవిష్కరణలకు అవసరమైన సాంకేతిక వనరులను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించేందుకు డ్రీమ్ స్టార్ట్ రైజ్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ కృషి చేస్తోంది.

గ్రామీణ ప్రాంతాల నుంచి భవిష్యత్తు ఆవిష్కర్తల నిర్మాణం
మంథని, పెద్దపల్లి జిల్లా పరిసర ప్రాంతాల్లోని విద్యార్థులకు తమ నూతన ఆలోచనలను వ్యక్తపరిచే అవకాశాలను కల్పించడం, స్థానిక సమస్యలకు స్థానికంగానే పరిష్కారాలను కనుగొనేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమంలోని ముఖ్య ఉద్దేశాలు. చిన్న వయస్సు నుంచే సృజనాత్మకత, సమస్యల పరిష్కార సామర్థ్యం, బృందంగా పనిచేయడం, ప్రయోగాత్మక అభ్యాసం వంటి నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా విద్యార్థులను భవిష్యత్తు ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం దోహదపడనుంది. ప్రతి విద్యార్థిలోనూ ఒక ఆవిష్కర్త ఉన్నాడనే నమ్మకంతో, ప్రతి కొత్త ఆలోచనకు ప్రోత్సాహం అందిస్తూ మంథని నుంచి పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఆవిష్కరణల సంస్కృతిని విస్తరించేందుకు డ్రీమ్ స్టార్ట్ రైజ్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్, టీ-వర్క్స్ సంస్థలు కృషి చేస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేయడంతో పాటు, వారి ఆలోచనలను ప్రాథమిక నమూనాలుగా అభివృద్ధి చేసుకునే అవకాశాలను కల్పించడం ద్వారా భవిష్యత్తులో నూతన ఆవిష్కరణలకు పునాది వేస్తున్నాయి.

విజయదశమిసందర్భగా బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని కలిసిన

- అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్
- బీ ఆర్ ఎస్ పార్టీరాష్ట్ర నాయకులు పైతర సాయికుమార్

ప్రజా వాణి న్యూస్ అక్టోబర్ 23 సంగారెడ్డి జిల్లా
ఈరోజు తెలంగాణ భవన్లో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కి నాయకుల తో కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు PSR ఫౌండేషన్ చైర్మన్ పైతర సాయి కుమార్ మునిపల్లి మండలం సర్పంచ్ లు మల్లికార్జునపల్లి మల్లేశం ఐదిలాపురం రమేష్ నాయకులు తుడుం దుర్గయ్య మునిపల్లి నవీన్, సురేష్, హుస్సేన్, టేకూరి వీరన్న మస్తాన్ తదితరులు పాల్గొన్నారు

జుక్కల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే కు బిచ్కుంద పార్టీ ఆఫీస్ కార్యాలయంలో ఘనంగా దసరా అలయ్ బలయ్ కార్యక్రమం..

- జుక్కల్ సీనియర్ బి ఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ భర్త నీళ్లు పటేల్ జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్ షిండే కు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు..
- జుక్కల్ నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే విజయదశమి
- శుభాకాంక్షలు తెలిపి న జుక్కల్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ భర్త నీళ్లు పటేల్

మన ప్రజావాణి జుక్కల్ ఆర్ సి ప్రతినిధి అక్టోబర్ 23
విజయదశమి (దసరా) పండుగను పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలోని జుక్కల్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ భర్త నీళ్లు పటేల్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే నివాసంలో అలయ్ బలయ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జుక్కల్ నియోజకవర్గ పరిధిలోని జుక్కల్, కౌలాస్, సావర్గావ్, లాడే గావ్ , సోపూర్, లొంగన్, వజ్రకండి, వివిధ గ్రామాల నుండి అలాగే వివిధ మండలాల నుండి తదితర గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ని మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వారి కుమారుడు హరీష్ షిండేకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. సంప్రదాయం ప్రకారం జమ్మి ఆకులను బంగారంగా భావించి పరస్పరం ఇచ్చిపుచ్చుకుంటూ పండుగ శుభాకాంక్షలు పంచుకున్నారు.దసరా అలయ్ బలయ్ కార్యక్రమం సంప్రదాయాలు, ఆత్మీయత, సోదరభావానికి ప్రతీకగా నిలిచింది. ఈ సందర్భంగా జుక్కల్ నియోజకవర్గ ప్రజలందరికీ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నా వాడే కాశీనాథ్, రామ్ పటేల్ డీజే తదితరులు పాల్గొన్నారు..

స్వర్ణగిరిలో ఘనంగా రెండో రోజు పవిత్రోత్సవాలు...

- గజవాహనంపైన దర్శన మిచ్చిన స్వర్ణగీరీషుడు.
- హనుమంత వాహనంపై ఊరేగిన శ్రీనివాసుడు.

యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 22తెలంగాణ రాష్ట్రంలోని ప్రాముఖ్య వైష్ణవ పుణ్య క్షేత్రముగా విరాజిల్లుతున్న యాదాద్రి తిరుమల దేవ స్థానం స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవ స్థానంలో శుక్రవారం రెండో రోజు ఘనంగా ప్రారంభ మైన పవిత్రోత్సవాలు.. పవిత్రోత్సవాల రెండో రోజు సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారు గజవాహనము పై కొలువు దీరి భక్తులకు దివ్య మంగళ రూపాన్ని దర్శన మిచ్చారు. గజవాహన సేవలో స్వామి వారిని దర్శించుకున్న భక్తులు గోవింద నామ స్మరణతో మానేపల్లి హిల్స్ స్వర్ణగిరి క్షేత్రాన్ని మార్మోగించారు. గజ వాహనం పై విరా జిల్లిన శ్రీవారి దివ్య రూపం భక్తులకు కనుల పండువగా నిలిచి పోయింది. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారు హనుమంత వాహనం పైన ఆలయ మాడవీధులలో తిరుగుతూ భక్తులకు స్వామివారి దివ్య స్వ రూపాన్ని ప్రసాదించారు. స్వామి వారి దివ్య మంగళ స్వరూపాన్ని చూసి భక్తులు ఆనంద పరవశులయ్యారు.

శ్రీ ఆర్కే హాస్పిటల్ పై తప్పుడు ప్రచారం చేయడం సరికాదు...

- శ్రీ ఆర్కే హాస్పిటల్ మేనేజ్మెంట్.

యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23గత 24 గంటలుగా సామా జిక మాధ్యమాల్లో శ్రీ ఆర్ కె హాస్పిటల్ గురించి వివిధ రకాల ప్రచారాలు చేస్తూ , పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రజలలో అపోహలు సృష్టించే ప్రయత్నాలు జరుగు తున్నాయి. ఈ ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.శ్రీ ఆర్కే హాస్పిటల్ సామా జిక మాధ్యమాల్లో ప్రచారం లో ఉన్న ఏ ఒక్క విషయాన్ని కూడా నిర్ధా రణ లేకుండా నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం. మా హాస్పిటల్ పై వస్తున్న ఆరోపణలు, ప్రచారంలో ఉన్న అంశాలకు సంబంధించి వాస్తవాలను తెలుసు కున్న తర్వాతే స్పందించాలి. ఒక సంస్థపై ఆధారాలు లేకుండా ఆరో పణలు చేయడం , అసత్య ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించడం సమంజసం కాదు. హాస్పిటల్ పై ఏవైనా సందేహాలు లేదా ఫిర్యా దులు ఉంటే సంబంధిత వాస్తవాలను పరిశీలించి, బాధ్యతాయుతంగా వ్యవ హరించాలని కోరు తున్నాం. ప్రజలకు వైద్య సేవలు అందించే మా హాస్పిటల్ పై అవాస్తవ ప్రచారం చేయకుండా, వాస్తవాలను తెలుసుకొని సహకరించాలని ప్రతి ఒక్కరినీ విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆర్కే హాస్పిటల్ యాజమాన్యం తెలిపారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at SRI VENKATESWARA PRINTING SOLUTIONS, peerzadi guda, GHMC, medchal malkaj giri AND PUBLICATIONS, , Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONSContact No : 9440032006. MAIL ID : prajavaani006@gmail.comepaper.prajavaani.net

రోడ్డు ప్రమాదంలో నవవరుడు సందీప్ దుర్మరణం... పెళ్లైన రెండు నెలలకే పండగ రోజే ఘోర విషాదం!

- ఉప్పరపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో నవవరుడు సందీప్ దుర్మరణం.. ఖమ్మం ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య భార్య భవాని.
- సందీప్ భౌతికకాయా నికి నివాళులర్పించిన మార్కెట్ చైర్మన్ గంటా సంజీవరెడ్డి.
- అర్వణపల్లిలో కన్నీటి శ్లోకం.. అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోసిన కాంగ్రెస్ నాయకులు నీలం దుర్గేష్, సమ్మి గౌడ్.
- అర్వణపల్లిలో కన్నీటి శ్లోకం.. శోకసంద్రంలో మునిగిపోయిన గ్రామం.

కేసముద్రం, అక్టోబర్ 23,ప్రజావాణి.పండగ పూట ఆ ఇంట్లో నవ్వులు వికసించాలి.. పెళ్లై రెండు నెలలే కావడంతో ఆ దంపతుల జీవితం సరికొత్త ఆశలతో చిగురించాలి.. కానీ, విధి ఆడిన వింత నాటకంలో ఆ కుటుంబంలో తీరని చీకట్లు ముసిరాయి. దైవ దర్శనం చేసుకుని వస్తుండగా నవ దంపతులను రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. బుధవారం రాత్రి ఉప్పరపల్లి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అర్వణపల్లి గ్రామానికి చెందిన సందీప్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. పెళ్లైన రెండు నెలలకే భర్త కళ్లముందే అనంత లోకాలకు వెళ్లిపోవడంతో, భార్య భవాని తీవ్ర గాయాలతో ఖమ్మం ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య పోరాడుతోంది. పండగ వేళ జరిగిన ఈ భయంకర విషాదంతో అర్వణపల్లి గ్రామం మొత్తం కన్నీటి సముద్రంలో మునిగిపోయింది.సందీప్ భౌతికకాయాన్ని చూసి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు గుండెలవిసేలా రోదించారు. శుక్రవారం సందీప్ నివాసానికి చేరుకున్న మార్కెట్ చైర్మన్ గంటా సంజీవరెడ్డి పార్థివదేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.అనంతరం జరిగిన అంత్యక్రియలలో మాజీ మార్కెట్ చైర్మన్ నీలం దుర్గేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మి గౌడ్ స్వయంగా పాల్గొని సందీప్ పాడె మోశారు. అంత్యక్రియలు ముగిసేవరకు అక్కడే ఉండి, పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా నాయకులు కన్నీటి పర్యంతమవుతూ.. సందీప్‌కు వివాహమై కేవలం రెండు నెలలే అవుతోంది. ఎంతో ఉజ్వలమైన భవిష్యత్తు ఉన్న యువకుడు ఇలా దైవదర్శనం ముగించుకుని వస్తూ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత దారుణమని అన్నారు. తక్కువ సమయం లోనే అందరి మనసులు గెలుచుకున్న ఆప్తుడిని కోల్పోయాం. పండగ రోజున మా గుండెల్లో కన్నీటి శ్లోకం మిగిల్చాడు. సందీప్ కుటుంబానికి కాంగ్రెస్ మండల పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుంది అని హామీ ఇచ్చారు.ఈ అంత్యక్రియల కార్యక్రమంలో పి ఎ సి ఎస్ వైస్ చైర్మన్ అంబటి మహేందర్ రెడ్డి, మాజీ పి ఏ సి ఎస్ చైర్మన్ బండారు వెంకన్న, సర్పంచ్ వెంకటమ్మ - వీరస్వామి,కుమారస్వామి, చిన్న వెంకన్న, వల్లందాసు రవి, తరాల వీరేష్, కమకుటం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి రవీందర్, తండ సంపత్, బిర్రు వెంకన్నలతో పాటు వందలాది మంది గ్రామస్థులు పాల్గొని సందీప్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు.

రామగిరి వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షుడిగా చేతిసుదాకర్

రామగిరి,మన సమగ్ర ప్రజావాణి అక్టోబర్ 23 రామగిరి మండల వార్డు మెంబర్ల ఫోరం నూతన అధ్యక్షుడిగా పన్నూరు గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు చేతిసుదాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని రత్నాపూర్ రైతు వేదికలో శుక్రవారం ఫోరం అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. మంథని నియోజకవర్గ వార్డు మెంబర్ల ఫోరం ఇన్‌చార్జి చొప్పరి సంతోష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మండలంలోని వివిధ పార్టీలకు చెందిన వార్డు సభ్యులు హాజరయ్యారు.ఎన్నికల ప్రక్రియ అనంతరం చేతిసుదాకర్‌ను నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొరకొప్పుల తులసి రామ్‌గౌడ్,మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మొత్కూరి అవినాష్‌గౌడ్ నూతన అధ్యక్షుడిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కొరకొప్పుల తులసి రామ్‌గౌడ్ మాట్లాడుతూ,మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు,టీపీసీసీ నాయకుడు దుద్దిళ్ల శ్రీనుబాబు ఆధ్వర్యంలో మంథని నియోజకవర్గం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని ఆకాంక్షించారు

ఎల్‌నినో ప్రభావంతో యాసంగిలో ఆరుతడి పంటలు సాగు చేయాలి

- రైతులకు ఖేత్ బచావో అభియాన్‌లో అధికారుల సూచన

పెద్దవంగర, అక్టోబర్ 23 (ప్రజావాణి): .రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని జిల్లా కలెక్టర్ స్నేహ సబర్వాల్ ఐఏఎస్ సూచించారు. శుక్రవారం పెద్దవంగర మండలం అవతాపురం రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర, నీటిపారుదల, విద్యుత్, పశుసంవర్ధక, మిషన్ భగీరథ, కేవీకే, భూగర్భ జలాలు, ఆయిల్‌ఫెడ్, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ, గ్రామీణాభివృద్ధి, ఉద్యానవన శాఖల అధికారులు రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా రైతులకు పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేశారు.నేల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

నేల సారాన్ని కాపాడుకోవాలని, అధిక మోతాదులో రసాయన ఎరువులు వినియోగించకుండా అవసరమైన మేరకే వాడాలని అధికారులు సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని, పంట కోతల అనంతరం మిగిలే వ్యర్థాలను కాల్చకుండా భూమిలో కలిసేలా దున్నాలని తెలిపారు. దీనివల్ల నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు.

యాసంగిలో ఆరుతడి పంటలకు ప్రాధాన్యం

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున యాసంగి సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటలను ఎంపిక చేసుకోవాలని అధికారులు సూచించారు. వరి సాగుకు అధికంగా నీరు అవసరమయ్యే నేపథ్యంలో, పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి పంటలను సాగు చేయాలని, అందుబాటులో ఉన్న సాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు వివరించారు.రైతుల అనుభవాలను పంచుకున్న అవుతాపురం సర్పంచ్ టి. శ్రీనివాస్ ప్రగతిశీల రైతులతో కలిసి తమ వ్యవసాయ అనుభవాలను ఇతర రైతులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి స్వామి నాయక్, ఏఈఓలు అరవింద్, విశ్వశాంతి, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

తెలంగాణలో కరువు మండలాలను ప్రకటించాలి

- పంట నష్టపరిహారం ఎకరాకు రూ.25వేలు ఇవ్వాలి
- ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి మట్టపల్లి అంజయ్య

ప్రజావాణి అనంతగిరి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కరువు ప్రాంతాలుగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్)తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది.ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కా॥మట్టపల్లి అంజయ్య బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం,బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడకపోవడం వలన ఈ సంవత్సరం తెలంగాణలో సగటు వర్షపాతం కంటే దాదాపు 23% తక్కువ వర్షపాతం నమోదైందన్నారు.దీంతో రాష్ట్రంలోని 18జిల్లాల్లో 320మండలాలు పరిధిలోని 12760గ్రామాల్లో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని,వీటిలో 11479గ్రామాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదై పంటలు ఎండిపోయాయని తెలిపారు.దాదాపు 12లక్షల ఎకరాల పంట నష్టం వాటిల్లిందని,బోర్లు,బావులు ఎండిపోగా తాగునీటికి, వ్యవసాయానికి నీరు లేక రైతులు,కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.ఇప్పటివరకు ప్రభుత్వం నుండి ఎటువంటి కరువు సహాయక చర్యలు లేకపోవడం ఆందోళనకరమన్నారు. నిత్యం 3నుండి 5గంటల వరకు విద్యుత్ కోతలు కొనసాగుతుండగా రైతులు పంటలకు నీరు పెట్టలేని పరిస్థితి నెలకొందన్నారు.ఇదే పరిస్థితి కొనసాగితే 7635కోట్ల కరెంట్ బిల్లులను ప్రభుత్వం నుండి వలస ఇప్పటికే నష్టాల్లో ఉన్న రైతులంపై పంపు పెట్టబడి వ్యయం పెరిగి,దిగుబడి పడిపోయి,ఉన్న దిగుబడి పడిపోయి రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారన్నారు.వెంటనే తెలంగాణ ప్రభుత్వం ప్రభావిత 18జిల్లాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులకు సంట నష్టపరిహారం ఎకరాకు కనీసం రూ.25,000/-చొప్పున అందించాలన్నారు.రైతులకు ఉపాధి కూలీ పనులు కల్పించాలని,పశువులకు మేత,తాగునీరు సరఫరా ఏర్పాటు చేయాలని,విద్యుత్ కోతలను,రైతులపై మోపే నివారించి వ్యవసాయానికి నిరంతరాయంగా 9గంటల ఉచిత విద్యుత్ సరఫరా,భారీల సెంపును బేషరతుగా నిర్మించుకోవాలని డిమాండ్ చేశారు.సంట నష్టపోయిన రైతుల సంట రుణాలు వడ్డీ కొనరారా రుణాలు వడ్డీ రహితంగా రీషెడ్యూల్ చేసి రికవరీలను నిలుపుదల చేయాలని కోరారు.ఈ డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్)ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేయబడునని హెచ్చరించారు.

రాయికల్‌లో 10 అంగన్వాడీ టీచర్ పోస్టుల అర్హుల జాబితా విడుదల

రాయికల్, అక్టోబర్ 23 (ప్రజావాణి)రాయికల్ పట్టణంతో పాటు మండలంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి అర్హులు,అనర్హుల అభ్యర్థుల జాబితాను శుక్రవారం సీడీపీవో జయప్రద విడుదల చేశారు.రాయికల్ మున్సిపాలిటీ పరిధిలో మూడు, గ్రామీణ ప్రాంతాల్లో ఏడు కలిపి మొత్తం పది పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. మండలంలోని రామారావుపల్లి, వస్తాపూర్, వీరాపూర్, శ్రీరాంనగర్, భూపతిపూర్, రామాజీపేట, లోక్యానాయక్ తండా గ్రామాలతో పాటు రాయికల్ మున్సిపాలిటీలో అంగన్వాడీ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో అర్హులు,అనర్హుల జాబితాలను సంబంధిత మున్సిపల్ కార్యాలయం,గ్రామ పంచాయతీల్లో సర్పంచులు, గ్రామ కార్యదర్శుల సమక్షంలో ప్రదర్శించారు.అనర్హుల జాబితాలో పేర్లు ఉన్న అభ్యర్థులు తమకు ఏవైనా అభ్యంతరాలు, సందేహాలు ఉంటే వాటి పరిష్కారం కోసం ఈ నెల 30వ తేదీలోగా జగిత్యాలలోని ఐసీడీఎస్ కార్యాలయాన్ని సందర్శించాలని అధికారులు సూచించారు. అర్హులైన అభ్యర్థులకు తదుపరి ఎంపిక ప్రక్రియకు సంబంధించిన వివరాలను తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ వివరాలను సీడీపీవో జయప్రద, సూపర్‌వైజర్లు అనూహ్య, రాధ, పద్మావతి వెల్లడించారు.

రామాపురం గ్రామ పంచాయతీలో బిల్లుల వివాదం.. అవినీతి ఆరోపణలపై విచారణ

- రూ.20 వేల పనికి రూ.50 వేల బిల్లు చేయాలని ఒత్తిడి చేస్తున్నారంటూ ఆరోపణలు
- పూర్తయిన పనులకు బిల్లులు నిలిపివేశారని మాజీ సర్పంచ్ ఆవేదన

చిలుకూరు, అక్టోబర్ 23 (ప్రజావాణి):సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం రామాపురం గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనుల బిల్లులు, నిధుల వినియోగానికి సంబంధించి వివాదం నెలకొంది. గ్రామ పంచాయతీ పాలకవర్గంలో ఉప సర్పంచ్ భర్త జోక్యం చేసుకుంటున్నారంటూ ఆరోపణలు వ్యక్తమవుతుండగా, మాజీ సర్పంచ్‌కు సంబంధించిన అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపుల విషయంలోనూ వివాదం తలెత్తింది. ఈ వ్యవహారంపై గ్రామస్థాయిలో చర్చ జరుగుతుండటంతో మండల ఉన్నతాధికారి గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చి సంబంధిత అంశాలపై విచారణ చేపట్టారు.

పూర్తయిన పనులకు బిల్లులు నిలిపివేశారంటూ మాజీ సర్పంచ్ ఆవేదన

గ్రామంలో గతంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని మాజీ సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. కొన్ని అసంపూర్తి నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు చెల్లించడంతో పాటు తీర్మానాల కాపీలపై సంతకాలు చేసినప్పటికీ, పూర్తిస్థాయిలో నిర్మాణాలు జరిగిన పనులకు సంబంధించిన బిల్లుల విషయంలో మాత్రం జాప్యం చేస్తున్నారని ఆయన ఆరోపించినట్లు తెలిసింది. సంబంధిత బిల్లులు తనకు అందకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని మాజీ సర్పంచ్ పేర్కొన్నట్లు సమాచారం. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు పూర్తి వివరాలను పరిశీలించాల్సి ఉంది.

రూ.20 వేల పనికి రూ.50 వేల బిల్లు చేయాలంటూ ఒత్తిడి?

గ్రామంలో సుమారు రూ.20 వేల వ్యయంతో చేపట్టిన పనికి రూ.50 వేల బిల్లు చేయాలంటూ ఒత్తిడి తెస్తున్నారని, అందుకు అంగీకరించకపోతే ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులపై సంతకాలు చేయాలంటే 20 శాతం కమిషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు కూడా చర్చనీయాంశంగా మారాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి బిల్లులు, పనుల అంచనాలు, చెల్లింపు రికార్డులు, ఇతర ఆధారాలను పరిశీలించిన తర్వాతే వాస్తవాలు వెల్లడికానున్నాయి.

ఫ్లెక్సీల బిల్లులపైనా వివాదం

గ్రామంలో వ్యక్తిగతంగా ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలకు సైతం గ్రామ పంచాయతీ నిధుల నుంచి బిల్లులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, ఉప సర్పంచ్ పదవికి సంబంధించిన వ్యవహారాల్లో ఆమె భర్త జోక్యం చేసుకుంటున్నారని వివిధ పార్టీలకు చెందిన నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఉప సర్పంచ్ పనితీరుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కొందరు వార్డు సభ్యులు సైతం వాపోతున్నట్లు తెలుస్తోంది.

గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారుల విచారణ

ఈ వివాదాల నేపథ్యంలో మండల ఉన్నతాధికారి రామాపురం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి సంబంధిత అంశాలపై విచారణ జరిపి వివరాలను నమోదు చేసుకున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లబోతు సత్యనారాయణ, రాయబారపు వెంకటేశ్వర్లు, మీసాల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నిధుల వినియోగంపై పారదర్శకతకు డిమాండ్

గ్రామ పంచాయతీ నిధులు ప్రజాధనానికి సంబంధించినవని, వాటి వినియోగంలో పారదర్శకత పాటించాలని గ్రామస్థులు కోరుతున్నారు. చేపట్టిన పనుల వాస్తవ వ్యయం, పనుల నాణ్యత, బిల్లుల చెల్లింపులు, తీర్మానాల వివరాలు, నిధుల వినియోగంపై సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు అభిప్రాయపడుతున్నారు..

పంచాయతీ నిధులపై అధికారుల ఫోకస్

- నిధుల మళ్లింపుపై తీవ్ర ఆరోపణలు
- గ్రామాన్ని సందర్శించిన ఇన్‌ఛార్జ్ హరిప్రసాద్
- క్యాష్ బుక్స్, వౌచర్ల క్షుణ్ణ పరిశీలన
- బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వెల్లడి

చింతలమానేపల్లి (ప్రజావాణి): మండలం కర్జవెల్లి గ్రామ పంచాయతీలో అభివృద్ధి నిధుల దుర్వినియోగంపై విచారణ వేగవంతమైంది. ప్రభుత్వ నిధులను నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తులకు మళ్లించారనే ఆరోపణలపై పంచాయతీ రాజ్ శాఖ అధికారులు దృష్టి సారించారు. స్థానికుల ఫిర్యాదులతో ఇన్‌ఛార్జ్ హరిప్రసాద్ గ్రామాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గత కొన్ని నెలలుగా జరిగిన ఆర్థిక లావాదేవీలు, క్యాష్ బుక్స్, వౌచర్లను పరిశీలించారు. నిధులు ఏయే పనులకు మంజూరయ్యాయి? ఎవరి ఖాతాలకు డబ్బులు బదిలీ అయ్యాయి? అనే అంశాలపై అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగం తీవ్రమైన నేరమని, విచారణ నివేదిక ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జ్ స్పష్టం చేశారు.

ఆచార్యులగూడెంలో అర్ధరాత్రి దొంగతనం

- విద్యుత్ వైర్లు కట్ చేసి మోటారు స్టార్టర్ అపహరణ

చిలుకూరు, అక్టోబర్ 23 (ప్రజావాణి):చిలుకూరు మండలం ఆచార్యులగూడెం గ్రామంలో అర్ధరాత్రి దొంగతనం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రావుల పెంట వెంకయ్య, తండ్రి చలమయ్యకు సంబంధించిన విద్యుత్ మోటారు వద్ద గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం.వివరాల్లోకి వెళితే.. అర్ధరాత్రి సమయంలో మోటారు స్తంభం వద్దకు చేరుకున్న దొంగలు విద్యుత్ వైర్లను కట్ చేసి, మోటారు స్టార్టర్‌తో సహా అక్కడి సామగ్రిని అపహరించినట్లు బాధితుడు తెలిపాడు. వ్యవసాయ అవసరాల కోసం ఉపయోగించే మోటారు పరికరాలు చోరీకి గురికావడంతో బాధితుడు ఆందోళనకు గురయ్యాడు. ఈ ఘటనతో రైతులు తమ వ్యవసాయ పరికరాల భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ మోటార్లు, విద్యుత్ పరికరాల చోరీలు రైతులకు ఆర్థిక భారంగా మారుతున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. రాత్రి వేళల్లో అపరిచిత వ్యక్తుల సంచారంపై నిఘా పెంచాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.కాగా, ఈ ఘటనపై ఇప్పటివరకు పోలీసు కేసు నమోదు కాలేదు. చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించి, అపహరించిన సామగ్రిని తిరిగి స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

రైతుల పొట్ట కొడుతున్న మిల్లర్ల సిండికేట్ కోటగిరిలో అన్నదాతల ఆవేదన

- కొనేటప్పుడు రకాల గోల్‌మాల్. అమ్మేటప్పుడు సన్నబియ్యం దందా.
- ప్రస్తుతం క్వింటాల్ బియ్యం రూ.8 వేలు.రైతుకు రూ.500 లాభం వస్తే కడుపు మంటా ?
- బయటి వ్యాపారుల రాకపై నిషేధం.మిల్లర్ల మోసాలపై కోటగిరి రైతుల నిలదీత.
- తక్షణమే ఉన్నతాధికారులు,ప్ర జాప్రతినిధులు స్పందించాలని రైతుల విజ్ఞప్తి.

కోటగిరి/ప్రజావాణి:–స్థానిక రైస్ మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి తమను నిలువునా దోచుకుంటున్నారని నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని కోటగిరి మండల కేంద్రానికి చెందిన రైతులు గురువారం విలేకరుల సమావేశం లో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.కష్టపడి పండించిన వరి ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర దక్కకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఓపెన్ మార్కెట్ వ్యాపారస్తులను స్థానిక రైస్ మిల్లర్లు రానీయకుండా అడ్డుకుంటున్నారని వాపోయారు.మిల్లర్లం దరు ఒక్కటై సిండికేట్‌గా మారి కృత్రిమంగా ధాన్యం ధరల ను తగ్గించి తమ పొట్ట కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇటీవల కాలంలో బీపీటీ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ. 3,700 నుంచి రూ. 3,900 వరకు చెల్లించి కొనుగోలు చేశారని.ప్రస్తుతం స్థానిక రైస్ మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి బయట వ్యాపారస్తులను రానివ్వకుండా ధరను తగ్గిస్తున్నా రని వాపోయారు.గత సీజన్‌లో వరి మద్దతు ధరకు క్వింటా ల్‌కు రూ. 2,200 చొప్పున కొనుగోలు చేసిన ధాన్యానికి తయారైన బియ్యాన్ని ప్రస్తుతం క్వింటాల్‌కు రూ. 8,000 చొప్పున విక్రయించి కోట్లు గడిస్తున్నారని మండిపడ్డారు.ఒక రైతుకు క్వింటాల్కు రూ. 500 లాభం వస్తే ఈ రైస్ మిల్లర్లు జీర్ణించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మా దగ్గర వద్దు కొనేటప్పుడు సిద్ధి,గంగాకావేరి,కోనారం,బీపీటి అంటూ రకాన్ని బట్టి తక్కువ ధర కేటాయిస్తున్నారు.మరి ఇదే ధాన్యానికి మిల్లింగ్ చేసిన తర్వాత ఈ రకాల పేరుతో విడివిడిగా వినియోగదారులకు ఎందుకు విక్రయించడం లేదని వారు ప్రశ్నించారు.మిల్లింగ్ చేసేటప్పుడేమో అన్ని రకాలను కలిపేసి ఒకే రకమైన సన్న బియ్యం పేరుతో మార్కెట్‌లో అత్యధిక ధరలకు అమ్ముకుంటూ తమ దగ్గరి కొచ్చేసరికి రకాల మధ్య వ్యత్యాసాలు చూపుతూ ధరలు కుదించి నిండా ముంచడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.ఈ మోసపూరిత వ్యవహారంపై స్థానిక ప్రజా ప్రతినిధులు,జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని రైతులు విజ్ఞప్తి చేశారు.స్థానిక రైస్ మిల్లర్లు చేస్తున్న ఈ అక్రమాలను కట్టడి చేసి ఇతర ప్రాంతాల ఓపెన్ మార్కెట్ వ్యాపారస్తులను స్వేచ్ఛగా కొనుగోళ్లు చేసుకునేలా ప్రోత్స హించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.ఈ ప్రెస్మీట్లో సాదక్,చిత్తరి శ్రీనివాస్,మామిడి శ్రీనివాస్(మాస్), మామిడి సాయిలు(రాయుడు),ఎముల నవీన్,ఈశ్వర్, మామిడి సాయిలు,తోట సాయిలు,పత్తి దత్తు,పత్తి శంకర్,కర్నె పోషట్టి,ఆకుల ప్రవీణ్,రైతులు పాల్గొన్నారు.

యాసంగిలో తక్కువ నీటితో పండే పంటలనే సాగు చేయాలి

- ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి
- చేగొమ్మ రైతు వేదికలో రైతులకు అవగాహన కార్యక్రమం

కూసుమంచి, అక్టోబర్ 23 (మన ప్రజావాణి) ప్రతినిధి యాసంగి సాగులో ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు తక్కువ నీటిని వినియోగించే పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి సూచించారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మ రైతు వేదికలో శుక్రవారం రైతులకు వివిధ వ్యవసాయ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి మాట్లాడుతూ, కేత్ బచావో అభియాన్ కార్యక్రమం ద్వారా భూసంరక్షణ, నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, పంట వ్యర్థాలను కాల్చడం వల్ల కలిగే అనర్థాలు, ప్రకృతి వ్యవసాయం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.విత్తన మొక్కజొన్న సాగు చేసే రైతులు తప్పనిసరిగా సంబంధిత కంపెనీతో ముందుగానే ఒప్పందం (అగ్రిమెంట్) చేసుకోవాలని సూచించారు. యాసంగి పంటల సాగులో వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని, నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని వరి, మొక్కజొన్న వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా పెసర, మినుము, వేరుశనగ, జొన్న వంటి తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, చేగొమ్మ, ముత్యాలగూడెం గ్రామాల సర్పంచులు, ఏఈఓ రవి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

చైనా చొరబాట్లపై కేంద్రం మౌనం వీడాలి

- జాతీయ భద్రతపై ప్రశ్నిస్తే దేశద్రోహులుగా ముద్ర వేస్తారా?
- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ డిమాండ్

ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి అక్టోబర్ 23పెద్దపల్లి: భారత--చైనా సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ డిమాండ్ చేశారు. చైనా చొరబాట్లు, అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తన వైఖరిని వెల్లడించాలని కోరారు. దేశ సరిహద్దుల్లో సైనికులు అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తూ దేశాన్ని కాపాడుతుంటే, జాతీయ భద్రతపై ప్రశ్నించే వారిని దేశద్రోహులుగా చిత్రీకరించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.

భారత--చైనా సరిహద్దుల్లో పరిస్థితులు, తక్సింగ్ సహా పలు ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న ఘర్షణలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని వంశీకృష్ణ పేర్కొన్నారు. సరిహద్దుల్లో మన సైనికులు ఎదుర్కొంటున్న సవాళ్లు, వారి భద్రతకు తీసుకుంటున్న చర్యలపై దేశ ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

గత పార్లమెంట్ సమావేశాల్లోనూ ఈ అంశాన్ని లేవనెత్తినప్పటికీ కేంద్ర ప్రభుత్వం తమ ప్రశ్నలకు తగిన సమాధానాలు ఇవ్వలేదని విమర్శించారు. సరిహద్దుల్లో ప్రస్తుతం ఏం జరుగుతోంది? చైనా సైనికులతో ఘర్షణలు కొనసాగుతున్నాయా? పరిస్థితి మరింత తీవ్రం కాకుండా కేంద్రం ఎలాంటి చర్యలు చేపడుతోంది? అనే అంశాలపై ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

కిరణ్ రిజిజు ఎందుకు మౌనంగా ఉంటున్నారు?

అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన ఎంపీ, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు సరిహద్దు సమస్యపై తన వైఖరిని స్పష్టం చేయాలని వంశీకృష్ణ కోరారు. సరిహద్దు ప్రాంతాల్లో చైనా వ్యవహరిస్తున్న తీరుపై స్పందించాల్సిన బాధ్యత కలిగిన నాయకులు ఈ అంశంపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. దేశ భూభాగ పరిరక్షణకు సంబంధించిన కీలక అంశాలపై కేంద్ర మంత్రులు బాధ్యతాయుతంగా స్పందించాలని సూచించారు.

దేశభక్తి నినాదాలతో భద్రతా సమస్యలను కప్పిపుచ్చలేరు

జాతీయ భద్రతకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా నినాదాలతో సరిపెట్టడం సరికాదని ఎంపీ విమర్శించారు. ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావిస్తూ, దేశ రక్షణ విషయంలో గొప్ప ప్రకటనలు చేయడం కంటే సరిహద్దుల్లో నెలకొన్న వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించడం ముఖ్యమన్నారు.

దేశ భద్రతపై ప్రశ్నలు లేవనెత్తే వారిని దేశద్రోహులుగా ముద్ర వేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. దేశభక్తి నినాదాలతో జాతీయ భద్రతకు సంబంధించిన సమస్యలను కప్పిపుచ్చలేరని స్పష్టం చేశారు.

జాతీయ భద్రత అనేది రాజకీయాలకు అతీతమైన అంశమని, దేశ భూభాగ పరిరక్షణతో పాటు సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న సైనికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీ గడ్డం వంశీకృష్ణ కోరారు. సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం పారదర్శకంగా స్పందించి, దేశ ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి

- మాజీ జడ్పీటీసీ అశ్విని జాదవ్

రాయికల్, అక్టోబర్ 23 (ప్రజావాణి)గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని రాయికల్ మాజీ జడ్పీటీసీ అశ్విని జాదవ్ అన్నారు.శుక్రవారం రాయికల్ మండలంలోని తాట్లవాయి గ్రామంలో ఘనంగా నిర్వహించిన తాట్లవాయి ప్రీమియర్ లీగ్ (టిపిఎల్) సీజన్-3 క్రికెట్ పోటీల ముగింపు వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా అశ్విని జాదవ్ మాట్లాడుతూ.. క్రీడా స్ఫూర్తి కలిగిన వ్యక్తి జీవితంలోని అన్ని రంగాల్లో రాణిస్తారని అన్నారు. నేటి యువత మొబైల్ ఫోన్లు, చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా, క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దృఢపడటమే కాకుండా, మానవ సంబంధాలు బలపడతాయని, గ్రామాల్లో ఐక్యత పెరుగుతుందని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ఎంతో ప్రతిభ దాగి ఉందని, వారికి తగిన వేదిక, ప్రోత్సాహం అందిస్తే జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణిస్తారని అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. అలాగే టిపిఎల్ నిర్వహణకు కప్ లను స్పాన్సర్ చేయడం అభినందనీయమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో టిపిఎల్ లీగ్ నిర్వాహకులు, వివిధ జట్ల క్రీడాకారులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్మూర్‌కు మరో 1,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి...

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేసిన ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి

ఆర్మూర్ టౌన్, అక్టోబర్ 23(మన సమగ్ర ప్రజావాణి):రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల అవసరాలకు సంబంధించిన పలు అంశాలపై మంత్రితో చర్చించారు.ఆర్మూర్ నియోజకవర్గానికి అదనంగా 1,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే నూతన మండలమైన ఆలూరులో ఎమ్మార్వో కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్మూర్ పట్టణంలో ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత సులభంగా అందించేందుకు ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ కార్యాలయాన్ని మంజూరు చేయాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు.నియోజకవర్గంలో గృహ వసతి కల్పనతో పాటు రెవెన్యూ పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మంత్రిని కోరారు.

అత్తగారింటికి వెళ్లొస్తుండగా జీపీ కార్యదర్శి మృతి

భూపాలపల్లి బ్యూరో (మన ప్రజావాణి):– సురాయపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి శనిగరపు జయపాల్ ప్రమాదవశాత్తు మృతి చెందారు.భార్యతో కలిసి టేకుమట్లలోని అత్తగారింటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఓడేడు వాగు వద్ద ఆగారు. రోడ్డుపై తవ్విన పెద్ద గుంతలో నిలిచిన నీటిలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు గుంతలో పడి మృతి చెందినట్లు సమాచారం

ఉపాధి హామీ పథకం పై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి సరికాదు...

- వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్.
- బి కే ఎం యు జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్.

ఎల్కతుర్తి ప్రజావాణి న్యూస్:-కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ అమలు చేయుటలో పూర్తిగా వైఫల్యం చెందిందని బికేఎంయు జిల్లా కార్యదర్శి అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో కరువుతో అల్లాడుతున్నారని ఇలాంటి సమయంలో కేంద్ర ప్రభుత్వం నిధులు ఈ రాష్ట్రానికి మరిన్ని కేటాయించి గ్రామీణ వ్యవసాయ కూలీలకు తోడ్పడాలని వారన్నారు వ్యవసాయ కూలీలకు గ్రామాల్లో పని లేక తిండి బట్ట పొట్ట లేక ఇబ్బందుల గురవుతున్నారని గ్రామీణ ఉపాధి పథకాన్ని మరిన్ని రోజులు పెంచి గ్రామాలలో వ్యవసాయ కూలీలకు పని కల్పించాలని కోరారు భూగర్భ జలాలు బావుల్లో నీళ్లు లేక వ్యవసాయ భూములు పంటలు చేతికి రాక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని రాబోయే కాలంలో పశు వులకు మూగ జంతువులకు పశు గ్రహం కూడా దొరికే లేదని ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం మార్గాలు చేయాలని వ్యవసాయ కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా రోజుకు 800 రూపాయలు ఇవ్వాలని కోరారు కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఉపాధి హామీ పథకాలు అమలు ఇంకా వ్యవసాయ కూలీలకు సరియైన జీవనోపాధి జరగడం లేదని ఉపాధి హామీ 2 వందల రోజులు పని దినాలు కల్పించాలని ఆయన అన్నారు.ఈ విలేకరుల సమావేశంలో బి కే ఎన్ యు జిల్లా అధ్యక్షులు మునియాల బిక్షపతి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సాంబయ్య బిల్కురి తులసిరావ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవంగర మండలంలో ఉచిత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం ప్రారంభించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రంగమురళి గౌడ్

- ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ ఆదేశాల మేరకు

పెద్దవంగర అక్టోబర్ 23 ప్రజావాణి పెద్దవంగర మండలంలో పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ సూచనలతో, పెద్దవంగర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రంగు మురళి గౌడ్ ఆధ్వర్యంలో ఉచిత గ్రాడ్యుయేట్ ఎం.ఎల్.సి ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.మండలంలోని అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకునేందుకు ఈ ఉచిత నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాలకు చెందిన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.గ్రామాల వారీగా ఉచిత ఓటరు నమోదు చేయుట కోసం ఎమ్మెల్యే ఆదేశాలతో ఇన్చార్జిలను నియమించడం జరిగింది.కనుకుంట్ల నరేష్ -- 9701901759 ఆవుల మహేష్ -- 8096332551 కందుల యాకరాజు -- 9848718461 బానోత్ రామ్ చరణ్ -- 9398453202 కొండ్రాతి శ్రీనాథ్ -- 9640723030 నమోదు కోసం అవసరమైన డాక్యుమెంట్లు డిగ్రీ మెమో / సర్టిఫికెట్ పాస్‌పోర్ట్ సైజు ఫోటో ఆధార్ కార్డు మొబైల్ ఫోన్ నంబర్ జూ×జ నంబర్ (ఓటరు గుర్తింపు కార్డు నంబర్) పైన పేర్కొన్న ఇన్‌చార్జీల వాట్సాప్ నంబర్లకు సంబంధిత డాక్యుమెంట్లను పంపించి నమోదు ప్రక్రియకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముద్దసాని సురేష్, జిల్లా కార్యదర్శి దంతాలపల్లి రవి, మండల పార్టీ ఉపాధ్యక్షులు దాసరి శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షులు బీసు హరికృష్ణ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రేగొండ పశువైద్యశాల దుస్థితిపై వార్త వచ్చినా స్పందించని అధికారులు.. రైతుల్లో ఆగ్రహం

రేగొండ అక్టోబర్ 23(మన ప్రజావాణి): రేగొండ మండల కేంద్రంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరిందని వార్తలు వచ్చినా, ఫోటో సాక్ష్యాలతో సహా బయటపడినా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు ఇప్పటివరకు స్పందించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గోడలు పెచ్చులూడి, బోర్డు మీద అక్షరాలు కూడా చెరిగిపోయి భవనం కూలిపోయే స్థితిలో ఉంది. పశువులకు అత్యవసర సేవలు అందక రైతులు ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించి నష్టపోతున్నారు.అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే, రైతులతో కలిసి కలెక్టరేట్ ముందు నిరసనకు దిగుతామని రైతులు హెచ్చరిస్తున్నారు.

రాజీవ్ రహదారిపై కారులో మంటలు.. కారు పూర్తిగా దగ్ధం

- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రాణాపాయం

బెజ్జంకి, అక్టోబర్ 23 (ప్రజావాణి)సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల పరిధిలోని రాజీవ్ రహదారిపై శుక్రవారం సాయంత్రం కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి వాహనం పూర్తిగా దగ్ధమైంది.క్రాసింగ్--శంకర్‌నగర్ మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది.కరీంనగర్ జిల్లా గంగాధరకు చెందిన నిమ్మ శ్రావణ్ కారులో ప్రయాణిస్తుండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి.ప్రమాదాన్ని గుర్తించిన ఆయన వెంటనే అప్రమత్తమై కారులో నుంచి బయటకు దిగడంతో ప్రాణాపాయం తప్పింది. క్షణాల్లోనే మంటలు తీవ్రరూపం దాల్చి కారు పూర్తిగా కాలిపోయింది.ఈ ఘటనతో రాజీవ్ రహదారిపై కొద్దిసేపు కలకలం నెలకొంది.కారులో మంటలు వ్యాపించడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

రేషన్ షాపుల్లో సబ్సిడీపై నిత్యావసర సరుకులు...?

● రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రతిపాదన..!

యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23తెలంగాణలో సామాన్య ప్రజలకు ఊరట కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రతిపాదనను పరిశీలిస్తోంది. రేషన్ షాపుల ద్వారా బియ్యం తో పాటు పలు నిత్యా వసర సరుకులను సబ్సిడీ ధరలకు అందించే అంశం పై కసరత్తు చేస్తోంది.ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే రేషన్ షాపుల ద్వారా గోధుమపిండి , కంది పప్పు , పామాయిల్ ప్యాకెట్ , పంచదార , చింతపండు , కారం పొడి వంటి సరుకులు కూడా తక్కువ ధరలకు అందు బాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ అంశంపై సచివాలయంలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సరుకుల ధరలు , పంపిణీ చేసే పరి మాణం , అమలు విధానం పై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించినట్లు సమాచారం. అధికారుల నివేదిక ఆధారంగా ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అయితే , ఈ ప్రతిపాదనపై ఇంకా తుది నిర్ణయం వెలువడలేదు. ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వచ్చిన తర్వాతే పూర్తి వివరాలు స్పష్టమవుతాయి.

పోక్సో కేసులో ఏడుగురు నిందితులను జ్యుడిషియల్ రిమాండ్

● మద్దూరు ఎస్సై మహమ్మద్ ఆసీఫ్

మద్దూరు అక్టోబర్23,ప్రజా వాణి, మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో ఏడుగురు నిందితులను జ్యుడిషియల్ రిమాండ్ కు తరలించినట్లు మద్దూరు ఎస్సై మహమ్మద్ ఆసీఫ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందులో ముగ్గురు నిందితులు మైనర్లు కావడంతో హుస్నాబాద్ ఏసిపి సదానందం పర్యవేక్షణలో రాపిడ్ కిట్ సహాయంతో డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా డ్రగ్స్ సేవించలేదని తేలిందని తెలిపారు.

కేటీఆర్‌తో పటేల్‌గూడ మాజీ సర్పంచ్ ఈర్ల నితీష శ్రీకాంత్ భేటీ

● దసరా శుభాకాంక్షలు తెలిపిన మాజీ సర్పంచ్
● పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కేటీఆర్ సూచన

అమీన్‌పూర్, అక్టోబర్ 23 (ప్రజావాణి): హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును పటేల్‌గూడ మాజీ సర్పంచ్ ఈర్ల నితీష శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు దసరా పండుగ శు భాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పార్టీ కార్యకలాపాలు, స్థానికంగా బీఆర్ఎస్ బలోపేతంపై చర్చించారు. పట్టణ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని, పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొనాలని కేటీఆర్ సూచించినట్లు ఈర్ల నితీష శ్రీకాంత్ తెలిపారు. పార్టీ నాయకత్వం సూచనల మేరకు నిబద్ధతతో పనిచేస్తూ బీఆర్ఎస్ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ మర్యాదపూర్వక భేటీలో పటేల్‌గూడ మాజీ వార్డు సభ్యుడు వెంకటేష్, సింగారం నవీన్ కుమార్ పాల్గొన్నారు.

సైకిల్ యాత్రికుడికి అయ్యప్ప ఫౌండేషన్ చైర్మన్ ఘన సన్మానం

ఆర్మూర్ టౌన్ అక్టోబర్ 23(మన సమగ్ర ప్రజావాణి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఆర్మూర్ నుంచి లడఖ్ వరకు సైకిల్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసిన షేర్ ఓంకర్ పాటేల్‌ను అయ్యప్ప ఫౌండేషన్ చైర్మన్ అయ్యప్ప శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అయ్యప్ప శ్రీనివాస్ మాట్లాడుతూ, నేటి యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ క్రీడలు, వ్యాయామం వంటి మంచి అలవాట్లను పెంపొందించుకోవాలని అన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు షేర్ ఓంకర్ పాటేల్ చేపట్టిన సైకిల్ యాత్ర అభినందనీయమని పేర్కొన్నారు. యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలనే సందేశాన్ని ఈ యాత్ర ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడం స్ఫూర్తిదాయకమని అయ్యప్ప శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా షేర్ ఓంకర్ పాటేల్‌ను అభినందించి సత్కరించారు.

అలాయ్ బలాయ్ కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహకు దసరా శుభాకాంక్షలు

● మంత్రి దామోదర రాజనర్సింహను కలిసిన వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ, కాంగ్రెస్ మైనారిటీ నాయకుడు నజీర్ చోటు ఖాన్

మన ప్రజావాణి అందోల్ అక్టోబర్ 23: జిల్లా ప్రతినిధి తర్జాన్‌పల్లిలోని ఎం ఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అలాయ్ బలాయ్ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను అందోల్--జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు), కాంగ్రెస్ మైనారిటీ నాయకుడు నజీర్,చోటు ఖాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి విజయదశమి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ సందర్భంగా పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.

ప్రజాసేవలను విస్తృతం చేయాలి

● రెడ్‌క్రాస్ నూతన కార్యవర్గానికి కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచన

ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, అక్టోబర్ 23: పెద్దపల్లి జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గ సభ్యులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు తమను కలెక్టర్‌కు పరిచయం చేసుకున్నారు. అనంతరం జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలపై చర్చించారు. ముఖ్యంగా రక్తదాన శిబిరాల నిర్వహణ, అత్యవసర సమయాల్లో రోగులకు రక్తాన్ని అందించడం, ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

మానవ సేవే లక్ష్యంగా పనిచేయాలి

మానవ సేవే లక్ష్యంగా రెడ్‌క్రాస్ సొసైటీ పనిచేస్తూ, అవసరమైన సమయాల్లో ప్రజలకు అండగా నిలవాలని కలెక్టర్ పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా విస్తరించేందుకు నూతన కార్యవర్గ సభ్యులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పెద్దపల్లి జిల్లా నూతన చైర్మన్ ఎరబాటి వెంకటేశ్వర్ రావు, వైస్ చైర్మన్ సాదుల వెంకటేశ్వర్లు, కోశాధికారి పాంపాటి శ్రీకాంత్, స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు కావేటి రాజగోపాల్, జిల్లా కమిటీ సభ్యులు డీవీఎస్ మూర్తి, గూళ్ల అంజన్ కుమార్, వేల్పుల రమేష్, వేల్పూరి సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు.

క్లిష్ట పరిస్థితుల్లో గర్భిణికి విజయవంతంగా శస్త్రచికిత్స

● తల్లి, శిశువు క్షేమం.. వైద్య బృందాన్ని అభినందించిన ఆసుపత్రి సూపరింటెండెంట్

ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి అక్టోబర్ 23పెద్దపల్లి: జిల్లా ఆసుపత్రి పెద్దపల్లిలో అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న గర్భిణికి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించి ప్రసవం చేశారు. ప్రస్తుతం తల్లి, శిశువు క్షేమంగా ఉన్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ తెలిపారు.

పెద్దపల్లి జిల్లా జూలపల్లి గ్రామానికి చెందిన 30 ఏళ్ల గర్భిణి శు క్రవారం చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి వచ్చారు. వైద్య పరీక్షలు, స్కానింగ్ నిర్వహించగా గర్భంలో ఉమ్మనీరు చాలా తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అలాగే గర్భస్థ శిశువు మలం విడుదల చేసినట్లు వైద్యులు నిర్ధారించారు. సదరు మహిళ గత నాలుగు నెలలుగా అధిక రక్తపోటుతో బాధపడుతుండటంతో పాటు, గర్భాశయంలో సుమారు 10 సెంటీమీటర్ల పరిమాణంలో ఫైబ్రాయిడ్ ఉన్నట్లు గుర్తించారు.

ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ నేతృత్వంలో వైద్య బృందం తగిన జాగ్రత్తలు తీసుకుంటూ శస్త్రచికిత్స నిర్వహించింది. దీంతో ప్రసవం విజయవంతమైంది. ప్రస్తుతం తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉన్నారు. ఈ సందర్భంగా క్లిష్ట పరిస్థితుల్లో సమర్థవంతంగా వైద్య సేవలు అందించి తల్లి, శిశువు క్షేమానికి కృషి చేసిన గైనకాలజిస్ట్ డాక్టర్ రవలిక, అనస్థీషియా వైద్యురాలు డాక్టర్ కృష్ణవేణి, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ సిబ్బందిని డాక్టర్ కె. శ్రీధర్ అభినందించారు.

జిల్లా ఆసుపత్రిలో అధునాతన వైద్య సేవలు

ఈ సందర్భంగా డాక్టర్ కె. శ్రీధర్ మాట్లాడుతూ.. పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. లాపరోస్కోపిక్ శస్త్రచికిత్సలు, లేజర్ చికిత్సలు, ఫిస్టులా చికిత్సలు, యూరాలజీ శస్త్రచికిత్సలు, ఆర్థ్రోస్కోపీ, కేటరాక్ట్ శస్త్రచికిత్సలు, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ వంటి అధునాతన వైద్య సేవలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.జిల్లా ప్రజలు ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖరీదైన వైద్య చికిత్సల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలోనే నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా పొందవచ్చని ఆయన తెలిపారు.

ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి పొంచి ఉంటే.. చెరువును కబ్జా చేస్తున్న అక్రమార్కులు!

■ హనుమకొండ బంధం చెరువులో యథేచ్ఛగా మట్టి నింపుడు పనులు
■ ట్రాక్టర్లు, మట్టి తవ్వే యంత్రాలతో చెరువు పూడ్చివేతకు యత్నం
■ అక్రమ మట్టి నింపుడు పనులను అడ్డుకుని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

హనుమకొండ, ప్రజావాణి:ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి, రానున్న రోజుల్లో నీటి ఎద్దడి తీవ్రతరం అయ్యే ప్రమాదం పొంచి ఉండగా.. మరోవైపు హనుమకొండలోని బంధం చెరువు ప్రాంతంలో అక్రమంగా మట్టి నింపుతూ చెరువు ఉనికికే ప్రమాదం కలిగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నీటి వనరులను కాపాడాల్సిన తరుణంలో కొందరు అక్రమార్కులు చెరువును ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గత కొన్ని రోజులుగా బంధం చెరువు ప్రాంతంలో రాత్రింబవళ్లు ట్రాక్టర్లు, మట్టి తవ్వే యంత్రాలను ఉపయోగించి పెద్ద ఎత్తున మట్టి, నిర్మాణ వ్యర్థాలను తరలించి నింపుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ పనుల వల్ల చెరువు స్వరూపం మారిపోవడమే కాకుండా, భవిష్యత్తులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాలు సరిగా కురవకపోవడం, భూగర్భ జలాలు తగ్గిపోవడం వంటి సమస్యలు ఎదురయ్యే పరిస్థితుల్లో చెరువులు, కుంటలను పరిరక్షించడం అత్యంత అవసరం. చెరువులు నీటి నిల్వకు మాత్రమే కాకుండా, భూగర్భ జలాల పెరుగుదలకు, పర్యావరణ సమతుల్యతకు కీలకంగా నిలుస్తాయి. అలాంటి నీటి వనరులను అక్రమంగా పూడ్చివేస్తే భవిష్యత్తులో ప్రజలకు తాగునీరు, సాగునీటి ఇబ్బందులు మరింత పెరిగే అవకాశం ఉందని పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు.

అధికారులు తక్షణమే స్పందించాలి

బంధం చెరువు ప్రాంతంలో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమ మట్టి నింపుడు పనులపై రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అనుమతులు లేకుండా పనులు జరుగుతున్నట్లు తేలితే వెంటనే వాటిని నిలిపివేయడంతో పాటు, నిబంధనల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలకు ఉపయోగిస్తున్న వాహనాలపై కూడా చట్టప్రకారం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చెరువు హద్దులను గుర్తించి, ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారణ అయితే వాటిని తొలగించి చెరువు పరిధిని పునరుద్ధరించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వీడి స్పందించి,బంధం చెరువును కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, పర్యావరణ ప్రేమికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బాలవికాస ఆధ్వర్యంలో అనాథ వృద్ధులను నిత్యావసర వస్తువులు దుస్తులు దుప్పట్లు పంపిణీ

■ అనాథ వృద్ధుల సేవలో బాలవికాసఅభినందించిన హుజూరాబాద్ ఏసీపీ మాధవి
■ వృద్ధులకు అండగా నిలవడం అభినందనీయం ఏసీపీ మాధవి జమ్మికుంట సిఐ రామకృష్ణ గౌడ్ ఎస్ ఐ రవి
■ బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన కోఆర్డినేటర్లు కే సుమలత ఏ స్వాతి ఆసియా

జమ్మికుంట అక్టోబర్ 23 (ప్రజావాణి)జమ్మికుంట పట్టణంలోని కన్నవారిని కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కొడుకులు, కూతుళ్లు ఉన్నప్పటికీ నిరాదరణకు గురవుతున్న వృద్ధులు ఎందరో ఉన్నారని, అలాంటి పరిస్థితుల్లో ఎవరూ లేని అనాథ వృద్ధులను చేరదీసి వారికి నిత్యావసర వస్తువులు, దుస్తులు, దుప్పట్లు అందిస్తున్న బాలవికాస స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయమని హుజూరాబాద్ ఏసీపీ మాధవి అన్నారు జమ్మికుంటలోని బాలవికాస కార్యాలయ ఆవరణలో శుక్రవారం అనాథ వృద్ధుల సంక్షేమ కార్యక్రమం నిర్వహించారుఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ మాధవి మాట్లాడుతూ, తమ వద్దకు ప్రతిరోజూ వృద్ధులు వచ్చి తమ పిల్లలపై ఫిర్యాదులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు తమ పిల్లలు భవనాల్లో నివసిస్తూ తల్లిదండ్రులను రేకుల షెడ్లలో ఉంచుతున్నారనిపేర్కొన్నారువృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం చట్టాలను రూపొందించిందని, తల్లిదండ్రుల బాగోగులు చూసుకోని వారిపై ఇకపై కౌన్సెలింగ్‌కే పరిమితం కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వృద్ధులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని సమయానికి ఆహారం తీసుకుంటూ చిన్నచిన్న వ్యాయామాలు చేయాలని సూచించారు. వచ్చే ఏడాది అనాథ వృద్ధులందరికీ తన తరఫున దుస్తులు, దుప్పట్లు అందజేస్తాననిహామీఇచ్చారు వృద్ధులకుపోలీసుల అండ జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, తాను ఆదిలాబాద్ జిల్లాలో విధులు నిర్వహించిన సమయంలో ఆదివాసీలకు స్వచ్ఛంద సంస్థలు అందించిన సేవలను ప్రత్యక్షంగా చూశానని తెలిపారు. గత ఏడాది బాలవికాస నిర్వహించిన అనాథ వృద్ధుల కార్యక్రమానికి హాజరైనప్పుడు కలిగిన ప్రేరణతోనే ఈసారి దుప్పట్లు, టవళ్లు అందజేసినట్లు చెప్పారు. పోలీసు వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమానికి హాజరయ్యామని, వృద్ధులకు పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు15వ వార్డు కౌన్సిలర్ పాతకాల మౌనిక మాట్లాడుతూ, అనాథ వృద్ధులకు ఎల్లవేళలా అండగా ఉంటానని, బాలవికాస నిర్వహించే ప్రతి కార్యక్రమానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారుఏడు రాష్ట్రాల్లోబాలవికాససేవలుబాలవికాస ఉమెన్ ప్రోగ్రాం ప్రాజెక్టు కోఆర్డినేటర్ గోపు జ్యోతి మాట్లాడుతూ, తమ సంస్థ ఏడు రాష్ట్రాల్లోని 3,500 గ్రామాల్లో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని,250 మంది సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారని వివరించారుఈ సందర్భంగా కృష్ణ కాలనీకి చెందిన మైన స్వప్న తన దివంగత భర్త జ్ఞాపకార్థం, ఇల్లంతకుంట గ్రామానికి చెందిన మోటపోతుల ఉజ్వల్ తన తండ్రి జ్ఞాపకార్థం ఒక్కొక్కరు రూ.5,000 చొప్పున విరాళంగా అందజేశారుఈ కార్యక్రమంలో ఎస్సై రవి, బాలవికాస జమ్మికుంట సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన కోఆర్డినేటర్లు కే. సుమలత ఏ. స్వాతి, ఆసియా 40 మంది అనాథ వృద్ధులు ఏడుగురు దివ్యాంగులు పాల్గొన్నారు

చౌడేపల్లిలో ఎంపీటీసీ నామినేషన్ల జోరు!

- 12 స్థానాలకు 39 నామినేషన్లు.. టీడీపీ నుంచి 25, వైసీపీ నుంచి 10
- 17 నామినేషన్లు దాఖలు.. జనసేన, ఇతర పార్టీల నుంచి కూడా పోటీ

మన ప్రజావాణిచౌడేపల్లి: అక్టోబర్ 23

అన్నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గంలోని చౌడేపల్లి మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. మండల పరిధిలోని 12 ఎంపీటీసీ స్థానాలకు అక్టోబర్ 21 నుంచి 23వ తేదీ వరకు మొత్తం 39 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు నివేదిక లో వెల్లడించరు . అక్టోబర్ 23వ తేదీన ఒక్కరోజే 17 నామినేషన్లు దాఖలయ్యాయి.

టీడీపీ ముందంజ.. వైసీపీ నుంచి 10

అధికారిక నివేదిక ప్రకారం మండలవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ నుంచి అత్యధికంగా 25 నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 10, జనసేన పార్టీ నుంచి రెండు నామినేషన్లు నమోదయ్యాయి. ఇతర పార్టీల నుంచి ఒకటి, స్వతంత్ర అభ్యర్థిగా మరొకరు నామినేషన్ దాఖలు చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ, బీఎస్పీ, బీజేపీ, సీపీఐ(ఎం), కాంగ్రెస్ పార్టీల నుంచి నామినేషన్లు నమోదుకాలేదు.

గ్రామాల వారీగా నామినేషన్ల వివరాలు

1. 29-వా చింతమాకులపల్లె: మొత్తం 4 నామినేషన్లు
2. కోతకోట: మొత్తం 3 నామినేషన్లు
3. కొండామర్రి: మొత్తం 2 నామినేషన్లు
4. చారాల: మొత్తం 3 నామినేషన్లు
5. చౌడేపల్లి--1: మొత్తం 4 నామినేషన్లు
6. చౌడేపల్లి--2: మొత్తం 3 నామినేషన్లు
7. దిగువపల్లి: మొత్తం 4 నామినేషన్లు
8. గడ్డంవారిపల్లె: మొత్తం 2 నామినేషన్లు
9. కాగతి: మొత్తం 4 నామినేషన్లు
10. కాటిపేరి: మొత్తం 3 నామినేషన్లు
11. పందిళ్లపల్లె: మొత్తం 3 నామినేషన్లు
12. వెంగళపల్లె: మొత్తం 4 నామినేషన్లు

ఎన్నికలపై పెరుగుతున్న ఆసక్తి

మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల దాఖలు పూర్తయ్యే సమయానికి మొత్తం 39 నామినేషన్లు నమోదయ్యాయి. నామినేషన్ల వివరాలను చౌడేపల్లి మండల పరిషత్ కార్యాలయానికి సంబంధించిన రిటర్నింగ్ అధికారి అధికారిక నివేదికలో వెల్లడించారు. తదుపరి ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ అనంతరం బరిలో నిలిచే అభ్యర్థులపై స్పష్టత రానుంది.

నందిపాడు జంక్షన్ అండర్‌పాస్ నిర్మాణానికి రూ.37.95 కోట్ల పరిపాలనా అనుమతి

- మిర్యాలగూడ అభివృద్ధిలో కీలక ముందడుగు -- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కృషితో అనుమతి

ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం అక్టోబర్ 23 మిర్యాలగూడ బైపాస్‌లోని నందిపాడు జంక్షన్ వద్ద అండర్‌పాస్ నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం రూ.37.95 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం G.O.Rt.No.545, తేదీ 22-10-2026 ద్వారా ఉత్తర్వులు జారీ చేయడం పట్ల స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది.ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి కు కృతజ్ఞతలు తెలిపారు.ముఖ్యంగా, మిర్యాలగూడ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించి, నందిపాడు జంక్షన్ వద్ద అండర్‌పాస్ నిర్మాణానికి ప్రభుత్వ అనుమతి లభించేలా కృషి చేసిన మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (దీూ=) కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ అండర్‌పాస్ నిర్మాణం పూర్తయితే నందిపాడు జంక్షన్ వద్ద రాకపోకలకు మరింత సౌలభ్యం కలగడంతో పాటు, ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రయాణికులకు ప్రయోజనం చేకూరుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ తరలింపుకు బిజెపి పోరాటం: 27 నుండి ఎంపీ ఈటల రాజేందర్ పాదయాత్ర!

జవహర్ నగర్/అక్టోబర్ 23 (ప్రజావాణి ప్రతినిధి)జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ వల్ల స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర కాలుష్య సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలంటూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సమరశంఖం పూరించింది. ఈ యార్డును తక్షణమే ఇక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేస్తూ మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఈ నెల 27 నుంచి భారీ పాదయాత్రకు శ్రీకారం చుడుతున్నారు. ఈ మేరకు శుక్రవారం మేడ్చల్ జిల్లా పరిధిలోని దమ్మాయిగూడ సాయి భవాని ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాదయాత్ర కార్యాచరణను ప్రకటించారు. ఈ నెల 25న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు, 27 నుండి క్షేత్రస్థాయిలో పాదయాత్ర ప్రారంభం కానుందని స్పష్టం చేశారు. సమస్య కొలిక్కి వచ్చే వరకు బరిగీసి పోరాడతామని, అవసరమైతే జవహర్ నగర్‌లో 'సకల జనుల సమ్మె'కు వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా బీజేఎల్పీ నాయకులు, నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, గతంలో ఇక్కడి నుంచి ఎంపీగా గెలిచిన రేవంత్ రెడ్డి ప్రజలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్ప, ఈ ప్రాంత సమస్యలను పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వం చూపిస్తున్న పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు అన్నీ బూటకమని మండిపడ్డారు.

కాలుష్య కోరల్లో జవహర్ నగర్: ఈటల ఆందోళన

ప్రపంచంలోనే మీథేన్ కాలుష్యాన్ని ఉత్పత్తి చేస్తున్న నగరాల్లో జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ నాల్గవ స్థానంలో నిలవడం సిగ్గుచేటని ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి నుంచి విడుదలవుతున్న లీచేట్ (వ్యర్థాల కలుషిత నీరు) వల్ల కీసర, ఘట్‌కేసర్, దమ్మాయిగూడ పరిసర ప్రాంతాల్లోని చెరువుల్లో చేపలు చచ్చిపోతున్నాయని, భూగర్భ జలాలు పూర్తిగా విషతుల్యమయ్యాయని పేర్కొన్నారు.

లి 12 మిలియన్ టన్నుల మీథేన్ గ్యాస్ విడుదలవుతూ, కార్బన్ డై ఆక్సైడ్ కంటే 80 రెట్లు ఎక్కువ కాలుష్యాన్ని కలిగిస్తోందని నివేదికలు చెబుతున్నాయన్నారు.

లి ఇది సుమారు 12 లక్షల కార్లు విడుదల చేసే కాలుష్యం కంటే ప్రమాదకరమైనదని, దీనివల్ల హైదరాబాద్ నగర ఉష్ణోగ్రతలు సైతం పెరుగుతున్నాయని హెచ్చరించారు.

లి యార్డు పరిసరాల్లోని 30 కిలోమీటర్ల పరిధిలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా మహిళల్లో గర్భస్రావాలు, క్యాన్సర్లు, అక్యూట్ రెస్పిరేటరీ సిండ్రోమ్ (శ్వాసకోశ వ్యాధులు) వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ వైఫల్యాలపై ధ్వజం.. కేంద్రం సాయానికి సిద్ధం

ఈ గంభీరమైన సమస్యపై తాను పార్లమెంట్‌లో మాట్లాడానని, కేంద్ర మంత్రి ఎం.ఎల్. ఖట్టర్‌ను కలిసినప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలతో వస్తే నిధులు ఇచ్చేందుకు సిద్ధమని తెలిపారని ఈటల వెల్లడించారు. సమస్య పరిష్కారం కోసం భేషజాలకు పోకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సైతం కలిశానని, అయినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని విమర్శించారు. వ్యర్థాల నిర్వహణకు ఐఏఎస్ అధికారి నరహరి సూచించిన అత్యాధునిక సాంకేతికతను ఇక్కడ ఉపయోగించాలని, వాసన, లీచేట్ నీరు లేని టెక్నాలజీని తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి చేతకాకపోతే చెబితే కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు రప్పించి శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు.

ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై పొలిటికల్ అటాక్ చేసిన ఈటల, హైడ్రా పేరుతో రేవంత్ రెడ్డి పేదల ఇళ్లను డోజర్లతో కూల్చివేసి రోడ్డున పడేశారని విమర్శించారు. బీజేపీ చేసిన గట్టి పోరాటం వల్లే హైడ్రా ఆగడాలు తగ్గాయన్నారు. మూసీ నదిని శుద్ధి చేస్తే అభ్యంతరం లేదు కానీ, పేదల ఇళ్లను కూల్చవద్దని అక్కడ తాము స్వయంగా పడుకుని అడ్డుకున్నామని గుర్తుచేశారు.

అండగా ఉంటాం: మహేశ్వర్ రెడ్డి బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, జవహర్ నగర్ దుస్థితి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఈటల రాజేందర్ నేతృత్వంలో జరిగే పాదయాత్రకు శాసనసభ పక్షం తరఫున పూర్తి మద్దతు ఇస్తున్నామని, తాము కూడా ఈ యాత్రలో పాల్గొంటామని స్పష్టం చేశారు.ఈ సన్నాహక సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, ఎస్. మల్లారెడ్డి, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రవి నాయక్, మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్,మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ గండే, ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, విక్రమ్ రెడ్డి, సామా రంగారెడ్డి,చంద్రారెడ్డి, ఆర్కే శ్రీనివాస్, మాణిక్ రెడ్డి, తిర్మల్ రెడ్డి, తిరుపతి యాదవ్, కొప్పుల నర్సింహారెడ్డి మరియు స్థానిక ప్రజాప్రతినిధులు,పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓడేడు వాగులో విషాదం.. పంచాయతీ కార్యదర్శి మృతి

- స్నానానికి వెళ్లి గుంతలో పడి దుర్మరణం.. భార్య పరిస్థితి విషమం

మంథని నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్ 23 ప్రజావాణి:ఓడేడు వాగు వద్ద జరిగిన ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి శనిగరపు జయపాల్ మృతి చెందగా, ఆయన భార్య తీవ్ర అస్వస్థతకు గురైనట్లు సమాచారం. ఈ విషాద ఘటన స్థానికంగా కలకలం రేపింది.వివరాల్లోకి వెళితే.. మంథని మండలం సూరయ్యపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న జయపాల్.. రత్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎక్స్ రోడ్ పెట్రోల్ బంకు ఎదురుగా నివాసం ఉంటున్నారు. దసరా పండుగ సందర్భంగా భార్యతో కలిసి టేకుమట్లలోని అత్తగారింటికి వెళ్లిన ఆయన తిరిగి వస్తుండగా ఓడేడు వాగు వద్దకు చేరుకున్నారు.అక్కడ రోడ్డుపై తవ్విన పెద్ద గుంతలో నీరు నిలిచి ఉండటంతో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు గుంతలో పడి జయపాల్ మృతి చెందినట్లు తెలిసింది. ఈ ఘటనలో ఆయన భార్య సైతం నీట మునిగి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఖమ్మంలో బియ్యం దుకాణాల్లో పౌరసరఫరాల శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలు

- జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్

ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం ఖమ్మం నగరంలోని ప్రకాష్ నగర్, చర్చి కాంపౌండ్, శ్రీనివాస్ నగర్ ప్రాంతాల్లో ఉన్న బియ్యం వ్యాపారుల దుకాణాల్లో డిప్యూటీ తహశీల్దార్లతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్ తెలిపారు.తనిఖీల్లో భాగంగా, వ్యాపారులు సూర్యాపేట, కరీంనగర్ జిల్లాల నుండి కొనుగోలు చేసిన బియ్యానికి సంబంధించిన బిల్లులు, వే బిల్లులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారన్నారు. వినియోగదారుల సౌకర్యార్థం ప్రతి దుకాణం ప్రధాన ద్వారం వద్ద అందుబాటులో ఉన్న బియ్యం నిల్వల పరిమాణం, వాటి ధరల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని వ్యాపారులను ఆదేశించారు. బియ్యాన్ని అధిక ధరలకు విక్రయించడం గానీ, మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించడం గానీ చేయరాదని జిల్లా పౌరసరఫరాల అధికారి స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించే వ్యాపారులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రామీణ సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలి!

- ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలి.. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో, అక్టోబర్ 23:-గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వాటికి సత్వర పరిష్కారం చూపాలని సూచించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

శుక్రవారం సాయంత్రం కుబీర్ మండలంలోని పార్డి (బి), హల్దా గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా పార్డి (బి) గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్ భవేశ్ మిశ్రా.. గ్రామంలో నెలకొన్న సమస్యలపై స్థానికులను ఆరా తీశారు. ముఖ్యంగా తాగునీటి ఇబ్బందులను తన దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చిన వెంటనే స్పందించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామాల్లో ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించి, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో పరిష్కరించాలని ఆదేశించారు.అనంతరం హల్దా గ్రామంలో రైతులతో సమావేశమైన కలెక్టర్, సీలింగ్ భూములకు సంబంధించిన సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూములకు సంబంధించిన రికార్డులు, ఇతర వివరాలను అధికారులు, రైతులను అడిగి ఆరా తీశారు. సీలింగ్ భూముల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రైతులకు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతోపాటు, రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో కుబీర్ తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో భూమారావు, హల్దా గ్రామ సర్పంచ్ కె. రజిత దేవేందర్, పార్డి (బి) గ్రామ సర్పంచ్ ప్రవీణ్, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పదోవవార్డును సందర్శించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్

జమ్మికుంట అక్టోబర్ 23 (ప్రజావాణి) జమ్మికుంట పట్టణ పరిధిలోని మోత్కులగూడెం లో10వ వార్డు కౌన్సిలర్ తూర్పటి చందన శంకర్ ఆహ్వానం మేరకు 10వ వార్డును సందర్శించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ఈవార్డులో ప్రధాన సమస్య డ్రైన్ సమస్య అని తెలుపగా మున్సిపల్ ఏఈ వికాస్ టి పి పి ఓ దీపిక తో కలిసి సమస్య స్థలాన్ని పరిశీలించి సమస్యను సకాలంలో పరిష్కారమయ్యేలా చూస్తామని చైర్మన్ తెలిపారు

వలలో చిక్కిన మూడు తాబేళ్లు.. సురక్షితంగా చెరువులోకి

- కౌటాల వద్ద చేపల వలలో చిక్కుకున్న మూడు తాబేళ్లు
- అటవీశాఖ అధికారులకు సమాచారం అందించిన స్థానికులు
- వెటర్నరీ వైద్యుడి పరీక్షల అనంతరం నాగమ్మ చెరువులోకి విడుదల
- వన్యప్రాణులను చంపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎఫ్ఆర్ఓ హెచ్చరిక
- వన్యప్రాణులు గ్రామాల్లోకి వస్తే అటవీశాఖకు సమాచారం ఇవ్వాలని సూచన

కౌటాల (ప్రజావాణి): సిర్పూర్ రేంజ్ పరిధిలోని కౌటాల వద్ద చేపల వేట కోసం ఏర్పాటు చేసిన వలలో మూడు తాబేళ్లు చిక్కుకున్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు సిర్పూర్ ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్‌కు సమాచారం అందించారు. ఆయన సూచన మేరకు బీట్ ఆఫీసర్లు నరేష్, మురళి, అరుణ్ తాబేళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వెటర్నరీ వైద్యుడితో పరీక్షలు నిర్వహించిన తర్వాత సిర్పూర్ (టి)లోని నాగమ్మ చెరువులో వాటిని సురక్షితంగా వదిలిపెట్టారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. వన్యప్రాణులకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు. వన్యప్రాణులను చంపితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎల్-నినో పరిస్థితుల నేపథ్యంలో అడవుల్లో వన్యప్రాణులకు తగినంత నీటి సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అయినప్పటికీ వన్యప్రాణులు దారితప్పి గ్రామాల్లోకి వస్తే వాటికి ఎలాంటి హాని కలిగించకుండా వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

సీఎం ఆర్ ఎఫ్ బాధితులకు గొప్ప వరం..

- కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు వీరన్న..

ప్రజావాణి,ఇనుగుర్తి: సీఎం రిలీఫ్ ఫండ్ అనారోగ్య బాధితులకు గొప్ప వరమని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు బానోతు వీరన్న నాయక్ అన్నారు. మండలంలోని పెద్దతండ లో ఎమ్మెల్యే డా.భూక్య మురళి నాయక ఆదేశం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బైరు అశోక్ గౌడ్ సూచన మేరకు మండలంలోని పెద్దతండ బాధితులకు శుక్రవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను వీరన్న నాయక్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం బాదిత బానోతు లక్ష్మీబాయి భాస్కర్ దంపతులకు రూ.16,000ల చెక్,బానోతు కళ్యాణి కి రూ.36వేల చెక్కును వీరన్న నాయక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కాలేరు శివాజీ, గ్రామ పార్టీ అధ్యక్షులు బానోత్ బాలు నాయక్, భూక్య వెంకన్న,గుగులోతు మంగ్య,దేవేందర్ నాయక్,ముని,శ్రీకాంత్,బక్క్య,సీతారాం నాయక్, వీరన్న,భాష,సామ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి జిల్లా మహిళల కబడ్డీ జట్టు ఎంపికకు రంగం సిద్ధం

● ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపికలు.. అర్హులైన క్రీడాకారిణులు హాజరుకావాలి

పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా మహిళల కబడ్డీ జట్టు ఎంపిక కార్యక్రమాన్ని ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ట్రినిటీ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కరుణాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మహిళా కబడ్డీ క్రీడాకారిణులు ఈ ఎంపికల్లో పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటుకోవాలని ఆయన కోరారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారిణులు తప్పనిసరిగా 75 కిలోల లోపు బరువు కలిగి ఉండాలని సూచించారు. ఎంపికలకు హాజరయ్యే వారు తమ ఒరిజినల్ ఆధార్ కార్డు, పదో తరగతి ఒరిజినల్ మెమోను వెంట తీసుకురావాలని స్పష్టం చేశారు. అవసరమైన ధ్రువపత్రాలతో నిర్ణీత సమయానికి ఎంపికల కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఈ ఎంపికల్లో ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పెద్దపల్లి జిల్లా తరపున పాల్గొంటారని కరుణాకర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో కబడ్డీ క్రీడపై ఆసక్తి కలిగిన మహిళా క్రీడాకారిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఎంపికల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు: 9908133143

TWJF మీడియా మిత్రులకు GMR ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాగుల పంపిణీ

● మీడియా మిత్రులకు అండగా GMR ఫౌండేషన్.. గుబ్బపు మచ్చేందర్ సేవాభావం

ప్రజా వాణి న్యూస్ అక్టోబర్ 23 సంగారెడ్డి జిల్లానారాయణఖేడ్ పట్టణంలో TWJF మీడియా మిత్రులకు GMR ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాగుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో GMR ఫౌండేషన్ చైర్మన్, BRS పార్టీ నాయకులు గుబ్బపు మచ్చేందర్ స్వయంగా మీడియా మిత్రులకు బ్యాగులను అందజేశారు. సమాజంలో ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తున్న మీడియా మిత్రులను గౌరవిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం. ప్రజాసేవతో పాటు మీడియా మిత్రులకు తోడుగా నిలవాలనే సదుద్దేశంతో GMR ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ అనుముల మారుతి, కంగ్టి మండల BRS పార్టీ అధ్యక్షులు గంగారం, BRS పార్టీ సీనియర్ నాయకులు బసవరాజు పటేల్, నాయకులు తుకారాం, తదితరులు పాల్గొన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా.. అన్ని వర్గాల ప్రజలకు అండగా GMR ఫౌండేషన్ ముందుకు సాగుతోంది.

రాణాపూర్ తండాలో ఫైనాన్షియల్ సాచురేషన్ అవగాహన కార్యక్రమం

నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో అక్టోబర్ 23:-దేశంలో ప్రతి ఒక్కరికీ బ్యాంకింగ్, ఆర్థిక సేవలను పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలనే ప్రధాన లక్ష్యంతో చేపట్టిన దేశవ్యాప్త ముమ్మర ఫైనాన్షియల్ సాచురేషన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం, నిర్మల్ గ్రామీణ మండలంలోని రాణాపూర్ తండాలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ స్థాయిలోని చివరి వ్యక్తి వరకు బ్యాంకింగ్ సేవలను చేరవేయడం, ప్రతీ ఒక్కరినీ ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములను చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఆర్థిక అవగాహనపై దిశానిర్దేశం చేశారు. సాధారణ ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వారికి బ్యాంకింగ్ వ్యవస్థ కల్పిస్తున్న సౌకర్యాలు, పొదుపు పథకాలు, డిజిటల్ ఆర్థిక లావాదేవీల వల్ల కలిగే ప్రయోజనాలను గురించి వారు సమగ్రంగా వివరించారు. రిజర్వ్ బ్యాంక్ చేపడుతున్న ఈ ప్రచార కార్యక్రమం వల్ల ఆర్థిక భద్రత పెరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న బ్యాంకింగ్ అధికారులు తండా వాసులకు వివిధ ప్రభుత్వ ఆర్థిక సంక్షేమ పథకాలు, ప్రధాన మంత్రి జన ధన్ యోజన, సామాజిక భద్రతా బీమా పథకాలు, సూక్ష్మ రుణాలు పొందే విధానాలపై వివరణాత్మకమైన అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, డిజిటల్ బ్యాంకింగ్ మోసాల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా అధికారుల బృందం క్షుణ్ణంగా వివరించింది. ఈ కార్యక్రమంలో ఆర్బిఐ ఏజీఎం రాములు, శ్రీనివాస్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, గ్రామ సర్పంచ్ నెహ్రూ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎం ఎల్ సి ఓటరు నమోదుపై క్షేత్రస్థాయిలో డాక్టర్ మెతుకు ఆనంద్ అవగాహన

ప్రజా వాణి, వికారాబాద్ జిల్లా, అక్టోబర్ 23:వికారాబాద్ పట్టణంలోని 4వ వార్డు శివారెడ్డిపేట్, 5వ వార్డు కొత్రేపల్లిలో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఏం ఎల్ సి ఓటరు నమోదు కార్యక్రమంలో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన పట్టభద్రులు పెద్ద సంఖ్యలో ఓటరుగా నమోదు చేసుకొని, ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించడానికి, వారి హక్కులు మరియు ప్రయోజనాలను కాపాడటానికి ఏం ఎల్ సి ఎన్నికల్లో ఓటు హక్కు ఎంతో కీలకమని పేర్కొన్నారు. గతంలో గ్రాడ్యుయేట్ ఎం ఎల్ సి ఎన్నికల్లో ఓటు వేసిన వారు సైతం ప్రస్తుత ఎన్నికల కోసం వర్తించే నిబంధనల ప్రకారం మళ్లీ నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉందని, సాధారణ ఎన్నికల ఓటరు జాబితాలో పేరు ఉన్నంత మాత్రాన గ్రాడ్యుయేట్ ఓటరు జాబితాలో పేరు ఉంటుందని భావించకూడదని వివరించారు. అర్హులైన పట్టభద్రులు తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు తదితర అవసరమైన పత్రాలతో నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎవరూ తమ విలువైన ఓటు హక్కును కోల్పోకుండా, అర్హులైన ప్రతి ఒక్కరూ గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పట్టభద్రుల హక్కుల పరిరక్షణకు ఓటరు నమోదు తొలి అడుగు. అర్హులైన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకొని ప్రజాస్వామ్య బలోపేతానికి తోడ్పడాలి.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎర్రబెల్లి సంపత్ రావు ఏకగ్రీవంగా ఎన్నిక ఘనంగా సన్మానం

- గండ్రపల్లి గ్రామం నుంచి జిల్లా స్థాయి నాయకత్వం వరకు ప్రస్థానం
- బీజేవైఎం మండల అధ్యక్షుడి నుంచి జిల్లా ఉపాధ్యక్షుడి వరకు రాజకీయ ప్రస్థానం
- మండల అధ్యక్షుడిగా మూడుసార్లుఇప్పుడు జిల్లా ఉపాధ్యక్షుడిగా మూడోసారి బాధ్యతలు
- పార్టీ నాయకత్వం నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా ఎర్రబెల్లి సంపత్ రావు

జమ్మికుంటఅక్టోబర్ 23 (ప్రజావాణి)కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీకి సంబంధించిన సంస్థాగత కార్యక్రమాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగిన నాయకుడు ఎర్రబెల్లి సంపత్ రావు. జమ్మికుంట మండలం గండ్రపల్లి గ్రామానికి చెందిన ఆయనకు కరీంనగర్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడిగా మూడోసారి అవకాశం లభించింది. పార్టీ నాయకత్వం తనపై మరోసారి విశ్వాసం ఉంచి జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించడంతో సంపత్ రావు మూడోసారి జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. గ్రామస్థాయి నుంచి మండల, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో పార్టీ కార్యకలాపాల్లో భాగస్వామిగా కొనసాగిన ఆయన రాజకీయ ప్రస్థానం స్థానికంగా చర్చనీయాంశంగా మారిందిబీజేవైఎంతో ప్రారంభమైన రాజకీయ ప్రస్థానం ఎర్రబెల్లి సంపత్ రావు తన రాజకీయ ప్రస్థానాన్ని భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) జమ్మికుంట మండల అధ్యక్షుడిగా ప్రారంభించారు. యువతను పార్టీ వైపు ఆకర్షించడం, పార్టీ కార్యక్రమాల్లో యువకుల భాగస్వామ్యాన్ని పెంపొందించడం వంటి సంస్థాగత బాధ్యతల్లో పనిచేశారు. అనంతరం బీజేపీ జమ్మికుంట మండల అధ్యక్షుడిగా మూడుసార్లు బాధ్యతలు నిర్వహించారు మండల స్థాయిలో పార్టీ కార్యకలాపాల్లో కొనసాగుతూ, పార్టీ సంస్థాగత నిర్మాణంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేదిశగాపనిచేశారుఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్థాయిలోనూ బాధ్యతలుమండల స్థాయిలో తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించిన సంపత్ రావుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పనిచేసే అవకాశం లభించింది. రాష్ట్ర స్థాయి బాధ్యతల అనంతరం కరీంనగర్ జిల్లా బీజేపీ కార్యదర్శిగా పనిచేశారు. ఈ క్రమంలో పార్టీకి సంబంధించిన వివిధ సంస్థాగత కార్యక్రమాల్లో భాగస్వామిగా కొనసాగారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి, తాజాగా అదే పదవికి మూడోసారి అవకాశం దక్కించుకున్నారునాయకత్వం నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాజిల్లా ఉపాధ్యక్షుడిగా మూడోసారి అవకాశం కల్పించిన పార్టీ నాయకత్వానికి ఎర్రబెల్లి సంపత్ రావు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారుతనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని సంపత్ రావు తెలిపారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారుకార్యకర్త స్థాయి నుంచి జిల్లా స్థాయి బాధ్యతల వరకుబీజేవైఎం మండల అధ్యక్షుడిగా మొదలైన ప్రస్థానం, బీజేపీ మండల అధ్యక్షుడిగా మూడుసార్లు నిర్వహించిన బాధ్యతలు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సేవలు జిల్లా కార్యదర్శి పదవి ఇలా వివిధ స్థాయిల్లో పనిచేసిన సంపత్ రావు ఇప్పుడు జిల్లా ఉపాధ్యక్షుడిగా మూడోసారి బాధ్యతలు చేపట్టడం ఆయన రాజకీయ ప్రస్థానంలో మరో ముందడుగుగా నిలిచింది. గండ్రపల్లి గ్రామానికి చెందిన నాయకుడిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం జిల్లా స్థాయి పార్టీ బాధ్యతల వరకు చేరడం విశేషంగా నిలుస్తోంది. 3 వ సారి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామ్మకమైన సంపత్ రావు ను జమ్మికుంట బిజెపి శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో బిజెపి జమ్మికుంట పట్టణ మాజీ అధ్యక్షుడు జీడీ మల్లేష్, ఇల్లంతకుంట మండలం మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, కోరె రవిందర్,కొమ్ము అశోక్ మేక సుధాకర్ రెడ్డి పల్లపు రవి,గుర్రం పరుశురాం, గట్టు సాయిరాం,మోత స్వామి ఇటుకాల స్వరూప, ఎదలా పురం అశోక్, మోడెం రాజు, లోకిని రాజేష్, తూర్పాటి శంకర్, కడెం సతీష్, ఉడుగుల మహేందర్, పోడేటి అనిల్,ఏగ్గటి హరీష్, చెంద్రమౌళి, బొజ్జ శరత్, కనుమల్ల లక్ష్మి, లల్లు, పసునూటి శివ, లకిడే రాజు, గడ్డం శ్రీ వర్మ కొడశీ శ్రావణ్, పల్ల బోయిన పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు

అయ్యప్ప పడిపూజలోనే ఆభరణాల చోరీ.. నిందితుడి అరెస్ట్!

- సీసీఎస్ కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ క్రైమ్ పోలీసుల సంయుక్త ఆపరేషన్
- రూ.2.80 లక్షల విలువైన బంగా రు, వెండి ఆభరణాలు స్వాధీనం

కూకట్‌పల్లి, అక్టోబర్ 23 (ప్రజావాణి):అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమాన్ని అవకాశంగా తీసుకుని ఇంట్లో బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేసిన నిందితుడిని సీసీఎస్ కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ క్రైమ్ పోలీసుల సంయుక్త బృందాలు అరెస్టు చేశాయి. నిందితుడి నుంచి సుమారు రూ. 2.80 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు మొబైల్ ఫోన్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

పూజా కార్యక్రమం వేళ చోరీ

పోలీసుల వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ పరిధిలోని నిజాంపేట్ ఎక్స్ రోడ్స్, సర్దార్ పటేల్ నగర్‌లోని ఈడెన్ హోమ్స్‌లో నివాసం ఉంటున్న బోనగిరి రాధిక ఇంట్లో అక్టోబర్ 16న అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన పూజారితో పాటు సహాయక పూజారిగా వచ్చిన చెన్నబోయిన రాజేందర్ అలియాస్ రాజు కూడా హాజరయ్యాడు. పూజా కార్యక్రమం సందర్భంగా ఇంట్లోకి వెళ్లేందుకు అవకాశం లభించడంతో, కుటుంబ సభ్యులు పూజలో నిమగ్నమైన సమయంలో బీరువాలోని బంగారు, వెండి ఆభరణాలను అపహరించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

అక్టోబర్ 21న ఆభరణాలు, నగదు కనిపించకపోవడంతో బాధితురాలు కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

లులు మాల్ సమీపంలో పట్టివేత

సీసీఎస్ కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ క్రైమ్ పోలీసు బృందాలు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టి, విశ్వసనీయ సమాచారం ఆధారంగా అక్టోబర్ 23న కేపీహెచ్‌బీ కాలనీలోని లులు మాల్ సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నాయి. చోరీ చేసిన ఆభరణాలను తక్కువ ధరకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం అతడి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

నిందితుడిని వరంగల్ జిల్లా కురవి మండలం నల్లెల్ల గ్రామానికి చెందిన చెన్నబోయిన రాజేందర్ అలియాస్ రాజు (28)గా గుర్తించారు. వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్ అయిన అతడు ప్రస్తుతం మూసాపేటలోని యాదవ బస్తీలో నివసిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

161 గ్రాములకు పైగా బంగారం స్వాధీనం

నిందితుడి నుంచి మొత్తం 161.28 గ్రాముల బంగారు ఆభరణాలు, 34.50 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రిమాండ్ నివేదిక ప్రకారం రూ. 2.80 లక్షలుగా పోలీసులు పేర్కొన్నారు. అదనంగా వివో వీ40 మొబైల్ ఫోన్, ఏపీ09సీహెచ్3439 నంబరు గల స్ప్లెండర్ ప్లస్ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

నిందితుడికి గతంలో సనత్‌నగర్, మాదాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీ కేసులతో సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నిందితుడిని అక్టోబర్ 23న అరెస్టు చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించే ప్రక్రియ చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. ఇళ్లలో పూజలు, శుభకార్యాలు నిర్వహించే సమయంలో బంగారు ఆభరణాలు, నగదును భద్రంగా ఉంచుకోవాలని, ఇంటికి వచ్చే వ్యక్తుల విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని కేపీహెచ్‌బీ పోలీసులు ప్రజలకు సూచించారు.

స్వేచ్ఛ ఆడబిడ్డపథకం ప్రారంభం మాట నిలబెట్టుకున్నారు ఉప సర్పంచ్ అంబాల స్వప్న రజినీకాంత్

- తనుగులగ్రామానికి చెందిన ఇద్దరు ఆడ బిడ్డలకు రూ.2,016 చొప్పున అంబాల రజనీకాంత్ జన్మదినం సందర్భంగా అందజేశారు
- తనుగుల గ్రామ ఉప సర్పంచ్ అంబాల స్వప్న రజనీకాంత్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారు స్వేచ్ఛ ఆడబిడ్డపేరిట ఆడబిడ్డ పుట్టిన కుటుంబానికి రూ.2,016 ఇవ్వనున్నట్టు ప్రకటించారు

జమ్మికుంట అక్టోబర్ 23 (ప్రజావాణి)జమ్మికుంట మండలంలోని తనుగుల గ్రామంలోకొంత మంది నేతల హామీలు నీటి మూటలుగా మారుతున్న ప్రస్తుత తరుణంలో అందుకు భిన్నంగా ఇచ్చిన హామీలను ఆచరణలో నిలబెట్టుకునే నాయకులు అరుదు అని చెప్పొచ్చు. ఆ కోవకు చెందిన వారే జమ్మికుంట మండల పరిధిలోని తనుగుల గ్రామ ఉప సర్పంచ్ అంబాల స్వప్న రజనీకాంత్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారు స్వేచ్ఛ ఆడబిడ్డపేరిట ఆడబిడ్డ పుట్టిన కుటుంబానికి రూ. 2,016 ఇవ్వనున్నట్టు ప్రకటించారు. నాటి మాటను నేడు (శుక్రవారం) నిలబెట్టుకున్నారు. గ్రామానికి చెందిన ఇద్దరు ఆడ బిడ్డలకు రూ. 2,016 చొప్పున అంబాల రజనీకాంత్ జన్మదినం సందర్భంగా అందజేశారు ఆడపిల్ల జన్మను గౌరవిస్తూ ఆడబిడ్డల పట్ల సమాజంలో గౌరవాన్ని పెంపొందిస్తూ వారి భవిష్యత్తుకు భరోసా కల్పించే గొప్ప ఆశయంతో స్వేచ్ఛ ఆడబిడ్డ పథకాన్నిఉపసర్పంచ్ అంబాల స్వప్న రజనీకాంత్ ప్రారంభించడం పట్ల సర్పంచ్ జక్కె కిరణ్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారుస్వేచ్ఛ ఆడబిడ్డ వాల్ పోస్టర్ ను అందరూ కలిసి ఆవిష్కరించారుఈ సందర్భంగా ఉప సర్పంచ్ అంబాల రజనీకాంత్. మాట్లాడుతూఆడపిల్ల అంటే భారం కాదు ఒక కుటుంబానికి వరం సమాజానికి గర్వకారణం అని ప్రతి ఆడబిడ్డకు గౌరవం ప్రేమ సమాన అవకాశాలు అందాలనే ఆలోచనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు. ఆడపిల్ల పుట్టుకను గౌరవించే ఆలోచన మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని ఈ పథకం ఆడబిడ్డల జీవితాల్లో ఆనందాన్ని నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామనీ పేర్కొన్నారు ఆడబిడ్డను గౌరవిద్దాంఆడబిడ్డను ఆదరిద్దాంఆడపిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేద్దాం అని పిలుపునిచ్చారు గ్రామ పంచాయతీ ఆఫీసుకు గ్రామ పంచాయతీ కార్యాలయం పేరిట బోర్డు ను సైతం ఉప సర్పంచ్ దంపతులు బహూకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కిరణ్ జక్కే ఉప సర్పంచ్ వార్డు సభ్యులు మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీసుల విధులు.. బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన

- పోలీసు వ్యవస్థపై నమ్మకం పెంపొందించడమే ఓపెన్ హౌస్ లక్ష్యం
- రాజగోపాల పేట్ ఎస్సై టి. వివేక్

ప్రజావాణి,నంగునూరు, అక్టోబరు 23: పోలీసుల విధులు, బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచడమే ఓపెన్ హౌస్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని రాజగోపాలపేట ఎస్సై టి.వివేక్ తెలిపారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రాజగోపాలపేట పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు పోలీసు వ్యవస్థ పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకోవడం ద్వారా సమాజంలో పోలీసుల పాత్రను అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాజగోపాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలు, వాటి పనితీరు, పోలీసులు నిర్వహించే విధులు, శాంతిభద్రతల పరిరక్షణలో వారి పాత్ర గురించి విద్యార్థులకు వివరించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుల స్వీకరణ, ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీసులు చేపట్టే చర్యలు, నేరాల నియంత్రణ, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం నిర్వహించే విధులపై అవగాహన కల్పించారు.

సమాజంలో శాంతి, భద్రతలను కాపాడటంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తారని ఎస్సై వివేక్ వివరించారు. ప్రజలకు ఎలాంటి సమస్య ఎదురైనా చట్టపరిధిలో పోలీసులను సంప్రదించి సహాయం పొందవచ్చని తెలిపారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. సమాజంలో జరిగే అసాంఘిక కార్యకలాపాలు, అనుమానాస్పద ఘటనలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అవసరమైనప్పుడు పోలీసులకు సమాచారం అందించాలని వివరించారు.పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ప్రాధాన్యాన్ని తెలియజేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల సేవలు, త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం పోలీసులు చేసే సేవలను విద్యార్థులు తెలుసుకోవాలని చెప్పారు. సమాజం పట్ల బాధ్యతను గుర్తించాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓపెన్ హౌస్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పనితీరుపై ప్రత్యక్ష అవగాహన కలుగుతుందని అన్నారు. రాజగోపాలపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.కనకయ్య మాట్లాడుతూ పోలీసుల విధులపై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకునేందుకు అవకాశం విద్యార్థులకు లభించిందని పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థపై సానుకూల దృక్పథాన్ని పెంచిందని తెలిపారు. ప్రజలు, పోలీసుల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడానికి ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమం దోహదపడిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు టి.కనకయ్యతో పాటు ఉపాధ్యాయుడు బీరకాయల తిరుపతి, పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీ చేసిన

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్

ప్రజా వాణి,వికారాబాద్ జిల్లా,అక్టోబర్ 23: సబ్సిడీపై శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు.వికారాబాద్ మండలం లోని నారాయణపూర్ రైతువేదికలో రైతులకు శనగ విత్తనాలను వైస్ చైర్మన్ మల్లేశంతో కలిసి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.నాణ్యమైన విత్తనాలను సరైన సమయంలో వినియోగించుకోవడం ద్వారా మెరుగైన పంట దిగుబడులు సాధించొచ్చని తెలిపారు.రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని వ్యవసాయ.అధికారి ప్రసన్న లక్ష్మి మాట్లాడుతూ.యాసంగి పంటల సాగు వాతావరణ పరిస్థితులను పరిగినలోకి తీసుకోవాలి తెలిపారు.హెలినో ప్రభావం కారణంగా నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని వరి,మొక్కజొన్న వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా పెసర,మినుము, వేరుశనగా,జొన్న వంటి తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. సబ్సిడీపై శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.25 కిలోల బ్యాగు ధర రూ.2,500 కాగా ప్రభుత్వ రూ.1,000 సబ్సిడీ పోను రైతులు రూ.1500 చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు.పట్టాదారు పాస్బుక్,ఆధార్ జిరాక్స్ ఏఈఓ ను సంప్రదించి నారాయణపూర్ రైతువేదిక కేంద్రంలో విత్తనాలు పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏ ఓ.ప్రసన్న లక్ష్మి ఏఎంసి డైరెక్టర్ రంగారెడ్డి,ఏ ఈ ఓ రమాదేవి,రైతులు, అధికారులు నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం ఆరబోసుకునేందుకు మార్కెట్ యార్డు గేట్లు తెరవాలి

- రెండు రోజుల్లో తాళం తీయకపోతే మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉ పాధ్యక్షుడు పరకాల తిరుపతిరెడ్డి హెచ్చరిక

ప్రజావాణి,నంగునూరు, అక్టోబరు 23: సిద్ధన్నపేటలోని నంగునూరు వ్యవసాయ మార్కెట్ యార్డు గేటుకు వేసిన తాళాన్ని వెంటనే తీసి రైతులు ధాన్యాన్ని ఆరబోసుకునేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పరకాల తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. రెండు రోజుల్లోగా గేటు తాళం తీసి ధాన్యాన్ని ఆరబోసుకునే అవకాశం కల్పించకపోతే రైతులతో కలిసి మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

వానాకాలం వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో రైతులు పంట నూర్పిడి చేసిన ధాన్యాన్ని ఆరబోసుకుని విక్రయించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో సరైన కల్లాలు లేకపోవడంతో గత కొంతకాలంగా రైతులు సిద్ధన్నపేటలోని నంగునూరు వ్యవసాయ మార్కెట్ యార్డుకు ధాన్యాన్ని తీసుకొచ్చి ఆరబోసుకుంటున్నారు. యార్డులో స్థలం లభించని సందర్భాల్లో రహదారులపైనే ధాన్యాన్ని ఆరబోసుకోవాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అయితే ఈసారి ధాన్యాన్ని ముందుగా ఆరబోసుకుని, ఆ తర్వాతే మార్కెట్ యార్డుకు తీసుకురావాలని అధికారులు సూచిస్తూ యార్డు గేటుకు తాళం వేసి ఉంచడం రైతులకు మరింత ఇబ్బందిగా మారిందని తిరుపతిరెడ్డి అన్నారు. గ్రామాల్లో ధాన్యం ఆరబోసుకునేందుకు తగిన స్థలాలు లేకపోవడంతో రైతులు మార్కెట్ యార్డు పై ఆధార పడుతున్నారని తెలిపారు. యార్డులోకి అనుమతించక పోతే ధాన్యాన్ని ఎక్కడ ఆర బోసుకోవాలని ప్రశ్నించారు. శుక్రవారం బీజేపీ సీనియర్ నాయకుడు అన్న రాజయ్య, సిద్ధన్నపేట గ్రామ బూత్ కమిటీ అధ్యక్షుడు బొల్లు అజయ్‌తో కలిసి తిరుపతిరెడ్డి మార్కెట్ యార్డు వద్ద పరిస్థితిని పరిశీలించారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. ధాన్యం తడిసి పోకుండా, నాణ్యత దెబ్బతినకుండా ఆర బోసుకునే సౌకర్యం కల్పించడం మార్కెట్ కమిటీ బాధ్యత అని పేర్కొన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించుకునే సమయంలోనే వారికి సహకారం అందించాల్సిన అధికారులు, గేటుకు తాళం వేసి ఇబ్బందులకు గురి చేయడం సరికాదని అన్న రాజయ్య అన్నారు. యార్డులో అందుబాటులో ఉన్న స్థలాన్ని సక్రమంగా వినియోగించి రైతులకు ధాన్యం ఆర బోసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించక పోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని బొల్లు అజయ్ హెచ్చరించారు.

సింహ గర్జనతో ముదిరాజ్ ల సత్తా చాటాలి

- తెలంగాణ ముదిరాజ్ మహాసభ మంచిర్యాల జిల్లా యువజన అధ్యక్షుడు గరిగే సుమన్

మంచిర్యాల, ప్రజావాణి రిపోర్టర్,అక్టోబర్ 23: జిల్లా కేంద్రమైన మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వేంపల్లి లో గల పద్మావతి గార్డెన్ లో తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో అక్టోబర్ 25న జరగబోయే ముదిరాజ్ సింహ గర్జనతో ముదిరాజ్ ల సత్తా చాటాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ యువజన జిల్లా అధ్యక్షుడు గరిగే సుమన్ శుక్రవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సింహగర్జన కు కుల బంధువులందరూ ఏకమై రావాలన్నారు. సింహ గర్జన మహాసభకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, రాష్ట్ర మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వినోద్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఈటల రాజేందర్, బీసీ నేత నీలం మధు, పలువురు ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ సభలో ముదిరాజ్ ల ప్రధాన డిమాండ్ అయిన బీసీ-డీ నుంచి బీసీ-ఏ కి మార్పుతో పాటు ముదిరాజ్ సామాజిక వర్గ అభివృద్ధి, సంఘం బలోపేతం, యువతకు అవకాశాలు, విద్య ఉపాధి రంగాల్లో పురోగతి వంటి అంశాలపై చర్చించి, భవిష్యత్ ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ముదిరాజ్ కుల బాంధవులు ఈ సింహ గర్జనకు వేలాదిగా తరలివచ్చి, గర్జనను విజయవంతం చేయాలని కోరారు..

కేసీఆర్, హరీశ్‌రావు అవినీతితోనే తెలంగాణలో కరువు కష్టాలు!

- కాళేశ్వరం ప్రాజెక్టులో నాణ్యత లోపాలు
- నీటిని నిల్వ చేయలేని దుస్థితి
- టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి విమర్శ

తెలంగాణలో రైతులు ఎదుర్కొంటున్న కరువు కష్టాలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలే కారణమని టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి, నాణ్యతా లోపాల కారణంగా ప్రాజెక్టు ఆశించిన స్థాయిలో నీటిని నిల్వ చేసి వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ప్రజాధనంతో నిర్మించిన భారీ ప్రాజెక్టు రైతులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూర్చలేకపోవడం గత పాలకుల వైఫల్యానికి నిదర్శనమన్నారు. కేసీఆర్, హరీశ్‌రావుల పాలనలో సాగునీటి ప్రాజెక్టుల పేరుతో భారీగా ఖర్చు చేసినప్పటికీ, రైతులకు ఆశించిన ప్రయోజనాలు అందలేదని యాదగిరి ఆరోపించారు. ప్రాజెక్టుల నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇచ్చి ఉంటే నేడు సాగునీటి సమస్యలు ఇంత తీవ్రంగా ఉండేవి కావన్నారు. ప్రాజెక్టుల ద్వారా ప్రతి ఎకరాకు నీరు అందిస్తామని చెప్పిన గత పాలకులు, ప్రస్తుతం రైతులు నీరు, విద్యుత్తు కోసం ఇబ్బందులు పడుతున్న పరిస్థితికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల కరెంటు కష్టాలు, నీటి ఎద్దడికి గత పాలకుల విధానాలు కూడా కారణమని ఆరోపించిన యాదగిరి, ఇప్పుడు హరీశ్‌రావు రైతులను పరామర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. చేసిన తప్పులకు బాధ్యత వహించాల్సిన వారే రైతుల సమస్యలపై మొసలి కన్నీరు కార్చడం హాస్యాస్పదమని విమర్శించారు. "చంపినోడే తద్దినం పెట్టినట్లు" రైతుల సమస్యలకు కారణమైన వారే పరామర్శల పేరుతో రాజకీయాలు చేయడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు.కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, నాణ్యతా ప్రమాణాలు, ప్రజాధనం వినియోగంపై సమగ్రంగా సమీక్షించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని యాదగిరి డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరు, నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల ఇబ్బందులను రాజకీయ విమర్శలకు పరిమితం చేయకుండా, వారి సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని దేవులపల్లి యాదగిరి పేర్కొన్నారు.ఈ కార్యక్రమం మండల కాంగ్రెస్ నాయకులు ఆరెపల్లి సురేష్ పాల్గొన్నారు.

పానగల్ ఛాయా సోమేశ్వరాలయం అభివృద్ధికి రూ. 20 కోట్లు మంజూరు

- మంత్రి కోమటిరెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి
- పానగల్ ను ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి నల్గొండ జిల్లా కేంద్ర సమీపంలోని చారిత్రాత్మక పానగల్ ఛాయా సోమేశ్వర ఆలయం, పరిసర ప్రాంతాల సమగ్ర సుందరీకరణ, అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసింది.ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గతంలో పానగల్ లోని శ్రీ చాయ సోమేశ్వర స్వామి దేవాలయం,పరిసర ప్రాంతాలు, సమీపంలోని జల వనరులను సమగ్రంగా అభివృద్ధి చేసి సుందరీకరించాలని ప్రతిపాదించారు. ఈ విషయాన్ని పరిశీలించిన ప్రభుత్వం ఎట్టకేలకు తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కు రూ.20 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలనాపరమైన అనుమతి ఇచ్చింది. ఈ నిధులను ఉపయోగించి పానగల్ లోని శ్రీ ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయం దాని పరిసర ప్రాంతాలు సమీపంలోని జన వనరుల సమగ్ర సుందరీ కరణ మరియు అభివృద్ధి పనులను చేపట్టనుంది. అదేవిధంగా దేవాలయాలను ప్రముఖ వారసత్వ ఆధ్యాత్మిక మరియు పర్యావరణ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనుంది.

చరిత్రకు సజీవ సాక్ష్యం పానగల్ దేవాలయాలు

-బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

పానగల్ లోని పచ్చుల, ఛాయా సోమేశ్వర దేవాలయాలు చరిత్రకు సజీవ సాక్ష్యమని నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

పానగల్‌లోని చారిత్రాత్మక శ్రీ ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం, పరిసర ప్రాంతాల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.20 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసిన తెలంగాణ ప్రభుత్వానికి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ పరిసరాల సుందరీకరణ, పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ నిధులు ఎంతగానో ఉపయోగపడనున్నాయని పేర్కొన్నారు. చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన పానగల్ ప్రాంతాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

చారిత్రక ఆలయాల పరిరక్షణతో పాటు పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. పానగల్ ప్రాంత అభివృద్ధికి ఈ నిధుల మంజూరు కీలక ముందడుగుగా నిలుస్తుందని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

ప్రజా వ్యతిరేకసర్ ప్రక్రియను బేషరతుగా రద్దు చేయాలి

- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య గారికి వినతి పత్రం అందజేత,
- కొండు బానేష్,
- ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి,
- లాల్ కుమార్ ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు,

మంచిర్యాల, ప్రజావాణి రిపోర్టర్,అక్టోబర్ 23: కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను తన పదవి నుండి తొలగించాలని, అక్రమంగా తొలగించిన అర్హుల ఓట్లను తిరిగి ఓటరు జాబితాలో చేర్చాలని, కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న తప్పుడు, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించిన వాళ్లను, ముస్లిం, క్రిస్టియన్, మైనారిటీకి చెందిన అర్హులైన వాళ్ళ ఓట్లను అక్రమంగా తొలగించే కుట్రలకు పాల్పడుతుందని, ఇందులో భాగంగానే ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ద్వారా అర్హులైన ఓటర్లను ఓటరు జాబితా నుండి తొలగించడానికి పూనుకున్నదని, రాజ్యాంగానికి లోబడి, స్వాతంత్రంగా ఉండాల్సిన ప్రస్తుత ఎన్నికల కమిషనర్ బిజెపి కి కార్యకర్తగా, నాయకునిగా వ్యవహరిస్తున్న తీరు చాలా సరైనది కాదని, ఒకప్పుడు గ్రామీణ, పట్టణ పరిసర ప్రాంతాలలో ప్రజలను ఓటు విషయంలో ఎడ్యుకేట్ చేస్తూ ఓటర్ నమోదు చేయించిన పరిస్థితి నుండి బిజెపి అధికారంలోకి వచ్చాక అర్హులైన ఓట్లను, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారనే దుర్మార్గమైన చర్యకు పూనుకుంటుందని, ఇప్పటికే 20 కోట్లకు పైగానే అర్హులైన వాళ్ల ఓట్లను ఓటరు జాబితా నుండి తొలగించారని దీనంతటికీ కారణం ఒక ఉన్నతమైన రాజ్యాంగ పదవిలో ఉన్న ఎన్నికల కమిషనర్ ఈ విధంగా ప్రభుత్వంకు ఏజెంటుగా, కీలుబొమ్మగా మారి ఏది చెబితే, ఎవరి ఓట్లు తీసేయమంటే కోట్లల్లో అర్హులైన ఓటర్లను తొలగించడం ఎంత అన్యాయమని, అందుకే ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రజా ద్రోహి ఇతన్ని తక్షణమే పదవి నుండి తొలగించాలని, సర్ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని, తొలగించిన ఓటర్లను ఎలాంటి షరతులు విధించకుండా ఓటర్ జాబితాలో చేర్చాలని, సంయుక్త కిషన్ మోర్చా (ఎస్ కే యం) రైతు సంఘాలు, కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది,

కార్యక్రమంలో బోడెంకి చందు, ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి, గోగర్ల శంకర్, ఏ ఐ కే కే ఎస్ జిల్లా కార్యదర్శి, ప్రకాష్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, ఇందారపు రాజేష్, ఏ ఐ కె ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి, దొండ ప్రభాకర్, ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు, మహేష్ డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, రాములు(రజక్) జిల్లా కార్యదర్శి, ప్రేమ్ కుమార్ జిల్లా కమిటీ సభ్యులు, వేల్పుల శంకర్ ఏ ఐ కేకే ఎస్ జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు

పలువురిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మహ రెడ్డి భుపాల్

ప్రజా వాణి న్యూస్ అక్టోబర్ 23 సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం వాసర్ గ్రామానికి చెందిన గుండుబా శీనా బాయి మరియు నారాయణ రెడ్డి ఇటీవల మరణించిన విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యాన్ని చెప్పిన నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి వారితోపాటు మాజీ జడ్పీటీసీ నరసింహారెడ్డి, శివాజీ పటేల్, నాగు రావు, అంబదాస్, లక్ష్మణ్, విట్టల్ రావు, యాదవ రావు, ప్రభాకర్ రెడ్డి, సంజీవరెడ్డి, నర్సారెడ్డి తదితరులు ఉన్నారు.

అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాలు

నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ సూచనల మేరకు నల్లగొండ జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లు, పోలీస్ కార్యాలయాల్లో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరు, పోలీస్ స్టేషన్లలో నిర్వహించే విధులు, నేరాల నియంత్రణ, నేర పరిశోధనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ప్రజల భద్రత కోసం పోలీసులు ఉపయోగించే పరికరాలు, వివిధ విభాగాల విధులపై అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్లలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, బాధితులకు న్యాయం అందించేందుకు చేపట్టే చర్యలు, ప్రజలకు అందించే పోలీస్ సేవలు, పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డుల నిర్వహణ తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు స్పందించే విధానం, ప్రజల భద్రత కోసం చేపట్టే చర్యలు, పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో వ్యవహరించే తీరు, ప్రజలు పోలీసులకు అందించాల్సిన సహకారం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖలోని ఐటీ సెల్, బాంబ్ డిస్పోజల్ టీం (దీణ టీం), సైబర్ క్రైమ్, ఫింగర్ ప్రింట్స్, కమ్యూనికేషన్, జిల్లా నేర రికార్డుల విభాగం (ణజ=దీ), స్పెషల్ బ్రాంచ్ (ౚదీ), డాగ్ స్క్వాడ్ విభాగాల పనితీరును విద్యార్థులకు వివరించారు. ఐటీ సెల్ ద్వారా పోలీస్ శాఖలో సమాచార సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, డిజిటల్ సేవలు, సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యత, నేరాల గుర్తింపులో సాంకేతిక ఆధారాల పాత్రను తెలియజేశారు. బాంబ్ డిస్పోజల్ టీం ద్వారా పేలుడు పదార్థాలను గుర్తించడం, అనుమానాస్పద వస్తువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో పాటించాల్సిన భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్ విభాగం ద్వారా ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ కాల్స్, ఓటీపీ మోసాలు, ఫిషింగ్ లింకులు, సోషల్ మీడియా ద్వారా జరిగే నేరాల గురించి వివరించారు. గుర్తుతెలియని వ్యక్తులకు బ్యాంకు వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు వెల్లడించవద్దని, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫింగర్ ప్రింట్స్ విభాగం ద్వారా నేరస్థలాల్లో వేలిముద్రల సేకరణ, విశ్లేషణ, నేరస్థులను గుర్తించడంలో వాటి ప్రాధాన్యతను వివరించారు. కమ్యూనికేషన్ విభాగం ద్వారా వైర్‌లెస్ వ్యవస్థ, అత్యవసర సమయాల్లో పోలీస్ సిబ్బంది మధ్య సమాచార మార్పిడి, వివిధ విభాగాల సమన్వయం గురించి తెలియజేశారు. డీసీఆర్‌బీ విభాగం ద్వారా నేర గణాంకాల నిర్వహణ, నేరస్థుల వివరాల నమోదు, నేరాల విశ్లేషణ, నేర పరిశోధనలో రికార్డుల ప్రాముఖ్యతను వివరించారు. స్పెషల్ బ్రాంచ్ విభాగం ద్వారా శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా భద్రతకు సంబంధించిన సమాచార సేకరణ, పండుగలు, ముఖ్యమైన కార్యక్రమాల సమయంలో భద్రతా ఏర్పాట్లలో నిర్వహించే విధులను తెలియజేశారు. డాగ్ స్క్వాడ్ ద్వారా నేర పరిశోధనలో పోలీస్ జాగిలాల పాత్ర, నేరస్థలాల్లో ఆధారాల ఆధారంగా నిందితులను గుర్తించడం, పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులను గుర్తించడంలో శిక్షణ పొందిన జాగిలాల సేవలను వివరించారు. జాగిలాలకు ఇచ్చే ప్రత్యేక శిక్షణ, వాటి సామర్థ్యం, నేరాల ఛేదనలో వాటి ప్రాధాన్యతను ప్రదర్శన ద్వారా విద్యార్థులకు తెలియజేశారు. పోలీస్ అమరవీరులు దేశం కోసం, ప్రజల రక్షణ కోసం చేసిన త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. వారి సేవలు, త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, చట్టాల పట్ల గౌరవాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పోలీస్ శాఖలోని వివిధ విభాగాల పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించడం ద్వారా విద్యార్థులకు పోలీసుల విధులపై అవగాహన పెంపొందడంతో పాటు పోలీస్--ప్రజల మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. నేరాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని జిల్లా పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఎస్బీ సీఐ నాగరాజు, 1 టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, 2 టౌన్ ఎస్.ఐ సైదా బాబు,ఆర్ఐ సంతోష్‌తో పాటు ఐటీ సెల్, బాంబ్ డిస్పోజల్ టీం, సైబర్ క్రైమ్, ఫింగర్ ప్రింట్స్, కమ్యూనికేషన్, డీసీఆర్‌బీ, స్పెషల్ బ్రాంచ్, డాగ్ స్క్వాడ్ విభాగాలకు చెందిన సంబంధిత అధికారులు, జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్.హెచ్.ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండలు, ఉక్కపోతపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: మొలుగు ఆనంద్ రావు

- వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి

కూకట్‌పల్లి, అక్టోబర్ 23 (ప్రజావాణి)హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో రానున్న రోజుల్లో పగటిపూట ఎండల తీవ్రత స్వల్పంగా కొనసాగడంతో పాటు ఉక్కపోత ఉండే అవకాశం ఉందని కూకట్‌పల్లి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు మొలుగు ఆనంద్ రావు తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశాలు తక్కువగా ఉండటంతో పొడి వాతావరణం నెలకొనే సూచనలు ఉన్నాయని ఆయన వివరించారు. ముఖ్యంగా తెలంగాణలోని తూర్పు, దక్షిణ జిల్లాల్లో ఎండల ప్రభావం కొంత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని మొలుగు ఆనంద్ రావు సూచించారు. పగటిపూట ఎండ తీవ్రంగా ఉన్న సమయంలో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, ఉక్కపోత నుంచి ఇబ్బందులు తలెత్తకుండా తగినంత నీరు తాగాలని తెలిపారు. వృద్ధులు, చిన్నారులు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసేవారు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి వాతావరణంలో చోటుచేసుకునే మార్పులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మొలుగు ఆనంద్ రావు పేర్కొన్నారు. భారత వాతావరణ శాఖ విడుదల చేసే తాజా సూచనలను అనుసరిస్తూ రోజువారీ కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించుకోవాలని సూచించారు.

దుబ్బాకను కరువు నియోజకవర్గంగా ప్రకటించాలి

- రైతులను ఆదుకోవాలి.. సాగునీరు అందించాలి: ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి డిమాండ్

ప్రజావాణి దుబ్బాకఒకప్పుడు టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో కరువు పరిస్థితులను ఎదుర్కొన్న దుబ్బాక నియోజకవర్గంలో మళ్లీ అవే దుస్థితులు పునరావృతమవుతున్నాయని, తక్షణమే దుబ్బాకను కరువు నియోజకవర్గంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దుబ్బాకలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టులతో పాటు కూడవెల్లి వాగు, ప్రధాన కాలువలు, ఉపకాలువల ద్వారా ఎండాకాలం, వానాకాలం అనే తేడా లేకుండా సాగునీరు అందేదని పేర్కొన్నారు. ప్రస్తుతం వానాకాలంలోనే పంటలు ఎండిపోతుండటం రైతుల దయనీయ పరిస్థితికి అద్దం పడుతోందన్నారు. పెరిగిన పెట్టుబడి ఖర్చులు, సక్రమంగా అందని విద్యుత్ సరఫరా, సాగునీటి కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రైతులు వలసలు వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

గోదావరి జలాలను వినియోగించుకోవాలి.

కన్నేపల్లి వద్ద గోదావరి నది ప్రవహిస్తున్నప్పటికీ, ఆ నీటిని ఎత్తిపోసి మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టులకు తరలించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు..ఫలితంగా కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టులు ఆశించిన స్థాయిలో రైతులకు ఉపయోగపడటం లేదన్నారు. రాజకీయాలు పక్కన పెట్టి రైతుల కోసం తక్షణమే గోదావరి జలాలను తరలించే చర్యలు చేపట్టి ప్రాజెక్టు లలో నీళ్లు నింపాలని కోరారు.. అలాగే ఇర్కొడు ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.మల్లన్నసాగర్ నీళ్లు రైతులకే ఇవ్వాలి.

తొగుట ప్రాంత రైతుల భూములు, గ్రామాలు ప్రాజెక్టుల నిర్మాణం కోసం త్యాగం చేశారని గుర్తుచేశారు. తమ భూములను, ఊళ్లను కోల్పోయిన రైతులకు సాగునీటి ప్రయోజనం అందాల్సిందేనని స్పష్టం చేశారు. మల్లన్నసాగర్ నీటిని స్థానిక నియోజకవర్గ రైతుల సాగు అవసరాలకు ప్రాధాన్యమిస్తూ విడుదల చేయాలని, హైదరాబాద్‌కు నీటిని తరలించే విషయంలో తమ ప్రాంత రైతుల ప్రయోజనాలను విస్మరించవద్దని హెచ్చరించారు.

గతంలో రైతుబంధు పథకం ద్వారా పెట్టుబడి సాయం అందేదని, రైతుబీమా ద్వారా రైతు కుటుంబాలకు భరోసా ఉండేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పథకాల ప్రయోజనాలు అందకపోవడంతో రైతులు, ముఖ్యంగా మరణించిన రైతుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు నిధులు విడుదల చేయడంతో పాటు రైతుబీమా ప్రయోజనాలను అర్హులైన కుటుంబాలకు అందించాలని కోరారు. నియోజకవర్గంలో అనేక రహదారులు అధ్వానంగా మారాయని, హామీలు అమలుకు నోచుకోక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. తక్షణమే రహదారులకు మరమ్మతులు చేపట్టి, గ్రామీణ ప్రాంతాల మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్ నీనో పరిస్థితుల నుండి రైతులను కాపాడాలని

కొత్త ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు.

కూకట్‌పల్లిలో నీటి సంక్షోభం ముప్పు.. ఇప్పటికైనా మేల్కొనాలి!

- భూగర్భ జలాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి
- ప్రజలకు విజ్ఞప్తి చేసిన మాజీ దేవస్థానం చైర్మన్ మొలుగు ఆనంద్ రావు

కూకట్‌పల్లి, అక్టోబర్ 23 (ప్రజావాణి):

కూకట్‌పల్లి ప్రాంతంలో భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటుతుండటంతో భవిష్యత్తులో తీవ్ర నీటి ఎద్దడి ఎదురయ్యే ప్రమాదం ఉందని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు మొలుగు ఆనంద్ రావు ప్రజలను అప్రమత్తం చేశారు. నీటి విలువను గుర్తించి ప్రతి ఒక్కరూ పొదుపుగా వినియోగించాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నగరంలో పెరుగుతున్న నీటి వినియోగం, భూగర్భ జలాల తగ్గుదల, వర్షపాతం తగ్గే అవకాశాలు నీటి సంక్షోభంపై ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో బోర్లపై ఆధారపడే కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకోవాల్సిన పరిస్థితులు పెరుగుతున్నాయని తెలిపారు. కూకట్‌పల్లి ప్రజలు ఇప్పటి నుంచే

అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నీటి వృథాను అరికట్టాలి

తాగునీటిని అవసరమైన మేరకే వినియోగించాలని, ఇంట్లో కుళాయిల నుంచి నీరు వృథాగా పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆనంద్ రావు కోరారు. వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇళ్లలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా భూగర్భ జలాల పెరుగుదలకు తోడ్పడాలని సూచించారు. భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే నీటి సంరక్షణ

ప్రభుత్వం, జలమండలి నీటి సరఫరా నిర్వహణతో పాటు ప్రజల్లో నీటి పొదుపుపై అవగాహన పెంచాలని ఆయన అభిప్రాయపడ్డారు. కాలనీల్లో నీటి వృథాను నివారించే చర్యలు చేపట్టాలని, వర్షపు నీటి సంరక్షణ కార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు.నీరు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన సంపద అని, దానిని నిర్లక్ష్యంగా వినియోగిస్తే రానున్న రోజుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని మొలుగు ఆనంద్ రావు హెచ్చరించారు. ప్రతి ఇంటి నుంచి నీటి పొదుపు ప్రారంభమైతేనే కూకట్‌పల్లిలో నీటి సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు

ఎల్కతుర్తి మండలంలో దేవాలయాలే లక్ష్యంగా చోరీలు!

- పూజా గంటలు, నిత్య పూజా సామగ్రి అపహరణ.. నిందితుల ఆచూకీ ఏదీ?
- ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చిన వారిపై నిఘా పెట్టాలంటున్న స్థానికులు.

ఎల్కతుర్తి ప్రజావాణి న్యూస్:-

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో దేవాలయాల్లో వరుసగా చోటుచేసుకుంటున్న చోరీ ఘటనలు స్థానికంగా ఆందోళన కలిగిస్తున్నాయి.మండల కేంద్రంలోని ఓ దేవాలయంతో పాటు సూరారం గ్రామంలోని గుడిబండపల్లె దేవాలయంలోనూ గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడినట్లు గ్రామస్తుల ద్వారా తెలిసింది.రాత్రి వేళల్లో దేవాలయాల్లోకి ప్రవేశించిన దుండగులు పూజా గంటలు, నిత్య పూజలకు ఉపయోగించే సామగ్రిని అపహరించినట్లు సమాచారం. ఈ ఘటనలకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.దేవాలయాల్లో ప్రతిరోజూ భక్తిశ్రద్ధలతో నిర్వహించే నిత్య పూజలకు అవసరమైన సామగ్రి చోరీకి గురవుతుండటంతో భక్తులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాలయాల్లోకి చొరబడి పూజా సామగ్రిని అపహరించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వరుస ఘటనలు జరుగుతున్నా ఆలయాల భద్రతకు పటిష్టమైన చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

గతంలోనూ పలు ఆలయాల్లో చోరీలు

ఎల్కతుర్తి మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లోని పలు దేవాలయాల్లో గతంలోనూ చోరీ ఘటనలు చోటుచేసుకున్నాయని స్థానికులు చెబుతున్నారు.ఆలయాల్లో తరచూ చోరీలు జరుగుతున్నప్పటికీ నిందితులను గుర్తించి, ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట వేయడంలో మరింత సమర్థవంతమైన చర్యలు

తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. దేవాలయాల్లోని గంటలు, పూజా సామగ్రి వంటి వస్తువులు సైతం భద్రంగా లేని పరిస్థితి నెలకొంటే ప్రజల ఆస్తులకు రక్షణ ఎలా ఉంటుందనే ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి.రాత్రి వేళల్లో సరైన నిఘా లేకపోవడం,ఆలయాల వద్ద భద్రతా ఏర్పాట్లు కొరవడటం చోరీలకు అవకాశమిస్తోందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గ్రానైట్ కంపెనీలు,జాతీయ రహదారి ప్రాంతాల్లో నిఘా పెంచాలి

ఎల్కతుర్తి మండల పరిసర ప్రాంతాల్లో గ్రానైట్ కంపెనీలు, జాతీయ రహదారి ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి పలువురు ఉపాధి కోసం ఇక్కడికి వచ్చి నివాసం ఉంటున్నారు.మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అద్దె ఇళ్లలో నివసిస్తున్న వారి వివరాలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, చట్టబద్ధమైన పరిధిలో తగిన నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.బయటి ప్రాంతాల నుంచి ఉపాధి కోసం వచ్చిన వారిలో ఎవరైనా చోరీలకు పాల్పడుతున్నారా అనే అనుమానాలు కొందరు గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నప్పటికీ, తాజా ఘటనల్లో నిందితులు ఎవరనేది ఇంకా నిర్ధారణ కాలేదు. కేవలం ఇతర ప్రాంతాల నుంచి వచ్చి నివసిస్తున్నారనే కారణంతో ఎవరినీ అనుమానితులుగా చూడకుండా, ఆధారాల ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.గ్రానైట్ కంపెనీల పరిసర ప్రాంతాలు, జాతీయ రహదారి వెంబడి ఉన్న నివాస ప్రాంతాలు, అద్దె ఇళ్ల వివరాలపై సంబంధిత అధికారులు సమన్వయంతో దృష్టి సారించాలని కోరుతున్నారు.అనుమానాస్పద కదలికలు కనిపించినప్పుడు ప్రజలు పోలీసులకు సమాచారం అందించేలా అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు.

పోలీసుల గస్తీ పెంచాలని విజ్ఞప్తి

మండలంలో వరుసగా జరుగుతున్న దేవాలయ చోరీలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో జరిగిన చోరీ ఘటనల వివరాలను పరిశీలించి, ప్రస్తుత ఘటనలతో ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో విచారణ జరపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ పెంచడంతో పాటు, దేవాలయాలు, ప్రధాన కూడళ్లు,జాతీయ రహదారి పరిసర ప్రాంతాల్లో నిఘా బలోపేతం చేయాలని కోరుతున్నారు.అలాగే దేవాలయాల నిర్వాహకులు అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు విలువైన పూజా సామగ్రిని భద్రపరిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. గ్రామాల్లో ప్రజలు, ఆలయ కమిటీలు, పోలీసులు సమన్వయంతో పనిచేస్తే ఇటువంటి ఘటనలను అరికట్టేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దేవాలయాల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, చోరీ ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను గుర్తించాలని ఎల్కతుర్తి మండల ప్రజలు కోరుతున్నారు. తాజా ఘటనలకు సంబంధించి పోలీసుల అధికారిక ప్రకటన,పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది.

పండుగ సందడి.. మంత్రి దామోదర్ రాజనర్సింహాకు శుభాకాంక్షల వెల్లువ

ప్రజా వాణి న్యూస్ అక్టోబర్ 23 సంగారెడ్డి జిల్లాతెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే విజయదశమి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో ఆందోల్ నియోజకవర్గ స్థాయి అలయ్ బలయ్ కార్యక్రమాన్ని చౌటకూరు మండలం తాడ్దాన్‌పల్లిలోని ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి మంత్రి దామోదర్ రాజనర్సింహకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆందోల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో సుమారు రూ.3 వేల కోట్లకు పైగా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నాయకులు, కార్యకర్తలకు వివరించారు. రహదారుల నిర్మాణం, ఆసుపత్రుల అభివృద్ధి, నర్సింగ్ కళాశాల, వసతి గృహాలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్

పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల అభివృద్ధితో పాటు వివిధ విద్యాసంస్థల్లో సీఎస్ఆర్ నిధులతో కంప్యూటర్ ల్యాబ్‌లు, బస్సులు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. సంక్షేమ వసతి గృహాలు, పాఠశాల భవనాలు, అదనపు తరగతి గదుల నిర్మాణం, ఆందోల్‌లో క్రీడా మైదానం అభివృద్ధి, గిరిజన న్యాయ కళాశాల నిర్మాణం వంటి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. జోగిపేట--ఆందోల్ పట్టణాలను అనుసంధానించే వంతెనల నిర్మాణం, సింగూరు ప్రాజెక్టు వెనుక జలాల పరిసర ప్రాంతాల్లో అంతర్గత రహదారుల అభివృద్ధి, రవాణా సౌకర్యాల మెరుగుదల, పర్యాటక రంగ అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లోల చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య పీసీసీ ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్, పీసీసీ సభ్యుడు కిషన్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్ మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు. అయిపోయింది సుధాకర్ రెడ్డి ఆందోల్--జోగిపేట మున్సిపాలిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ చైర్మన్ సురేందర్ గౌడ్, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కేదార్నాథ్ పటేల్, ఆత్మ కమిటీ చైర్మన్లు, కంచరావ్, సర్పంచులు, కౌన్సిలర్లు, సేవాదళ్, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, కార్మిక సంఘాలు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, సహకార సంఘాల మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని అలయ్ బలయ్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

అధ్యాపకుల భావోద్వేగ ప్రజ్ఞ, ఒత్తిడి నిర్వహణపై వాణి గాయత్రి అధ్యయనానికి గాను ఎంజియు పిహెచ్ డి ...

నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణిపరిశోధనపై ఆసక్తితో ఉన్నత విద్యలో ముందడుగు వేశారు రుద్ర వాణి గాయత్రి. నల్లగొండ జిల్లా చండూరుకు చెందిన ఆమె మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. సూరం శ్వేత పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 'తెలంగాణ రాష్ట్రంలోని ఎంపిక చేసిన ఉన్నత విద్యాసంస్థల ఉద్యోగుల భావోద్వేగ ప్రజ్ఞ, ఒత్తిడి నిర్వహణ పద్ధతులు' అనే అంశంపై పరిశోధన చేసి తన థెసిస్ ను సమర్పించారు.అధ్యాపకుల భావోద్వేగ ప్రజ్ఞ, ఒత్తిడి నిర్వహణ పద్ధతులు, వారు అనుభవిస్తున్న ఒత్తిడి మధ్య సంబంధాలను ఈ అధ్యయనంలో పరిశీలించారు. అధ్యాపకుల్లో భావోద్వేగ ప్రజ్ఞ మధ్యస్థాయిలో ఉన్నట్లు గుర్తించారు. ఒత్తిడిని ఎదుర్కొనేందుకు వారు పరిస్థితులకు అనుగుణంగా సానుకూల పద్ధతులను అనుసరిస్తున్నట్లు వెల్లడైంది. భావోద్వేగ ప్రజ్ఞకు, ఒత్తిడి

నిర్వహణ పద్ధతులకు మధ్య సంబంధం ఉన్నట్లు అధ్యయనంలో తేలింది. అధ్యాపకులు ఎదుర్కొంటున్న ఒత్తిడిని విద్యాసంస్థలు గుర్తించి, వారి శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇవ్వాలని పరిశోధన సూచించింది. సంస్థాగత సహకారంతోపాటు మానసిక మద్దతు అందించాల్సిన అవసరాన్ని వివరించింది. ఈ పరిశోధన ఆధారంగా రూపొందించిన ఆరు పరిశోధనా పత్రాలు ప్రతిష్టాత్మకమైన స్కోపస్, వెబ్ ఆఫ్ సైన్స్‌లో సూచీకరించిన వివిధ జర్నళ్లలో ప్రచురితమయ్యాయి. పరిశోధన కోసం ఆమెకు భారతీయ సామాజిక శాస్త్ర పరిశోధన మండలి (ఐసీఎస్ఎస్ఆర్) డాక్టోరల్ ఫెలోషిప్ లభించింది.

భువనగిరి, నల్లగొండల్లో పాఠశాల విద్యను అభ్యసించిన వాణి గాయత్రి మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో ఎంబీఏ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆమె తల్లి రుద్ర పద్మావతి, తండ్రి రుద్ర వెంకటేశం దేవాదాయ శాఖలో కార్యనిర్వహణాధికారిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఉప కులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్, మేనేజ్మెంట్ విభాగ అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

ముదిరాజులను బిసి- డి నుండి బీసీ-ఏ లోకి మార్చి - నీలం మధు కి ఎం ఎల్ సి పదవి ఇవ్వాలి

నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి చండూర్ పట్టణంలో, జిల్లా ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ముదిరాజులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టి ఎంపిఎస్ జిల్లా అధ్యక్షులు కొర్వి శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ,బీసి లలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్ జాతి 70 ఏళ్లుగా విద్యా,ఉద్యోగ రంగాలలో ఎంతో నష్టపోయామని, ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా రాజకీయంగా జనాభాకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని, ఇప్పటికైనా అధికార కాంగ్రెస్ ప్రభుత్వం,ఎన్నికల ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ముఖ్యమైన హామీ బిసి- డి నుండి బీసీ-ఏ వెంటనే అమలు చేయాలని, వచ్చే నెల నవంబర్ లో భర్తీ చేస్తున్న 3 ఎం ఎల్ సి స్తానాలలో , నీలం మధు కి ఎం.ఎల్.సి ఇచ్చి ముదిరాజులకు సముచిత స్థానం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బి సి- ఏ సాధన కొరకు త్వరలోనే వేలాది మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్ లు పర్సనబోయిన వెంకటేశం ముదిరాజ్ ,బీసు అరుణ శ్రీశైలం ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ పులకరం వెంకన్న ముదిరాజ్ , మత్స్యశాఖ చైర్మన్ బొమ్మరబోయిన భార్గవ్ ముదిరాజ్ , డైరెక్టర్ పర్సనబోయిన సైదులు ముదిరాజ్, వివిధ ముదిరాజ్ సంఘాల నాయకులు దొంతరబోయిన శివ, సింగం కృష్ణ, జిల్లా రవి, పర్సనబోయిన రాంబాబు, జిల్లా శేఖర్, బొమ్మకంటి లింగస్వామి, కొర్వి సురేష్, కట్ట హరిబాబు, మండలి స్వామి, కొర్వి చంటి, జీనూకల రాము, జీనుకల చక్రవర్తి, బీసు శివ, బీసు శ్రీశైలం, బీసు అంజి,జీనుకల శ్రవణ్,జీనుకల ప్రవీణ్, తాళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు..

మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు అబద్ధాల ప్రచారాన్ని నమ్మకండి

- బొడ్డపాడు రైతులు వద్ద కొనుగోలు చేసిన భూములకు పది పర్సంటేజ్ కమీషన్ అవినీతి పై దర్యాప్తు జరుగుతుంది.
- కాశీబుగ్గ రైల్వే వంతెన పను లను పూర్తి చేసిన ఘనత కూటమి సర్కారు కే దక్కుతుంది..
- రెండేళ్లలో కోట్లాది రూపా యల అభివృద్ధి చేశాము.
- పలాస మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థి వజ్జ గంగా భవానీ ను గెలిపిస్తే అబివృద్ధి జరుగుతుంది.
- పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస ప్రజావాణి ప్రతినిధి పలాస మున్సిపాలిటిను రెండేళ్ల లో ఎంతో అభివృద్ధి చేశామనిపలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శుక్రవారం సాయంకాలము తెలుగు దేశము పార్టీ కార్యాలయము లో ఆమె మాట్లాడుతూ మాజీ మంత్రి అప్పలరాజు గత ప్రభుత్వ హయాంలో అవినీతి అక్రమాలు లూటీలు కబ్జాలు హింస ఇవి తప్పితే ఏమి అభివృద్ధి చేశారనీ విమర్శలు చేశారు.. ప్రధానంగా రహదారులు మీ హయాంలో గ్రామీణ రహదారులు నరక కూపాలుగా మార్చిన మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు దేనని అన్నారు. కూటమి వచ్చిన తర్వాత పల్లె పండుగ పేరుతో పెద్ద ఎత్తున ఉపాధి హామీ నిధులు తీసుకొచ్చి ప్రతి ఒక్క మారుమూల గ్రామాలకు సైతం తారు రోడ్లు సిమెంట్ రోడ్లు వేయడం జరిగింది. అలాగే గతంలో ఏనాడు లేని విధంగా హమ్ పథకం సుడానిధులు ఎంపీ నిధులతో ప్రతి వార్డులో సీసీ రోడ్లు డ్రైన్లు నిర్మాణము చేపట్టడం జరిగిందనీ తెలిపారు.వైద్యం కోసం మీరు చేసింది శూన్యం కిడ్నీ హాస్పిటల్ భావన నిర్మాణం తప్పితే దానికి అవసరమైన ఏ విధమైన వసతులు కూడా మీరు సమకూర్చలేదు, మంత్రిగా ఉండి అక్కడ పనిచేసిన ఉద్యోగులకు జీతాలు ఇప్పించ లేకపోయినా ఆనాడు మా ప్రభుత్వం ఇచ్చిన యూనిట్లు తప్పించి ఒక్క దయాలసిస్ యూనిట్లు కూడా నువ్వు ఏర్పాటు చేయలేక పోయావు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్యోగులకు జీతాలు ఇప్పించడంతోపాటు దయాలసిస్ యూనిట్లను అదనంగా తీసుకొచ్చి తొమ్మిది కోట్ల రూపాయల ప్రత్యేక నిధులతో కిడ్నీ హాస్పిటల్ కు అన్ని వసతులు సమకూర్చాము ఈరోజు కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు కూడా ఇక్కడ జరుగుతున్నాయి అంటే మా ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం మని గుర్తు చేశారు. విద్యారంగమని పెద్దగా చెప్పుకుంటున్నా కాశిబుగ్గ హై స్కూల్ కు కేంద్ర ప్రభుత్వ పీఎం శ్రీ పథకం కింద ఆ స్కూలు ఎంపికయి ప్రత్యేక నిధులు రావడం జరిగిందే తప్పితే నువ్వు చేసింది శూన్యం, అలాగే పలాస ప్రభుత్వ హై స్కూలుకు మా ప్రభుత్వం లోకేష్ బాబు గారు ప్రత్యేక కృషితో లీపు పథకంలో చేర్చడం జరిగింది.2014బి 19 మధ్యన లో పూండిప్రభుత్వ జూనియర్ కళాశాల అక్కుపల్లి బాలుర రెసిడెన్షియల్ స్కూలు పలాసలో బాలికల రెసిడెన్షియల్ స్కూలు ప్రభుత్వ డిగ్రీస్ కళాశాలకు అన్ని అనుమతులు ఆనాడే శివాజీ ఎమ్మెల్యేగా ఉండగా సాధించడం జరిగింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సహకారంతో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక విద్యాసంస్థల కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేయించి ప్రారంభించడం జరిగింది త్వరలోనే శాశ్వత భవనాలు నిర్మాణం చేపట్టబోతున్నాం ఇది మేము విద్యారంగానికి చేసిన కృషనీ. ఎమ్మెల్యే అన్నారు. కేటి రోడ్డు విస్తరణ పనులు చాలా గొప్పలు చెబుతున్నావు ప్రభుత్వంలో మంత్రిగా ఉండి రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రత్యేకంగా ఒక రూపాయి నిధులు ఈ మున్సిపాలిటీ తేలేకపోయావు మున్సిపాలిటీ ప్రజలు కట్టిన పన్నుల నుండి జమైన మున్సిపల్ సాధారణ నిధుల నుండి పనులు చేపించి నేటికీ బిల్లులు చెల్లించని ఆ సమర్ధ పాలకుడను నీవు నాలుగేళ్లు మంత్రిగా ఉండి ఇందిరా చౌక్ వద్ద ఆంధ్ర బ్యాంకు వద్ద మూడు రోడ్ల జంక్షన్ వద్ద గోతులు కప్ప లేక పోయావు. మేము వచ్చిన తర్వాత అవన్నీ కూడా పూర్తి చేసి ప్రజలకి సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం జరిగింది కేటి రోడ్డు విస్తరణ పనుల్లో అనేక అక్రమాలకు పాల్పడి అడుగు స్థలానికి లక్ష రూపాయలు చొప్పున వసూలు చేసి జేబులు నింపుకున్న సాంస్కృతి మీది కదా అని గుర్తు చేశారు.ముత్యాలమ్మ కోనేరు గురించి గొప్పలు చెబుతున్నావు మున్సిపాలిటీ నిధుల నుండి 70 లక్షలు కోనేరు అభివృద్ధికి కేటాయించి ఏళ్ళు గడిచిన పని పూర్తి కాలేదు గుత్తేదారు మధ్యలోనే చేతులెత్తేశాడు మేము అధికారంలోకి వచ్చిన తర్వాత వాకర్ల విన్నపం మేరకు విద్యుత్తు లైట్లు మరియు జిమ్ము ఏర్పాటు చేశానని తెలిపారు ఆర్ఓబి గురించి ప్రగల్బాల్ పలుకుతున్నావ్ చెల్లికి మళ్లీ పెళ్లి అన్నట్లుగా మరో శిలాఫలకం వేసావ్. ఏం సాధించావు ఎందుకు పూర్తి చేయలేకపోయావు ప్రజలకు సమాధానం చెప్పు మేము అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్న ఇబ్బందులన్నీ తొలగించి నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి బకాయిలు తీర్చి పూర్తి చేయడానికి అవసరమైన నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి రాబట్టి కాంట్రాక్టర్కు పూర్తిస్థాయి బిల్లులు చెల్లించి నిర్ణీత సమయంలో పూర్తిచేసి ప్రజలకు అంకితం చేయడం జరిగింది.నీ చెప్పారు. పలాస మున్సిపాలిటీ లో జరుగుతున్న ఎన్నికల్లో కూటమి సర్కారు అభ్యర్థి వజ్జ బాబురావు భార్య గంగాభవాని ను అలాగే తెలుగుదేశం , జనసేన, బిజెపి లకు చెందిన అభ్యర్థులను గెలిపించాలని ఆమె కోరారు.. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థి వజ్జ గంగా భవానీ,ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు , లొడగల కామేశ్వర రావు, బడ్డ నాగరాజు, మల్లా శ్రీనివాస్, వై. మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు..

ఆంగ్ల నైపుణ్యంతో మెరుగైన అవకాశాలు..

- 'ఇంగ్లీష్ ఫర్ ఎఫెక్టివ్ ఎక్స్‌ప్రెషన్' పాఠ్యపుస్తకాన్ని ఆవిష్కరించిన ఎం జి యు ఉపకులపతి

ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థుల కోసం రూపొందించిన 'ఇంగ్లీష్ ఫర్ ఎఫెక్టివ్ ఎక్స్‌ప్రెషన్' పాఠ్యపుస్తకాన్ని శుక్రవారం తన కార్యాలయంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అంజిరెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆంగ్లాన్ని కేవలం పాఠ్యాంశంగానే కాకుండా, విద్యా--ఉద్యోగ అవకాశాలను అందుకునేందుకు ఉపయోగపడే నైపుణ్యంగా అభ్యసించాలని సూచించారు. సాహిత్యం విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలు, నైతికత, పెంపొందిస్తుందని పేర్కొన్నారు. పాఠ్యపుస్తక రూపకల్పనలో కృషి చేసిన సంపాదకులు, రచయితలు, సహకరించిన బృందాన్ని అభినందించారు.ఈ పాఠ్యపుస్తకానికి డాక్టర్ కె. అరుణప్రియ, ప్రొఫెసర్ బి. విజయ సంపాదకులుగా వ్యవహరించారు. డాక్టర్ రాహత్ ఖానం, బి. లీలారాణి, లెఫ్టినెంట్ సీహెచ్. సుధాకర్ రచయితలుగా సహకరించారు.

బీరంగూడలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు.. 10 మంది పట్టివేత!

- ఆర్‌సీపురం ట్రాఫిక్ సీఐ విద్యాసాగర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు
- మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

అమీన్పూర్, అక్టోబర్ 23 (ప్రజావాణి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. బీరంగూడలోని శివాలయం చౌరస్తా వద్ద ఆర్‌సీ పురం ట్రాఫిక్ సీఐ విద్యాసాగర్ రెడ్డి ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించగా, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 10 మందిని గుర్తించినట్లు సీఐ విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిరంతరం కొనసాగిస్తామని సీఐ విద్యాసాగర్ రెడ్డి తెలిపారు.

కూటమి సర్కారు మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదు..

- దీపము పథకం హామీ గాలిలో లెక్కలు చెబుతున్నారు..
- నిరుద్యోగ భృతి ఎప్పుడూ ఇస్తారు..
- మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు

పలాస ప్రజావాణి ప్రతినిధి కూటమి సర్కారు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు అన్నారు.. మహిళలకు నెలకు 15 వందలు రూపాయిలు పథకము అమలు జరగడం లేదు అలాగే నిరుద్యగ యువతకు ఇస్తామన్న నిరుద్యోగ భృతి ఇచ్చిన హామీ అమలు చేయలేదని కూటమి సర్కారు పై మండిపడ్డారు మాజీ మంత్రి అప్పలరాజు. ఈ మేరకు మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారం లో పాల్గొనీ ప్రజలతో మాట్లాడారు36వ వార్డులో ఫ్యాన్ జోరు.. బెవర లక్ష్మి గెలుపే లక్ష్యం!

మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుతో వైసీపీ శ్రేణుల విస్తృత ప్రచారం

కూటమి హామీలపై నిలదీసిన అప్పలరాజు.. ఓటుతో తగిన తీర్పు చెప్పాలని పిలుపు

పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. 36వ వార్డులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి బెవర లక్ష్మి గెలుపే లక్ష్యంగా మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు విస్తృత ప్రచారం నిర్వహించారు. హరిజన వీధి, సీతారామ నగర్,వాసుదేవపేట,కౌసల్యనగర్ నగర్ ప్రాంతాల్లో ఓటర్లను కలుసుకుంటూ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా వైసీపీ శ్రేణులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ప్రచారంలో సందడి నెలకొంది.

36వ వార్డు నుంచే నా తొలి ప్రచారం..

36వ వార్డులోనే తన మొదటి ప్రచారాన్ని ప్రారంభించినట్లు డాక్టర్ సీదిరి అప్పలరాజు పేర్కొన్నారు. వార్డు అభ్యర్థి బెవర లక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యలు, స్థానిక అవసరాలపై దృష్టి సారిస్తూ పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైసీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

హామీల అమలుపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీసిన అప్పలరాజు

ప్రచారంలో భాగంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై మాజీ మంత్రి ప్రశ్నలు సంధించారు. ప్రతి మహిళకు నెలకు రూ. 1,500 ఇస్తామని చెప్పారని, గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేస్తూ.. ఈ పథకాల ద్వారా ఎంతమందికి లబ్ధి చేకూరిందని ప్రశ్నించారు. కొత్త పెన్షన్లు, కొత్త రేషన్ కార్డుల మంజూరుపైనా ప్రభుత్వాన్ని నిలదీశారు.కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. ప్రజలకు తమ అసంతృప్తిని తెలియజేసేందుకు ఎన్నికలు సరైన అవకాశమని, ఓటు హక్కును వినియోగించుకుని తగిన తీర్పు చెప్పాలని కోరారు.

శ్రీపద్మతో పాటు 36 వార్డుల్లో వైసీపీ అభ్యర్థులకు మద్దతివ్వండి

పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ అభ్యర్థి తాళాసు శ్రీపద్మతో పాటు 36 వార్డుల్లో వైసీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని డాక్టర్ అప్పలరాజు ఓటర్లను అభ్యర్థించారు. బెవర లక్ష్మి విజయమే లక్ష్యంగా 36వ వార్డులో ఇంటింటి ప్రచారాన్ని మరింత విస్తృతం చేస్తామని పార్టీ నాయకులు తెలిపారు.మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రచారంతో 36వ వార్డులో వైసీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. మహిళలు, యువత, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థి బెవర లక్ష్మి విజయానికి కృషి చేశారు.

రాఘవరెడ్డిపేట పంచాయతీ పాలకవర్గానికి ఎమ్మార్పీఎస్ సన్మానం ఘన సన్మానం

- ప్రజలందరి సమిష్టి భాగస్వామ్యంతో పండుగలను సమర్ధవంతంగా నిర్వహించినందుకు అభినందనలు..!!

టేకుమట్ల/అక్టోబర్23:టేకుమట్ల మండలం రాఘవరెడ్డిపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ వంగ మమత శ్రీధర్ మరియు వార్డు సభ్యులు పాలకవర్గం సిబ్బంది మరియు పారిశుద్ధ కార్మికుల ప్రోత్సాహంతో దసరా సద్దుల బతుకమ్మ ఉత్సవాలు దిగ్విజయంగా నిర్వహించారు. గ్రామ ప్రజలందరూ సంతోషంగా ఏ గొడవలు లేకుండా పండుగ జరుపుకున్నారు.ఇలా మన గ్రామంలో చారిత్రాత్మకమైన అతిపెద్ద పండుగను ప్రజలందరి సమన్వయంతో గ్రాండ్ సక్సెస్ చేసిన సందర్భంగా ఈరోజు ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పాలకవర్గానికి చిరు సన్మానం చేయడం జరిగింది.ఈ సందర్భంగా MRPS నాయకుడు దూడపాక శ్రీనివాస్ మాట్లాడుతూ.ఎలాంటి ఘర్షణ వాతావరణం లేకుండా గ్రామంలో అట్టహాసంగా పండుగలను నిర్వహించిన గ్రామ పాలక మండలిని అభినందించారు. పండుగల నిర్వహణతో పాటు ప్రజలందరి భాగస్వామ్యంతో గ్రామ సమగ్ర అభివృద్ధి కోసం కూడా ఐక్యతతో ముందుకు సాగాలని దానికోసం అందరం కలిసికట్టుగా శ్రమించాలని కోరారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గం మరియు కార్యదర్శి, గుడి కమిటీ చైర్మన్ గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ

పూతలపట్టు, అక్టోబర్ 23: చిత్తూరు జిల్లాలోని తవణంపల్లి, బంగారుపాళ్యం మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా నామినేషన్ల ప్రక్రియ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించాలని ఎస్పీ రిటర్నింగ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను పటిష్టంగా అమలు చేయాలని, శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

వైసిపి అభ్యర్థులకు మద్దతు ఇవ్వండి

● వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, మైనార్టీ నేత వసీం సలీం

అనంత పురం అక్టోబర్ 23 ప్రజా వాణి అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పాతూరులో గల 'జంగాల పల్లి మసీదు' సమీపంలో వైయస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ మేయర్ వసీం లు మైనార్టీ ముఖ్య నాయకులు లతో కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైయస్సార్ సీపీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్, కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాల్సినదిగా అభ్యర్థించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి హయాంలో ముస్లిం మైనార్టీలకు జరిగిన మేలును వివరించారు. అనంతపురం నగరాన్ని మళ్లీ అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలంటే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు.

పెనుమూరు మండలంలో 89 ఎంపీటీసీ నామినేషన్లు

● 12 ఎంపీటీసీ స్థానాలకు 61 మంది అభ్యర్థులు పోటీ

జీడి నెల్లూరు ప్రజావాణి ప్రతినిధి అక్టోబర్ 23 పెనుమూరు మండలంలో ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి మొత్తం 12 స్థానాలకు 61 మంది అభ్యర్థులు 89 నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన రాజకీయ పార్టీల నుంచి అభ్యర్థులు నామినేషన్లు సమర్పించడంతో మండలంలో ఎన్నికల సందడి నెలకొంది. పార్టీల వారీగా నామినేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి. తెలుగుదేశం పార్టీ నుంచి 27 మంది అభ్యర్థులు 35 నామినేషన్లు దాఖలు చేయగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 27 మంది అభ్యర్థులు 42 నామినేషన్లు సమర్పించారు. జనసేన పార్టీ నుంచి ఐదుగురు అభ్యర్థులు ఏడు నామినేషన్లు వేశారు. భారతీయ జనతా పార్టీ నుంచి ఒక అభ్యర్థి రెండు ఎంపీటీసీ స్థానాలకు రెండు నామినేషన్లు దాఖలు చేశారు. బీసీవై పార్టీ నుంచి ఒక అభ్యర్థి ఒకే స్థానానికి మూడు నామినేషన్లు సమర్పించారు. మొత్తంగా పెనుమూరు మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలకు 61 మంది అభ్యర్థులు 89 నామినేషన్లు దాఖలు చేయడంతో స్థానిక రాజకీయాల్లో ఎన్నికల వేడి పెరిగింది. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ అనంతరం బరిలో నిలిచే అభ్యర్థులపై స్పష్టత రానుంది.

జిల్లాస్థాయి క్విజ్ పోటీల విజేత .. తాళ్ల భద్ర

పలాస ప్రజావాణి ప్రతినిధి వజ్రపు కొత్తూరు మండలం డోకులపాడు గ్రామంలో శ్రీ గంగాధర సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో 40 టీములు పాల్గొనడం జరిగింది. ఇందులో పలాస జడ్పీహెచ్ఎస్ తాళభద్ర విద్యార్థులు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే గోపికృష్ణ మాట్లాడుతూ క్విజ్ పోటీలు పిల్లల్లో సృజనాత్మకత పోటీ పరీక్షల్లో పాల్గొనడం ద్వారా రాబోయే పోటీ పరీక్షల్లో ఎలా సంసిద్ధత అవ్వాలని? తెలియజేస్తుందని అన్నారు. పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణ సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు కే మాధవి లత ,ఎం విద్యాసాగర్ టీ. జయ, కె శ్రీదేవి, నగిరి లక్ష్మి పి లోకనాథం ,ఎం హేమావతి, ఎం సాహిత్య, కే వేదవతి, జె .శంకర్రావు ,ఆర్ ధనలక్ష్మి తదితరులు పాల్గొని అభినందించారు.

ఉదయం వాక్‌లో ప్రజలతో మాట్లాడిన రమేష్ గౌడ్

● నగరంలోని హౌసింగ్ బోర్డ్ చిల్డ్రన్స్ పార్క్‌లో వాకర్స్ తో మాటా మంతి
● వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్

అనంతపురం బ్యూరో అక్టోబర్ 23 ప్రజా వాణి అనంతపురం నగరంలోని హౌసింగ్ బోర్డ్ లో ఉన్న చిల్డ్రన్స్ పార్క్‌లో ఉదయాన్నే మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి సి. రమేష్ గౌడ్ పార్క్‌కు వచ్చి, అక్కడ ఉదయం నడకకు వచ్చిన సీనియర్ సిటిజన్లు, మార్నింగ్ వాకర్లతో స్నేహపూర్వకంగా మాట్లాడారు. వైసీపీ అనంతపురం మేయర్ అభ్యర్థిగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. అనంతపురం నగరాభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి వైసీపీ అభ్యర్థులకు అండగా నిలవాలని రమేష్ గౌడ్ కోరారు. మేయర్‌గా గెలిస్తే ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, నగర సమస్యలపై ప్రాధాన్యతతో పనిచేస్తానని ఆయన తెలిపారు. పార్క్‌లో వాకింగ్ చేస్తున్న పెద్దలు, యువకులు, స్థానికులతో మాట్లాడే అవకాశం దొరకడం సంతోషంగా ఉందని అన్నారు. నగరంలో మౌలిక సదుపాయాలు, పార్కుల అభివృద్ధి, పరిశుభ్రత, తాగునీరు, రోడ్లు వంటి అంశాలపై ప్రజలు వెల్లడించిన అభిప్రాయాలకు విలువిస్తానని ఆయన చెప్పారు. అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల్లో వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్‌కు, అలాగే 62 డివిజన్లలో పోటీ చేస్తున్న వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని ఆయన ఓటర్లను కోరారు. వైసీపీ అభ్యర్థులు గెలిస్తే నగర అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా సాగుతాయని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. రమేష్ గౌడ్ ప్రజలతో నేరుగా మాట్లాడే శైలికి స్పందిస్తూ, సీనియర్ సిటిజన్లు నగర సమస్యలపై తమ సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు, మార్నింగ్ వాకర్లు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.నరేష్

పలాస ప్రజావాణి ప్రతినిధి పలాస నియోజకవర్గంలో నియోజక వర్గంలోనీ పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ . రమేష్ పరిశీన.చేశారు.
ఈ మేరకు వెంకటాపురం, రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి తనిఖీ చేసిన శ్రీకాకుళం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి :డాక్టర్ బి నరేష్
పలాస మండలం వెంకటాపురం రెంటి కోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డ్రై డే.. ఫ్రైడే.. కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు . ఈ సందర్భంగా డి ఎం అండి హెచ్ డాక్టర్ బి నరేష్ మాట్లాడుతూ... ప్రభుత్వం నిర్దేశించిన వైద్యారోగ్య శాఖ కార్యక్రమాలు ప్రజలకు నేరుగా చేరాలని సిబ్బందినీ తెలియజేశారు. మాత శిశు సంరక్షణ కార్యక్రమాలు 100% టార్గెట్ ను అందరూ చేరుకోవాలని మెడికల్ ఆఫీసర్లను మరియు సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు

సంతృప్తికరమైన సేవలు అందించాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి సునీల్ కుమార్ డాక్టర్ దేవి డాక్టర్ సంపత్ కుమార్ జిల్లా అధికారి వెంకట్రావు సిహెచ్ ఆదమ్మ పి

హెచ్ ఎన్ లలితాంబిక హెల్త్ విజిటర్ బి పద్మ ఫార్మసీ ఆఫీసర్ బోనేల గోపాల్ ,లీలావతి,యూ డి సి గిరిశంకర్ ,వై పద్మావతి, మేరీ బాయ్,సరస్వతి రాజేశ్వరి,సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభి అభివృద్ధి కోసం పోటీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నా..

● జెడ్పీ టీసీ అభ్యర్థి బమ్మిడి దుర్యోధన రావు

పలాస ప్రజావాణి ప్రతినిధి మాజీ ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి స్ఫూర్తితో, మాజీ మంత్రి అప్పలరాజు ఆశీస్సులతో పలాస అభివృద్ధే లక్ష్యము. కోసము పోటీ చేస్తున్నాను
ప్రజలే నా బలం – ప్రజాసేవే నా ధ్యేయం – వైసీపీ జెడ్పీటీసీ అభ్యర్థి బి.డి.రావు..
పలాస ప్రజావాణి ప్రతినిధ
పలాస మండల ప్రజలందరికీ తన హృదయపూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెడ్పీటీసీ అభ్యర్థి బమ్మిడి దుర్యోధన రావు (బి.డి.రావు) పేర్కొన్నారు. శనివారమిం ఆయన పలాసలో తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన రాజకీయ ఆశయాలను, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు.
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్ఫూర్తితో, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆశీస్సులతో పలాస మండల అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం తన వంతు కృషి చేయాలనే దృఢ సంకల్పంతో మీ ముందుకు వస్తున్నానని ఆయన తెలిపారు.
తాను రాజకీయాల్లోకి పదవి కోసం రాలేదని, ప్రజల కోసం వచ్చానని, రాజకీయాల కోసం కాదు ప్రజాసేవ కోసం వచ్చానని స్పష్టం చేశారు. మాటలతో కాదు చేతలతో ప్రజలకు అండగా

నిలవాలన్న సంకల్పంతోనే ఈ ఎన్నికల బరిలో నిలిచానని అన్నారు. పలాస మండలంలో పుట్టి పెరిగిన వ్యక్తిగా ప్రజల సమస్యలు ఏమిటో, ప్రజల ఆకాంక్షలు ఏమిటో తనకు బాగా తెలుసునని, ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామిని కావాలన్నదే తన రాజకీయ ప్రయాణానికి ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పలాస మండలంలోని ప్రతి ఇంటికి చేరాయని, అమ్మఒడి, ఆసరా, చేయూత, రైతు భరోసా, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలతో పేద ప్రజల జీవితాల్లో వెలుగు నిండించారని ఆయన గుర్తు చేశారు. ఆ సంక్షేమ పాలనను మళ్లీ తీసుకురావాలన్నదే తన లక్ష్యమని అన్నారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు నాయకత్వంలో పలాస నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని, ఆయన ఆశీస్సులతో తనకు ఈ అవకాశం వచ్చిందని, ఆయన సూచనల మేరకు మండలంలోని ప్రతి పంచాయతీని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. పలాస మండలంలో ఇంకా పరిష్కారం కాని రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు వంటి సమస్యలను తన దృష్టికి వస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళలకు స్వయం ఉపాధి పథకాలు అందేలా చూడడం, రైతుల సమస్యలను జిల్లా స్థాయిలో వినిపించడం తన ప్రధాన బాధ్యతగా తీసుకుంటానని తెలిపారు.
ప్రతిపక్షంలో ఉన్నా, అధికార పక్షంలో ఉన్నా తాను మాత్రం ఎల్లప్పుడూ ప్రజల పక్షాన ఉంటూ ప్రజా సమస్యలపై ప్రజల గొంతుకగా ఉంటానని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలోనే కాకుండా ఎన్నికల తర్వాత కూడా ప్రజల్లోనే ఉంటానని, ప్రతి గ్రామంలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటానని అన్నారు. మీ ఆశీర్వాదం నా బలం, మీ నమ్మకం నా బాధ్యత, మీ సమస్యల పరిష్కారం నా లక్ష్యం అని ఆయన పేర్కొన్నారు. ప్రజలే నా బలం, ప్రజాసేవే నా ధ్యేయం అనే నినాదంతో ముందుకు సాగుతున్నానని, పలాస మండల ప్రజలందరూ తనకు అండగా నిలిచి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. తనను గెలిపిస్తే పలాస మండలాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.

వైసిపి మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ కు పెరుగుతున్న ఆదరణ

● 16వ డివిజన్లో ప్రజల నుంచి వైసీపీకి పెద్ద ఎత్తున మద్దతు
● రమేష్ గౌడ్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి

అనంతపురం బ్యూరో అక్టోబర్ 23 ప్రజా వాణి అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో 16వ డివిజన్లో వైసీపీకి ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది. "రమేష్ అన్నా.. గెలిచేది నువ్వే.. నువ్వు టెన్షన్ పడాల్సిన అవసరం లేదు" అంటూ ప్రజలు వైసీపీ మేయర్ అభ్యర్థి సి. రమేష్ గౌడ్కు, 16వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి పి. కోనమ్మకు తమ విశ్వాసాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్, కార్పొరేటర్ అభ్యర్థి పి. కోనమ్మ 16వ డివిజన్ పరిధిలోని ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, రమేష్ గౌడ్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని వారు ప్రజలను అభ్యర్థించారు. స్థానిక సమస్యలు, ప్రజల అవసరాలపై కూడా అభ్యర్థులు చర్చించారు.

ప్రజలు మాట్లాడుతూ, వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, అందుకే ఆయన ఎలాంటి టెన్షన్ పడాల్సిన అవసరం లేదని ధీమా వ్యక్తం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైసీపీ అభ్యర్థులను గెలిపించడమే తమ బాధ్యత

అని పేర్కొన్నారు. ఈ ఎన్నికల ప్రచారంలో మాజీ డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వైసీపీ నాయకుడు బండి శ్రీకాంత్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రచారంలో భాగంగా కార్యకర్తలు గడపగడపా తిరిగి, ఓటర్లను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ ను అభివృద్ధి చేయడమే సీఎం లక్ష్యం

● కూటమి అభ్యర్థులను గెలిపించండి

అనంత పురం బ్యూరో అక్టోబర్ 23 ప్రజా వాణి ఈరోజు అనంతపురం పట్టణంలోని మాసినేని గ్రాండ్ సమావేశ మందిరంలో నిర్వహించిన కూటమి నాయకుల సమావేశంలో పాల్గొన్నాను. ఈ సమావేశంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ బీజేపీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్, మధ్యప్రదేశ్ మాజీ మంత్రి అరవింద్ సింగ్ ఎమ్మెల్సీ రమాదేవి టిడిపి అధ్యక్షులు పూల నాగరాజు ఆ హుడా చైర్మన్ జనసేన అధ్యక్షులు వరుణ్ జిల్లా బిజెపి అధ్యక్షుడు రాజేష్ చాంబర్ ఆఫ్ కామర్స్ శేష ఆంజనేయులు , ఎన్డీఏ మేయర్ అభ్యర్థి రాజేష్ యాదవ్, స్థానిక కూటమి నాయకులు కార్యకర్తలు, పుర ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనంతపురం నగర

అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం వంటి అంశాలపై చర్చించాం. ఎన్డీఏ కూటమి మేయర్ అభ్యర్థి అజయ్ యాదవ్ తో పాటు 62 మంది కూటమి కార్పొరేటర్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశాను. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అనంతపురం నగరాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందనిఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అనంతపురం నగరంలో మాసినేని గ్రాండ్ హాల్ లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎం పి అంబికా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూఇప్పటికే జిల్లాలో పారిశ్రామికాభి , వృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన, రహదారుల అభివృద్ధి వంటి రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. కూటమి అభ్యర్థుల విజయంతో అనంతపురం నగరానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురావడానికి కృషి చేస్తాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలు చేయడం జరిగిందని ఎం పి అంబికా లక్ష్మి నారాయణ స్పష్టం చేశారు

ప్రజావాణి ప్రభావం.. కేసముద్రం రైల్వే స్టేషన్ మూడో ప్లాట్‌ఫారమ్‌పై వెలిగిన దీపాలు!

కేసముద్రం, అక్టోబర్ 23, ప్రజావాణి. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ మూడో ప్లాట్‌ఫారమ్‌పై ప్రయాణికులు పడుతున్న చీకటి కష్టాలపై 'ప్రజావాణి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ప్లాట్‌ఫారమ్‌పై వెలుతురు లేక రాత్రి వేళల్లో ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు పడుతున్న తీవ్ర ఇబ్బందులను వివరిస్తూ ఇటీవల 'ప్రజావాణి'లో ప్రత్యేక వార్తా కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనంపై సానుకూలంగా స్పందించిన రైల్వే ఉన్నతాధికారులు మరియు స్థానిక సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టారు. ఎన్నాళ్లుగానో మూలనపడి ఉన్న సమస్యను పరిష్కరిస్తూ.. మూడో ప్లాట్‌ఫారమ్‌పై కొత్తగా హైమాస్ట్ మరియు ఎల్ఈడీ (రాజుణ) లైట్లను ఏర్పాటు చేశారు. చీకటి కారణంగా రైలు ఎక్కడానికి, దిగడానికి భయపడే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు లైట్లు ఏర్పాటు చేయడంతో స్టేషన్ ప్రాంగణమంతా వెలుగులతో నిండిపోయిందని స్థానిక ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన 'ప్రజావాణి' పత్రికకు, అలాగే వెంటనే స్పందించి లైట్లు ఏర్పాటు చేసిన రైల్వే అధికారులకు కేసముద్రం మండల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఇకపై రాత్రి సమయాల్లో కూడా ఎలాంటి భయం లేకుండా ప్రయాణించవచ్చని ప్రయాణికులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ప్రజావాణి
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
మూడో లైన్ మురిపెం.. ప్రయాణికులకు నరకప్రాయం!

హైదరాబాద్‌లో తాగునీటి కొరతకు చెక్..
'గ్రీన్ వాటర్' సరఫరాకు జలమండలి ప్రణాళిక

హైదరాబాద్: హైదరాబాద్‌లో పెరుగుతున్న నీటి అవసరాలు, తాగునీటి వనరులపై ఒత్తిడిని తగ్గించేందుకు జలమండలి (హెచ్ ఎండబ్ల్యూ ఎస్ఎస్‌బీ) వినూత్న ప్రణాళికతో ముందుకొచ్చింది. ప్రస్తుతం ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్తులో తాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా శుద్ధి చేసిన మురుగునీటిని (ట్రీటెడ్ వాటర్) నిర్మాణ పనులు, పారిశ్రామిక అవసరాలు, రోడ్ల శుభ్రత వంటి పనులకు అందించేందుకు 'గ్రీన్ వాటర్' సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. దీనికోసం నగర శివారులోని కోకాపేటలో ప్రత్యేకంగా ఒక గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే, అత్యంత విలువైన తాగునీటిని ఇతర అవసరాలకు వాడటాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ఈ ప్రణాళిక అమలు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె. అశోక్‌రెడ్డి గురువారం కోకాపేటలో పర్యటించారు. అక్కడి నీటి నాణ్యత పరీక్షల ప్రయోగశాలను సందర్శించి, శుద్ధి చేసిన నీటి నాణ్యతను ఎలా పరీక్షిస్తున్నారు, ఏయే ప్రమాణాలు పాటిస్తున్నారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలంటే నాణ్యత విషయంలో రాజీ పడరాదని, నిరంతర పర్యవేక్షణ

అత్యంత కీలకమని స్పష్టం చేశారు. జలమండలి అధికారులతో పాటు 'తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి' (టీజీఎస్‌పీసీబీ) అధికారులు సమన్వయంతో పనిచేసి, నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నీటి పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. నీటి నాణ్యత పరీక్షల ఫలితాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఎండీ అశోక్‌రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీనివల్ల జలమండలి ప్రధాన కార్యాలయం నుంచే నీటి నాణ్యతను నేరుగా పర్యవేక్షించేందుకు వీలవుతుందని తెలిపారు. ఇందుకు అవసరమైన సాంకేతిక మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు ఐటీ విభాగంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ విధానం వల్ల పర్యవేక్షణలో పారదర్శకత పెరగడమే కాకుండా సరఫరా వ్యవస్థను మరింత సమర్థంగా నిర్వహించవచ్చని వివరించారు. గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్‌లో ట్యాంకర్లకు నీటిని నింపే ప్రక్రియపైనా అశోక్‌రెడ్డి పలు కీలక సూచనలు చేశారు. ప్రతి ట్యాంకర్ సామర్థ్యాన్ని బట్టి నీటిని నింపేందుకు పరిమితులు విధించాలని ఆదేశించారు. ఏ ట్యాంకర్‌కు ఎంత నీటిని సరఫరా చేశారనే వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని, పరిమితికి మించి నీరు నింపకుండా ఆటోమేటిక్ కంట్రోల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు. ట్యాంకర్లు నిండిన తర్వాత అదనంగా మిగిలే నీరు వృథా కాకుండా, దాన్ని తిరిగి సమీపంలోని చెరువుకు మళ్లించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని చెప్పారు. ఈ గ్రీన్ వాటర్ అనేది తాగునీటికి ప్రత్యామ్నాయం కాదని, కేవలం తాగడానికి అవసరం లేని పనులకు మాత్రమే వినియోగించాలని జలమండలి అధికారులు స్పష్టం చేస్తున్నారు. నిర్మాణ రంగం, పరిశ్రమలు, రోడ్లపై దుమ్ము నియంత్రణ, పార్కులు, హరితహారం మొక్కల సంరక్షణ వంటి పనులకు ఈ నీటిని ఉపయోగించేలా ప్రజలను, సంస్థలను ప్రోత్సహించనున్నారు.

డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో ఖేలో ఇండియా పోటీలు: మంత్రి శ్రీహరి

హైదరాబాద్, అక్టోబరు 23 : తెలంగాణలో ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణకు పకడ్బందీ కార్యాచరణ రూపొంది స్తునా ్నమని మంత్రి వాకిటి శ్రీహరి వ్యాఖ్యానించారు. డిసెంబర్ 11వ తేదీ నుంచి 22వ తేదీ వరకు తెలం గాణలో ఖేలో ఇండియా పోటీలు నిర్వహిస్తు న్నట్లు పేర్కొన్నారు. (శుక్రవారం) ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణ ఏర్పాట్లపై మంత్రి వాకిటి శ్రీహరి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. ఖేలో ఇండియా నిర్వహణను తమ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని వెల్లడించారు. గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తిస్తామని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. 27 క్రీడాంశాల్లో ప్రతిభ ఆధారంగా క్రీడాకారుల ఎంపిక చేస్తామని వివరించారు. ఎంపిక ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, పోషకాహారం అందించడంపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని మార్గనిర్దేశం చేశారు. స్టేడియాలు, క్రీడా పరికరాలు, మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. క్రీడాకారులకు వైద్య సహాయం, వసతి, రవాణా సదుపాయాలు కల్పించాలని దిశానిర్దేశం చేశారు. దేశానికే ఆదర్శంగా ఖేలో ఇండియా పోటీల నిర్వహణ ఉండాలని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

క్యూవీఎస్ఈ యాప్‌తో జాగ్రత్త!

వరంగల్ క్యూవీఎస్ఈ (క్వాంటమ్ వెస్ట్ స్టాక్ ఎక్స్ఛేంజ్) యాప్ ద్వారా ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలు జరుగుతున్నట్లు కేంద్ర, రాష్ట్ర సైబర్ క్రైం విభాగాలు హెచ్చరిస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత సూచించారు. సైబర్ నేరగాళ్లు యాప్‌లో ఏపీకే ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఇన్‌స్టాల్ చేసుకోవాలని మొబైల్‌ఫోన్ యూజర్లను ఏమార్చుతున్నారని తెలిపారు. భారతదేశ డబ్బును ఫైనాన్స్ ఎక్స్ఛేంజ్ ద్వారా క్రిప్టో కరెన్సీగా మార్చి పెట్టుబడి పెట్టాలని సూచిస్తున్నారని, అలా చేస్తే 1 శాతం లాభం వస్తుందని నమ్మిస్తున్నారని తెలిపారు. ఈ తరహా మోసాలకు సంబంధించి తెలంగాణలో ఇప్పటికే 52 కేసులు నమోదయ్యాయన్నారు. అత్యాశకు పోయి కష్టపడి సంపాదించిన డబ్బును పోగొట్టుకోవద్దన్నారు. సైబర్ నేరానికి గురైతే తక్షణమే 1930 హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

జీరో నక్సల్ స్టేట్‌గా తెలంగాణ

హైదరాబాద్, అక్టోబరు 23 : నక్సల్స్ సమస్య 1980లో ఉండేదని.. ఇందుకోసం గ్రేహౌండ్స్ ఏర్పాటు చేశామని.. ఈ విభాగానికి దేశవ్యాప్తంగా ప్రాముఖ్యం ఉందని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. నక్సల్స్ సమస్య తగ్గిపోయిన తర్వాత గతంలో హైదరాబాద్‌లో బ్లాస్టులు జరిగాయని.. అప్పుడు అక్టోపస్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇటీవల జీరో నక్సల్ స్టేట్‌గా తెలంగాణ ఏర్పాటైందని అన్నారు. రెండేళ్లలో 824 మంది లొంగిపోయారని.. 302 ఆయుధాలను అప్పగించారని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ 36వ రైజింగ్ డే పరేడ్‌ను ఈరోజు (శుక్రవారం) నిర్వహించారు. అమీన్‌పూర్‌లోని టీజీ ఎస్పీఎఫ్ సెక్యూరిటీ అకాడమీలో ఈ వేడుకలు జరిగాయి. ఈ పరేడ్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, డీజీపీ ఆనంద్, టీజీఎస్పీఎఫ్ డీజీ స్వాతి లక్రా, హోం ప్రిన్సిపాల్ సెక్రటరీ శిఖా గోయల్ హాజరయ్యారు. 36వ ఆవిర్భావ దినోత్సవం

సందర్భంగా అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీజీపీ ఆనంద్ మాట్లాడారు. డ్రగ్స్‌పై పోరాటానికి ఈగల్ ఫోర్స్ ఏర్పాటు. .ఇప్పుడు డ్రగ్స్‌పై పోరాటానికి ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేశామని డీజీపీ ఆనంద్ వెల్లడించారు. డీజీ స్థాయి అధికారి దీనికి హెడ్‌గా ఉంటారని ప్రస్తావిం చారు. దేశ విదేశాల్లో నేరగాళ్ల కోసం ప్రత్యేక ఆపరేషన్లు చేశారని తెలిపారు. ఇందుకుగాను కేంద్ర హోం శాఖ అవార్డు ఇచ్చిందని అన్నారు. సైబర్ నేరాల కట్టడికి సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేశామని వివరించారు. ఇటీవల సీఎస్‌బీ చేసిన ఎఫర్ట్స్‌కి కేంద్ర హోం శాఖ అవార్డు ఇచ్చిందని తెలిపారు. డయల్ 112 నంబర్‌ను బలోపేతం చేశామని వివరిం చారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ ద్వారా ప్రకృతి విపత్తుల్లో సమర్థవంతంగా పనిచేస్తున్నామని వెల్లడించారు. పోలీసులు వినియోగించే యాప్స్‌ను పూర్తిగా ఏఐ బేస్డ్‌గా మార్చేసి ˉంజుఖతీని పేరుతో అప్‌డేట్ చేశామని తెలిపారు. స్త్రీల భద్రతకు మహిళా భద్రత విభాగం పనిచేస్తోందని వివరించారు. అలాగే, టీ-సేఫ్ యాప్‌ను రూపొందించామని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు. డ్రగ్స్‌కు బానిసైన వారికోసం సన్మిత్ర: డీజీపీ సలీంకర్ణాటకలో 'మనే మనేగే పోలీస్' పేరుతో సీనియర్ సిటిజన్, పేద ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు కర్ణాటక డీజీపీ ఎంఏ సలీం తెలిపారు. మొత్తం కోటి మందికి పైగా ప్రజల సమస్యలను పోలీసు సిబ్బంది పరిష్కరించినట్లు వివరించారు. ప్రత్యేక మొబైల్ నంబర్‌ను ఏర్పాటు చేసి వాటికీ అత్యవసర సహాయం అందేలా చూస్తున్నామని తెలిపారు. డ్రగ్స్‌కు బానిసైన వారికోసం 'సన్మిత్ర' పేరుతో సెంటర్లు ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా సహకారంతో డ్రగ్స్ కట్టడికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ట్రాఫిక్ ప్రధాన సమస్య అని... రద్దీని తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని చెప్పారు. 'అస్త్రం' పేరుతో ఏఐ బేస్డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఏర్పాటు చేశామని కర్ణాటక డీజీపీ సలీం పేర్కొన్నారు.

12 లక్షల కార్లు విడుదల చేసే కాలుష్యంతో సమానం

హైదరాబాద్: మహానగరంలో ఇతర ప్రాంతాల ప్రజలు స్వచ్ఛమైన గాలిని పీల్చుకుంటుంటే, జవహర్‌నగర్ నివాసితులు మాత్రం నగరం అంతటి నుంచి వచ్చే వ్యర్థాల దుర్వాసనను భరించాల్సిన దుస్థితి నెలకొంది. సుమారు 1.5 కోట్ల జనాభా కలిగిన భాగ్యనగరం, ఈ డంపింగ్ యార్డుపైనే ఆధారపడి, అక్కడే చెత్తను పారబోయడమే అందుకు ప్రధాన కారణం. చెత్త, దుర్వాసన సమస్యతో జవహర్‌నగర్ పరిసర గ్రామాల్లోనూ భయాందోళనలు పెరుగుతున్నాయి. అయితే అధికారులు మాత్రం దీని వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్?రంజన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి ఇటీవల డంపింగ్ యార్డు సమీపంలోని ప్రాంతాలను సందర్శించారు. కానీ సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. ఈ ప్రాంతం నుంచి వెలువడుతున్న ప్రమాదకరమైన మీథేన్ వాయువు వ్యాప్తిపైన అధ్యయనం చేయించి, నిజాన్ని తేల్చేందుకు కూడా ప్రయత్నాలు

చేయలేదు. రోజుకు 3,000 టన్నుల వ్యర్థాల పెరుగుదలనగర శివార్లలో ఆధునిక, దుర్వాసన వెదజల్లని వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. సంగారెడ్డి జిల్లాలోని ప్యారానగర్, దుండిగల్, అలాగే రంగారెడ్డి జిల్లాలోని ఖానాపూర్, యాచారం గ్రామాల్లో భూ సర్వేలు కూడా నిర్వహించారు. అయితే స్థానికుల నుంచి వ్యతిరేకత రావడంతో ఈ ప్రక్రియ అక్కడితో నిలిచిపోయింది. దీనికి బదులుగా జవహర్‌నగర్‌లో రెండు, దుండిగల్‌లో ఒకటి చొప్పున వ్యర్థాల నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేసే ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఇవి రోజుకు 2,500 టన్నుల వ్యర్థాలను ప్రాసెస్ చేస్తున్నా, జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు మాత్రం భారం తగ్గడం లేదు. గతంలో రోజుకు 7,500 టన్నులుగా ఉన్న వ్యర్థాల ఉత్పత్తి, ప్రస్తుతం 10,500 టన్నులకు పెరిగింది. మరోవైపు రంగారెడ్డి జిల్లాలోని సిద్ధాపూర్‌లో అత్యాధునిక వ్యర్థాల రీసైక్లింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన కూడా అక్కడే ఆగిపోయింది. కార్బన్ డయాక్సైడ్ కంటే 86 రెట్లు ప్రమాదకరంసెంటర్ ఫర్ ఫైనాన్షియల్ అకౌంటబిలిటీ (సీఎఫ్ఏ) వెల్లడించిన అంచనాల ప్రకారం, జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ప్రపంచవ్యాప్తంగా మీథేన్ ఉద్గారాలను విడుదల చేస్తున్న అతిపెద్ద చెత్త కేంద్రాల్లో నాలుగో స్థానంలో ఉంది. కార్బన్‌డయాక్సైడ్‌తో పోలిస్తే మీథేన్ 86 రెట్లు ఎక్కువ ప్రమాదకరమైంది. ప్రస్తుతం జవహర్‌నగర్ డంపింగ్ యార్డు నుంచి గంటకు 5.9 టన్నుల చొప్పున మీథేన్ గాల్లోకి విడుదలవుతోంది. ఇది 12 లక్షల కార్ల ద్వారా వెలువడే కాలుష్యంతో సమానం.

తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం.. ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు..!

హైదరాబాద్, అక్టోబరు 23 : తెలంగాణ ప్రభుత్వం ఇక నుంచి ఇంటి వద్దకే మీ సేవా, ఆధార్ సేవలు తీసుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. అలాగే, ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు ఇంటి వద్దే పొందే అవకాశం కల్పించనుంది. ఆధార్ నమోదు, వివరాల అప్‌డేట్ సేవలు కూడా ఇంటి వద్దకే తీసుకురానున్నట్లు తెలుస్తోంది. మీ సేవా డోర్‌స్టెప్ ద్వారా డెలివరీకి తొలి నెలలోనే అపూర్వ స్పందన వచ్చింది. 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు 3,885 కాల్స్, 1100కు కాల్ చేసి లేదా మీ సేవా పోర్టల్ ద్వారా సేవలు బుక్ చేసుకోవచ్చని అధికారులు తెలుపుతున్నారు. క్యూల్లో నిలబడే అవసరం లేకుండా ఇంటి వద్దే సేవలు తీసుకువచ్చేలా కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం జఖ=జు పరిధిలోని ప్రాంతాల్లోనే డోర్‌స్టెప్ సేవలు ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. బుక్ చేసుకున్న సేవల ఆధారంగా నిర్దేశిత రుసుములు చెల్లించాలనే షరతును విధించనుంది. తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో ఈ సేవలను రాష్ట్ర ప్రభుత్వం బలోపేతం చేస్తోంది.

స్వీట్ షాపుల్లో టీజీ సేఫ్ తనిఖీలు.. ఫంగస్ ఉన్న మిఠాయిల గుర్తింపు

హైదరాబాద్, అక్టోబర్ 23: నగరంలోని పలు స్వీట్ షాపులపై టీజీ సేఫ్ ఫుడ్ వింగ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మొత్తం 12 బృందాలతో ఫుడ్ సేఫ్టీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రంగంలోకి దిగారు. ఈ క్రమంలో అపరిశుభ్ర పరిసరాల్లో స్వీట్లను తయారు చేస్తున్నట్లు గుర్తించారు. లైసెన్స్ లేకుండానే కొన్ని స్వీట్ షాపులను నిర్వహిస్తున్నారని, అంతేకాకుండా గడువు ముగిసిన లైసెన్స్‌లతోనూ షాపులను నడుపుతున్నట్లు తనిఖీల్లో బయటపడింది. ఎక్స్‌పైరీ ముగిసిన స్వీట్లను తొలగించకుండా విక్రయానికి పెట్టడంతో పాటు గడువు ముగిసిన స్వీట్లను కొత్త స్వీట్ల తయారీలో కలుపుతున్నట్లు టీజీ సేఫ్ అధికారులు గుర్తించారు. పురుగులు, ఫంగస్ ఉన్న పల్లీలు, స్వీట్లు విక్రయానికి ఉంచినట్లు తనిఖీల్లో తేలింది. తార్నాకలోని వీ/ం.సుదర్శన్ రెడ్డి ప్యూర్ ఘీ స్వీట్స్‌కు టీజీ సేఫ్ అధికారులు దాడులు నిర్వహించారు.

పొదుపు సంఘాల మాటున అక్రమాలు – దొరికిపోతామనే భయంతో రూ. 40 కోట్లు వెనక్కి

హైదరాబాద్: పట్టణ ప్రాంతాల్లో పేదరికాన్ని నిర్మూలించేందుకు అమలు చేస్తున్న మిషన్? ఫర్? ఎలిమినేషన్? ఆఫ్? పావర్టీ ఇన్? మున్సిపల్? ఏరియాస్? (మెప్మా)లో అవినీతి విపరీతంగా పెరిగిపోతోంది. ఈ విషయమై ఫిర్యాదులు అందిన తర్వాత జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు జరిపిన విచారణలో ఆందోళనకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తమదాకా వస్తే దొరికిపోతామనే భయంతో రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తమైన అవినీతి సిబ్బంది ఏకంగా రూ.40 కోట్లను బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం గమనార్హం. దీంతో రుణాల మంజూరు ప్రక్రియను పూర్తిగా ప్రక్షాళన చేసేందుకు అధికారులు కసరత్తులు చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లోని పేద మహిళలు సంఘాలుగా ఏర్పడి దరఖాస్తు చేసుకుంటే బ్యాంకులు వారికి రుణాలు అందిస్తాయి. వారు వాటిలో చిన్న వ్యాపారాలు చేసుకుని ఉపాధి అవకాశాలు పొందవచ్చు. ఈ రుణాల మంజూరు ప్రక్రియలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీవోలు) కీలక పాత్ర పోషిస్తారు. ఈ సంఘాల సూక్ష్మ రుణ ప్రణాళిక (మైక్రో క్రెడిట్? ప్లాన్?)లను రూపొందించడంలో, వాటిని అధికారులకు సమర్పించడంలో, వారి ఆమోదం పొందిన తర్వాత బ్యాంకుల ద్వారా రుణాలు

ఇప్పించడంలో వీరు కీలక పాత్ర పోషిస్తారు. ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకుని కొందరు సీవోలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. తమకు వాటా ఇస్తామని చెప్పే సంఘాలకు మాత్రమే రుణాలు ఇప్పిస్తున్నారు. అసలు పని చేయని వాటికి కూడా రుణాలు మంజూరు చేయిస్తున్నారు. కొంతమంది సీవోలు పొదుపు సొసైటీలకు రుణాలు మంజూరు చేయిస్తున్నారు. అయితే వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదు. ఫలితంగా దీనికి సంబంధించిన రుణాల గురించి అధికారులకు తెలియడం లేదు. ఈ సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా వినియోగించుకోవాలన్నదే వీరి ఉద్దేశం. ఇంకోవైపు కొందరు సీవోలు మూసివేసిన, ఉనికిలో లేని సంఘాలకు నకిలీ పత్రాలతో రుణాలు ఇప్పించారు. ఉదాహరణకు సరూర్‌నగర్ సర్కిల్‌లో 2,241 సంఘాలు ఉండగా, వాటిలో 1,897 ఉనికిలో ఉన్నాయి. 310 సంఘాలు పని చేయడం లేదు. 34 డిఫాల్ట్ జాబితాలో ఉన్నాయి. ఎల్?బీనగర్ పరిధిలో 1,953 సంఘాలకు 1,783 క్రియాశీలకంగా ఉండగ 118 పని చేయడం లేదు, 52 డిఫాల్ట్ అయ్యాయి. హయత్‌నగర్ సర్కిల్? పరిధిలోని 1,904 సంఘాలలో 1,395 క్రియాశీలంగా ఉన్నాయి, 469 పనిచేయడం లేదు, 40 డిఫాల్ట్ అయ్యాయి. వాస్తవానికి పనిచేయని, డిఫాల్ట్ అయిన సంఘాలకు రుణాలు ఇవ్వకూడదు. అయితే అధికారులు అప్రమత్తమై అలాంటి సంఘాలకు రుణాల మంజూరుపై రాష్ట్రవ్యాప్త విచారణకు ఆదేశించగా వందలాది పొదుపు సంఘాల నుంచి రూ. 40 కోట్లు బ్యాంకుల్లో తిరిగి జమ అయినట్లు తెలుస్తోంది. చాలా మంది సీవోలు ఒకే సర్కిల్‌లో చాలా కాలంగా పనిచేస్తుండటంతో అక్కడి సంఘాల వారు, బ్యాంకుల సిబ్బందితో పరిచయాలు పెంచుకున్నారు.

తొలి వన్డేలో భారత బౌలర్ల జోరు

జింబాబ్వే 197 పరుగులకే ఆలౌట్.. శ్రీ చరణి నాలుగు వికెట్లతో మెరుపులు

వడోదర: ఇప్పటికే టీ20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన భారత జట్టు, వన్డే సిరీస్‌పైనా ఆధిపత్యం సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగింది. మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి పోరులో భారత బౌలర్లు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. సమష్టిగా రాణించిన బౌలింగ్ దళం జింబాబ్వే బ్యాటర్లను కట్టడి చేయడంతో ప్రత్యర్థి జట్టు 49.5 ఓవర్లలో 197 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో భారత్ ముందు 198 పరుగుల లక్ష్యం నిలిచింది. ముఖ్యంగా తెలుగు అమ్మాయి శ్రీ చరణి నాలుగు వికెట్లు పడగొట్టి జింబాబ్వే బ్యాటింగ్ పతనంలో కీలక పాత్ర పోషించింది. **శ్రీ చరణి సూపర్ బౌలింగ్** భారత బౌలర్లలో శ్రీ చరణి అద్భుతమైన బౌలింగ్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కేవలం 23 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టిన ఆమె ప్రత్యర్థి జట్టు పరుగుల వేగాన్ని నియంత్రించడమే కాకుండా కీలక బ్యాటర్లను పెవిలియన్‌కు పంపింది. జింబాబ్వే బ్యాటర్లు నిలదొక్కుకునే ప్రయత్నం చేసిన ప్రతిసారీ భారత బౌలర్లు ఒత్తిడి పెంచుతూ వికెట్లు సాధించారు. శ్రీ చరణి ప్రదర్శనకు తోడు మిగతా బౌలర్లు కూడా సమర్థంగా సహకరించడంతో జింబాబ్వే జట్టు భారీ స్కోరు సాధించలేకపోయింది. **క్రాంతి గౌడ్ సైతం కీలక పాత్ర** భారత బౌలింగ్‌లో క్రాంతి గౌడ్ కూడా తనదైన ముద్ర వేసింది. 42 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టు బ్యాటింగ్ క్రమాన్ని దెబ్బతీసింది. మరోవైపు దీప్తి శర్మ రెండు వికెట్లు తీసి జింబాబ్వేపై ఒత్తిడి పెంచగా, షఫాలీ వర్మకు ఒక వికెట్ దక్కింది. ఈ విధంగా భారత బౌలర్లు సమష్టిగా రాణించి జింబాబ్వేను తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. **బెలోవెడ్ బిజా అర్ధశతకం** టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే జట్టులో బెలోవెడ్ బిజా 62 పరుగులతో ఆకట్టుకుంది. ఆమె అర్ధశతకంతో జట్టుకు కొంత ఊరట లభించింది. మిచెల్లె మవుంగ 29 పరుగులు, మోడెస్టర్ ముపచిక్వా 25 పరుగులు, చిపో ముగేరి 21 పరుగులు చేసి తమ వంతు సహకారం అందించారు. అయితే మిగతా బ్యాటర్లు ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోవడంతో జింబాబ్వే ఇన్నింగ్స్ 49.5 ఓవర్లలో 197 పరుగుల వద్ద ముగిసింది. **భారత్ లక్ష్యం 198 పరుగులు** తొలి ఇన్నింగ్స్‌లో భారత బౌలర్లు ఆధిపత్యం ప్రదర్శించడంతో జింబాబ్వేను 197 పరుగులకే పరిమితం చేయగలిగారు. ఇప్పుడు 198 పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సిన బాధ్యత భారత బ్యాటర్లపై ఉంది. టీ20 సిరీస్‌లో చూపిన జోరును వన్డేల్లోనూ కొనసాగించి తొలి మ్యాచ్‌లో విజయం సాధించాలని భారత జట్టు లక్ష్యంగా పెట్టుకుంది. బౌలర్లు అందించిన అవకాశాన్ని బ్యాటర్లు ఎలా సద్వినియోగం చేసుకుంటారన్నది కీలకంగా మారింది.

అనూహ్యంగా భారత జట్టులోకి
వైభవ్ సూర్యవంశీ!

- అతి పిన్న వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం.. యువ సంచలనంపై భారీ అంచనాలు

న్యూఢిల్లీ: భారత క్రికెట్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పేరు మరోసారి మార్మోగుతోంది. తన అసాధారణ బ్యాటింగ్ ప్రతిభతో అతి తక్కువ కాలంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ యువ ఆటగాడు జాతీయ జట్టులో చోటు సంపాదించి అందరి దృష్టిని ఆకర్షించాడు. చిన్న వయసులోనే అద్భుతమైన షాట్లతో బౌలర్లను ఇబ్బంది పెట్టగల సామర్థ్యం కలిగిన వైభవ్‌పై క్రికెట్ అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. అతడి ఆటతీరు, పరుగులు సాధించే వేగం, ఒత్తిడిలోనూ దూకుడుగా ఆడే విధానం భవిష్యత్తులో భారత క్రికెట్‌కు మంచి అవకాశాలను సూచిస్తున్నాయి. **చిన్న వయసులోనే సంచలన ప్రదర్శనలు** వైభవ్ సూర్యవంశీ అతి చిన్న వయసులోనే క్రికెట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు. యువ క్రికెట్ పోటీల్లో అద్భుతమైన ప్రదర్శనలు చేయడంతో పాటు, దేశవాళీ క్రికెట్‌లోనూ తన ప్రతిభను చాటుకున్నాడు. ముఖ్యంగా భారీ షాట్లు ఆడటంలో అతడికి ఉన్న నైపుణ్యం, వేగంగా పరుగులు సాధించే సామర్థ్యం అతడిని ఇతర యువ ఆటగాళ్ల నుంచి ప్రత్యేకంగా నిలబెట్టాయి. ప్రత్యర్థి జట్టు బౌలర్లపై ఒత్తిడి పెంచుతూ దూకుడుగా ఆడటం అతడి ప్రధాన బలంగా మారింది. **ఐపీఎల్‌లోనూ అదరగొట్టిన యువ ఆటగాడు** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో వైభవ్ ప్రదర్శనలు అతడి ప్రతిభను మరింత వెలుగులోకి తీసుకొచ్చాయి. అనుభవజ్ఞులైన బౌలర్లను ఎదుర్కొంటూ ధైర్యంగా బ్యాటింగ్ చేయడం ద్వారా అభిమానులను ఆకట్టుకున్నాడు. తక్కువ బంతుల్లోనే ఎక్కువ పరుగులు సాధించగల సామర్థ్యం అతడికి ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. ఐపీఎల్‌లో లభించిన అనుభవం అతడి ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు, ఉన్నత స్థాయి క్రికెట్‌కు సిద్ధమయ్యేందుకు దోహదపడింది. **భారత జట్టులో అవకాశంతో కొత్త అధ్యాయం** జాతీయ జట్టులో చోటు సంపాదించడం ప్రతి క్రికెటర్ కల. వైభవ్ సూర్యవంశీకి చిన్న వయసులోనే ఈ అవకాశం లభించడం అతడి ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తోంది. అయితే అంతర్జాతీయ క్రికెట్‌లో నిలదొక్కుకోవాలంటే ప్రతిభతో పాటు నిలకడ, పరిస్థితులకు అనుగుణంగా ఆడే నైపుణ్యం, మానసిక దృఢత్వం కూడా అవసరం. జట్టు యాజమాన్యం అతడికి ఎప్పుడు, ఏ విధంగా అవకాశం కల్పిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. **అభిమానుల్లో భారీ అంచనాలు** వైభవ్ సూర్యవంశీ ఆటతీరుపై అభిమానులు ఆశలు పెట్టుకున్నారు. అతడు తన సహజమైన దూకుడును కొనసాగిస్తూ జట్టు అవసరాలకు అనుగుణంగా ఆడగలిగితే భారత క్రికెట్‌లో మరింత ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. అయితే యువ ఆటగాడిపై అతిగా అంచనాలు పెట్టకుండా, అనుభవం సంపాదించేందుకు తగిన సమయం ఇవ్వడం కూడా అంతే ముఖ్యం.

భల్లెం విసురులో హనీకి స్వర్ణ పతకం

- ప్రపంచ రికార్డు బద్దలు.. 60.49 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానం కైవసం

నాగోయా: ఆసియా దివ్యాంగుల క్రీడల్లో భారత క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు. పురుషుల భల్లెం విసురు పోటీలో భారత క్రీడాకారుడు హనీ స్వర్ణ పతకాన్ని సాధించి దేశ కీర్తిని చాటాడు. చివరి ప్రయత్నంలో ఏకంగా 60.49 మీటర్ల దూరం భల్లెం విసిరి సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. ఈ అద్భుత ప్రదర్శనతో ప్రత్యర్థులను వెనక్కి నెట్టి అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. **చివరి ప్రయత్నంలో ప్రపంచ రికార్డు** పోటీ ఆరంభం నుంచే హనీ మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ప్రతి ప్రయత్నంలోనూ తన ప్రతిభను చాటుతూ ముందుకు సాగాడు. ఐదో ప్రయత్నంలో 59.72 మీటర్ల దూరం భల్లెం విసిరిన హనీ, చివరి ప్రయత్నంలో మరింతగా సత్తా చాటాడు. ఏకంగా 60.49 మీటర్ల దూరం విసిరి ప్రపంచ రికార్డును తిరగరాశాడు. ఈ ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని అందుకోవడంతో పాటు భారత క్రీడా ప్రతిష్ఠను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టాడు. **కాంస్యం నుంచి స్వర్ణం వరకు** హనీ ఈ క్రీడా పోటీల్లో వరుసగా పతకాలు సాధిస్తూ సత్తా చాటుతున్నాడు. పురుషుల చక్రం విసురు పోటీలో 57.04 మీటర్ల దూరం విసిరి కాంస్య పతకాన్ని సాధించాడు. తాజాగా భల్లెం విసురులో ప్రపంచ రికార్డుతో స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు. రెండు విభాగాల్లోనూ తన ప్రతిభను చాటిన హనీ ప్రదర్శన క్రీడాభిమానులను ఆకట్టుకుంటోంది. **భారత క్రీడాకారుల పతకాల జోరు** ఆసియా దివ్యాంగుల క్రీడల్లో భారత క్రీడాకారులు పతకాల వేట కొనసాగిస్తున్నారు. పురుషుల 400 మీటర్ల పరుగు పోటీలో సందీప్ ప్రపంచ రికార్డుతో స్వర్ణ పతకాన్ని సాధించాడు. మరో భారత క్రీడాకారుడు అజయ్ కుమార్ కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు. సందీప్ 52.28 సెకన్లలో గమ్యాన్ని చేరగా, అజయ్ కుమార్ 53.61 సెకన్లలో పరుగు పూర్తి చేశాడు. ఈ విజయాలతో భారత పతకాల సంఖ్య వంద దాటింది. **దేశానికి గర్వకారణంగా క్రీడాకారులు** వైకల్యాలను అధిగమించి అంతర్జాతీయ వేదికలపై భారత క్రీడాకారులు సాధిస్తున్న విజయాలు దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నాయి. నిరంతర సాధన, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో వారు ప్రపంచ రికార్డులను తిరగరాస్తున్నారు. హనీ సాధించిన స్వర్ణ పతకం దేశవ్యాప్తంగా యువ క్రీడాకారులకు స్ఫూర్తినివ్వనుంది. భవిష్యత్తులోనూ మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో భారత క్రీడాకారులు విజయాలు సాధించాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

ఇషాన్ కిషన్‌కు గాయం..
రెండో టీ20కి దూరం!

న్యూజిలాండ్‌తో పోరుకు అందుబాటులో లేని భారత వికెట్ కీపర్.. వైభవ్ సూర్యవంశీకి జట్టులో చోటు దక్కే అవకాశం

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తొలి టీ20లో గాయపడిన భారత వికెట్ కీపర్, బ్యాటర్ ఇషాన్ కిషన్ రెండో టీ20 మ్యాచ్‌కు దూరమయ్యాడు. కుడి తొడ లోపలి కండరానికి స్వల్ప గాయం కావడంతో అతడు ఈ మ్యాచ్‌లో ఆడటం లేదని భారత క్రికెట్ నియంత్రణ మండలి వెల్లడించింది. ప్రస్తుతం వైద్య బృందం అతడి గాయం తీవ్రతను పరిశీలిస్తూ, కోలుకునే పరిస్థితిని పర్యవేక్షిస్తోంది. ఇషాన్ గాయం కారణంగా రెండో టీ20లో భారత తుది జట్టు కూర్పులో మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. **తొలి మ్యాచ్‌లోనే గాయం** న్యూజిలాండ్‌తో గురువారం జరిగిన తొలి టీ20లో ఇషాన్ కిషన్ గాయానికి గురయ్యాడు. ఈ మ్యాచ్‌లో అతడు సాధారణంగా ఆడే స్థానంలో కాకుండా ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగడం గమనార్హం. తొలి వికెట్ పడిన తర్వాత తిలక్ వర్మ, శ్రేయస్ అయ్యర్ ముందుగా బ్యాటింగ్‌కు రావడానికి ఇషాన్ గాయమే కారణమని భారత జట్టు బ్యాటింగ్ కోచ్ వెల్లడించాడు. గాయం కారణంగా ఇషాన్ ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో రెండో మ్యాచ్‌కు అతడు అందుబాటులో ఉండటం కష్టమని ముందుగానే సంకేతాలు వెలువడ్డాయి. తాజాగా భారత క్రికెట్ నియంత్రణ మండలి ప్రకటనతో అతడు రెండో టీ20కి దూరమైన విషయం స్పష్టమైంది. **వైభవ్ సూర్యవంశీకి అవకాశం?** ఇషాన్ కిషన్ దూరం కావడంతో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు పెరిగాయి. ఇటీవల తన దూకుడైన బ్యాటింగ్‌తో క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షించిన వైభవ్, భారత జట్టులో మరోసారి తన సత్తా చాటేందుకు ఎదురుచూస్తున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అతడికి తుది జట్టులో ఆడే అవకాశం లభించలేదు. ఇప్పుడు ఇషాన్ గాయం కారణంగా ఏర్పడిన ఖాళీని భర్తీ చేసేందుకు జట్టు యాజమాన్యం వైభవ్ పేరును పరిశీలించే అవకాశం ఉంది. అయితే అతడికి తుది జట్టులో చోటు కల్పిస్తారా లేదా అన్నది జట్టు ఎంపికపై ఆధారపడి ఉంటుంది. **తొలి మ్యాచ్‌లో భారత్ అద్భుత విజయం** న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టీ20లో భారత జట్టు అద్భుతంగా రాణించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆతిథ్య జట్టు నిర్ణీత ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 225 పరుగుల భారీ స్కోరు సాధించింది. గ్లెన్ ఫిలిప్స్ అజేయంగా 82 పరుగులు చేయగా, ఫిన్ అలెన్ 45 పరుగులతో ఆకట్టుకున్నాడు. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్‌కు సంజూ శాంసన్ 67 పరుగులతో శుభారంభం అందించాడు. అనంతరం శ్రేయస్ అయ్యర్ 42 పరుగులు, నామన్ ధీర్ అజేయంగా 42 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. దీంతో భారత్ మరో రెండు బంతులు మిగిలి ఉండగానే ఆరు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 10 ఆధిక్యంలో నిలిచింది. **రెండో టీ20పై ఆసక్తి** తొలి మ్యాచ్‌లో విజయం సాధించిన భారత జట్టు అదే జోరును కొనసాగించాలని భావిస్తోంది. మరోవైపు న్యూజిలాండ్ జట్టు సిరీస్‌ను సమం చేయాలనే పట్టుదలతో బరిలోకి దిగనుంది. ఇషాన్ కిషన్ గైర్హాజరు భారత బ్యాటింగ్ కూర్పుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అతడి స్థానంలో ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. వైభవ్ సూర్యవంశీకి అవకాశం లభిస్తే తన ప్రతిభను నిరూపించుకునేందుకు మంచి వేదికగా నిలవనుంది. అయితే గాయం నుంచి ఇషాన్ ఎప్పుడు పూర్తిగా కోలుకుంటాడనే విషయంపై వైద్య బృందం నుంచి తదుపరి సమాచారం రావాల్సి ఉంది.

ప్రపంచ రికార్డుతో సందీప్‌కు స్వర్ణ పతకం

ఆసియా దివ్యాంగుల క్రీడల్లో 400 మీటర్ల పరుగులో అద్భుతం.. భారత కీర్తిని చాటిన అథ్లెట్

నాగోయా: ఆసియా దివ్యాంగుల క్రీడల్లో భారత క్రీడాకారులు అద్భుత విజయాలతో దూసుకెళ్తున్నారు. పురుషుల 400 మీటర్ల పరుగు పోటీలో భారత అథ్లెట్ సందీప్ కుమార్ ప్రపంచ రికార్డు సృష్టించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అత్యంత వేగంగా పరుగెత్తి ప్రత్యర్థులను వెనక్కి నెట్టిన సందీప్ తన అసాధారణ ప్రతిభతో భారత కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో చాటాడు. ఈ విజయంతో భారత క్రీడా బృందంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. **52.28 సెకన్లలో గమ్యానికి** పురుషుల 400 మీటర్ల టీ44 విభాగంలో జరిగిన తుది పోటీలో సందీప్ కుమార్ అద్భుత వేగాన్ని ప్రదర్శించాడు. నిర్ణీత దూరాన్ని కేవలం 52.28 సెకన్లలో పూర్తి చేసి ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. పోటీ ప్రారంభం నుంచే వేగాన్ని కొనసాగించిన సందీప్, చివరి వరకు అదే పట్టుదలను ప్రదర్శించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని సాధించడమే కాకుండా తన పేరును ప్రపంచ రికార్డుల జాబితాలో నమోదు చేసుకున్నాడు. **అజయ్ కుమార్‌కు కాంస్యం** ఇదే పోటీలో మరో భారత క్రీడాకారుడు అజయ్ కుమార్ కూడా పతకం సాధించాడు. 400 మీటర్ల పరుగును 53.61 సెకన్లలో పూర్తి చేసి కాంస్య పతకాన్ని అందుకున్నాడు. ఒకే పోటీలో ఇద్దరు భారత క్రీడాకారులు పతకాలు సాధించడం విశేషంగా నిలిచింది. సందీప్ స్వర్ణం, అజయ్ కాంస్యంతో భారత పతకాల ఖాతాలో మరో రెండు పతకాలు చేరాయి. వీరిద్దరి ప్రదర్శన భారత క్రీడాభిమానుల్లో ఉత్సాహాన్ని నింపింది. **పట్టుదలతో విజయ శిఖరాలకు** దివ్యాంగుల క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు అనేక సవాళ్లను అధిగమిస్తూ నిరంతరం సాధన చేస్తుంటారు. శారీరక పరిమితులను అధిగమించి అంతర్జాతీయ వేదికలపై ప్రతిభను చాటడం వారి కఠోర శ్రమకు నిదర్శనం. సందీప్ కుమార్ సాధించిన ప్రపంచ రికార్డు యువ క్రీడాకారులకు స్ఫూర్తినిచ్చే విజయంగా నిలుస్తోంది. లక్ష్యంపై ఏకాగ్రత, క్రమశిక్షణ, నిరంతర సాధన ఉంటే అసాధ్యమనుకున్న లక్ష్యాలను సైతం సాధించవచ్చని ఆయన

నిరూపించాడు. **భారత పతకాల సంఖ్యకు మరింత బలం** ఆసియా దివ్యాంగుల క్రీడల్లో భారత క్రీడాకారులు పలు విభాగాల్లో పతకాలు సాధిస్తూ దేశ ప్రతిష్ఠను పెంచుతున్నారు. పరుగుపందేలు, భల్లెం విసురు, చక్రం విసురు వంటి పోటీల్లో భారత క్రీడాకారులు రాణించడం విశేషం. సందీప్ కుమార్ ప్రపంచ రికార్డుతో స్వర్ణ పతకం సాధించడం భారత బృందానికి మరింత ఉత్సాహాన్నిచ్చింది. అంతర్జాతీయ పోటీల్లో భారత క్రీడాకారుల ప్రతిభకు లభిస్తున్న గుర్తింపు భవిష్యత్తులో మరిన్ని విజయాలకు మార్గం సుగమం చేయనుంది.

ప్రియదర్శి, నాగదుర్గ

'ఇడుపు కాయితం' విడుదల తేదీ ఖరారు

ప్రియదర్శి, నాగదుర్గ కీలక పాత్రల్లో నటిస్తున్న ఫ్యామిలీ డ్రామా 'ఇడుపు కాయితం' విడుదల తేదీ ఖరారైంది. వంశీరెడ్డి దొండపాటి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డిసెంబరు 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి బన్నీ వాస్ వర్క్స్ పతాకంపై బన్నీ వాస్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. టైటిల్ ప్రకటనతోనే ఆసక్తి రేకెత్తించిన ఈ చిత్రం తెలంగాణ కుటుంబ నేపథ్యంతో తెరకెక్కుతోంది.విడుదల తేదీ ప్రకటన నేపథ్యంలో శుక్రవారం చిత్ర బృందం 'గడప' పాట లిరికల్ వీడియోను విడుదల చేసింది. సురేశ్ బొబ్బిలి సంగీతం అందించిన ఈ పాటకు అభినయ శ్రీనివాస్ సాహిత్యం రాశారు. తేలు విజయ ఆలపించారు. 'ఇడుపు కాయితం' అంటే విడాకుల పత్రం అని అర్థం. ఈ పేరుతో రూపొందుతున్న సినిమా కుటుంబ సంబంధాలు, వాటి చుట్టూ సాగే కథతో ప్రేక్షకుల ముందుకు రానుంది.

మితిమీరిన స్కిన్ షో చేయడం నాకు ఇష్టం ఉండదు

: రష్మిక మందన్న

టాలీవుడ్, బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా రాణిస్తున్న రష్మిక మందన్న, సినిమాల్లో దుస్తుల విషయంలో తనకంటూ కొన్ని హద్దులు ఉన్నాయని స్పష్టం చేశారు. మితిమీరిన స్కిన్ షో, ఎక్స్‌పోజింగ్‌తో కూడిన దుస్తులు ధరించడానికి తాను ఇష్టపడనని తేల్చిచెప్పారు. ఇటీవల నటుడు విజయ్ దేవరకొండతో కలిసి ఆమె ప్రముఖ టాక్ షో 'కాఫీ విత్ కరణ్'లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన వృత్తిపరమైన పరిమితులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు."కథ ప్రకారం కొన్నిసార్లు బికినీ వంటివి ధరించాల్సి రావచ్చు. కానీ, శరీర ప్రదర్శన ఎక్కువగా ఉండే దుస్తులు ధరించడం నాకు సౌకర్యంగా ఉండదు. నేను అలాంటి వ్యక్తిని కాదు" అని రష్మిక అన్నారు. ఏ సినిమా అయినా ఒప్పుకునే ముందు ఈ విషయంపై దర్శకులతో స్పష్టంగా మాట్లాడతానని, నటీనటుల సౌకర్యానికి విలువ ఇచ్చే దర్శకులతోనే పనిచేయడానికి ప్రాధాన్యత ఇస్తానని వివరించారు. ఈ విషయంలో నటుడు విజయ్ దేవరకొండ తనకు మద్దతుగా ఉంటారని, కొన్నిసార్లు ఆయన సలహా తీసుకుంటానని కూడా రష్మిక తెలిపారు. దీనిపై విజయ్ స్పందిస్తూ, "నటీనటులు ఇబ్బందికర దుస్తులు వేసుకోమని చెప్పినప్పుడు, 'మీరు నటులు, ఇది మీ పని కదా' అంటూ ఒత్తిడి చేస్తారు. అలాంటప్పుడు వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉంది" అని అభిప్రాయపడ్డారు. గ్లామర్ కోసం తన వ్యక్తిగత హద్దులు దాటనని రష్మిక చేసిన వ్యాఖ్యలను నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

'కల్కి 2'లో భైరవగా ప్రభాస్..

బర్త్‌డే స్పెషల్ వీడియోతో అంచనాలు పెంచిన మేకర్స్!

'కల్కి 2898 ఏడీ'లో భైరవగా ప్రేక్షకులను అలరించిన ప్రభాస్.. ఇప్పుడు సీక్వెల్‌లోనూ అదే పాత్రలో సందడి చేసేందుకు సిద్ధమయ్యాడు. 'కల్కి 2' షూటింగ్‌లో ఆయన పాల్గొంటున్నాడు. ప్రభాస్ భైరవగా తిరిగి సెట్స్‌లో అడుగుపెట్టడంతో ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్న అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది.

దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక తెరవెనుక వీడియోను విడుదల చేశారు. ఇందులో భైరవగా ప్రభాస్ కనిపించడంతో పాటు, సినిమా కోసం రూపొందిస్తున్న భారీ సెట్ కూడా చూపించారు. సీక్వెల్‌పై ఈ వీడియో అంచనాలను మరింత పెంచుతోంది.'కల్కి 2898 ఏడీ'లో తన స్టైల్, హాస్యంతో కూడిన డైలాగులు, నటనతో భైరవ పాత్రకు ప్రభాస్ ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాడు. ఇప్పుడు సీక్వెల్‌లోనూ ఆ పాత్రను కొనసాగిస్తూ.. కల్కి ఆగమనానికి సంబంధించిన తన లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.

ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్ అశ్వత్థామగా, కమల్ హాసన్ సుప్రీమ్ యాస్కిన్‌గా తిరిగి కనిపించనున్నారు. వైజయంతీ మూవీస్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో భారతీయ సినిమాలో ఇంతకు ముందెన్నడూ చూడని స్థాయి విజువల్స్‌ను చూపించనున్నట్లు నిర్మాతలు తెలిపారు. సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

'రామాయణ' ముందు భారీ సవాల్..

భారత సినీ పరిశ్రమలో అత్యంత భారీ బడ్జెట్‌తో, ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ: పార్ట్ 1'. నితీశ్ తివారీ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా బడ్జెట్ దాదాపు రూ. 2000 కోట్లుగా ప్రచారంలో ఉంది. ఈ స్థాయిలో భారీ పెట్టుబడి పెట్టినప్పుడు, సినిమా లాభాల బాట పట్టడం అంత సులభం కాదు. ట్రేడ్ విశ్లేషకుల అంచనాలను ఉటంకిస్తూ ఇండియా టుడే కథనం ప్రకారం.. ఈ సినిమా పెట్టిన పెట్టుబడిని తిరిగి రాబట్టి లాభాల్లోకి వెళ్లాలంటే ప్రపంచవ్యాప్తంగా కనీసం రూ. 5000 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించాల్సి ఉంటుంది. సాధారణంగా బడ్జెట్‌కు 2.5 రెట్ల వసూళ్లు వస్తేనే సినిమాను విజయవంతమైనదిగా పరిగణిస్తారు.ఈ భారీ లక్ష్యాన్ని చేరుకోవాలంటే సినిమాకు ఆకాశమంత ఓపెనింగ్స్ అవసరమని ట్రేడ్ నిపుణుడు రమేశ్ బాల అభిప్రాయపడ్డారు. దేశీయంగా అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారానే రూ. 75 కోట్ల నుంచి రూ. 100 కోట్లు, ప్రపంచవ్యాప్తంగా ప్రీ-సేల్స్ ద్వారా రూ. 150 కోట్ల నుంచి రూ. 200 కోట్లు వసూలు చేయడం ఆరంభానికి ఎంతో కీలకమని ఆయన విశ్లేషించారు.

ఇక, తొలిరోజు భారత్‌లో రూ. 100-125 కోట్ల నెట్ కలెక్షన్లు, ప్రపంచవ్యాప్తంగా రూ. 175-200 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధిస్తే, సినిమాకు బలమైన పునాది పడుతుందని భావిస్తున్నారు. దేశీయ వసూళ్లలో దక్షిణాది మార్కెట్ల నుంచి 35-40 శాతం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

అక్టోబర్ 22 నాటికి పరిమిత సంఖ్యలో అందుబాటులో ఉన్న షోల కోసం జరిగిన అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా సుమారు 1.33 లక్షల టికెట్లు అమ్ముడయ్యాయి. దీని ద్వారా రూ. 7.52 కోట్లు సమకూరాయి. అయితే, భారీ బడ్జెట్ చిత్రం కావడంతో కేవలం ఓపెనింగ్స్ మీదే ఆధారపడలేరు. సినిమాకు మంచి మౌత్ టాక్ వస్తేనే లాంగ్ రన్‌లో నిలదొక్కుకోగలదు. కేవలం థియేట్రికల్ వసూళ్లే కాకుండా, శాటిలైట్, డిజిటల్, ఇతర హక్కుల అమ్మకాల ద్వారా కూడా నిర్మాతలకు పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరనుంది.

రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, యశ్ రావణుడిగా, రవి దూబే లక్ష్మణుడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని యశ్ నిర్మాణ సంస్థ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్, నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమాను నవంబర్ 5న దీపావళి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనుండగా, నవంబర్ 4న ప్రత్యేక ప్రీమియర్ షోలు ప్రదర్శించనున్నారు.

'నా వైఫ్ మిస్సింగ్'

: చాలా ఏళ్ల తర్వాత మళ్లీ వరుణ్‌తో.. శ్వేతాబసు ప్రసాద్ ఆనందం

'కొత్త బంగారు లోకం' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరించిన నటి శ్వేతా బసు ప్రసాద్, సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ తెలుగు తెరపైకి పునరాగమనం చేశారు. 'ఆహా' ఓటీటీ వేదికగా రూపొందిన 'నా వైఫ్ మిస్సింగ్' అనే వెబ్ సిరీస్ ద్వారా ఆమె రీఎంట్రీ ఇచ్చారు. ఇది తనకు లభించిన ఒక అద్భుతమైన అవకాశమని, తిరిగి టాలీవుడ్‌లోకి రావడం సొంత ఇంటికి వచ్చినట్లుగా ఉందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.ఈ సిరీస్ ప్రమోషన్లలో భాగంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్వేతా బసు ప్రసాద్ మాట్లాడుతూ, "చాలా ఏళ్ల తర్వాత మళ్లీ తెలుగులో నటించడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ వెబ్ సిరీస్ నా కెరీర్‌కు మంచి పునరాగమనం అవుతుందని భావిస్తున్నాను. ఇందులో నేను పోషించిన 'స్వప్న' అనే పాత్ర ఎంతో శక్తిమంతంగా ఉండటంతో వెంటనే నటించడానికి అంగీకరించాను" అని పేర్కొన్నారు. 'కొత్త బంగారు లోకం' తర్వాత మళ్లీ వరుణ్ సందేశ్‌తో కలిసి పనిచేయడంపై స్పందిస్తూ, "వరుణ్ నా సోల్ మేట్. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ అతనితో కలిసి నటించడం ఒక మధురానుభూతి" అని అన్నారు.గత కొన్నేళ్లుగా తెలుగు చిత్ర పరిశ్రమకు దూరంగా ఉన్న శ్వేతా బసు ప్రసాద్, ప్రధానంగా హిందీ సినిమాలు, వెబ్ సిరీస్‌లపై దృష్టి కేంద్రీకరించారు. దర్శకురాలు స్వాతి అంకితభావంతో పనిచేసే వ్యక్తి అని, ఆమెతో కలిసి పనిచేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని శ్వేత తెలిపారు. ఈ అవకాశం కల్పించిన 'ఆహా' యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రేక్షకులందరూ ఈ సిరీస్‌ను ఆదరిస్తారని ఆకాంక్షించారు. కాగా, ఈ వెబ్ సిరీస్ ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళ భాషలోనూ 'ఆహా' ఓటీటీలో అందుబాటులో ఉంది.

రాజకీయాల్లోకి వెళ్లి ఆస్తులు అమ్ముకున్నా: నరేశ్

సీనియర్ నటుడు నరేశ్ తన రాజకీయ జీవితం గురించి, దానివల్ల ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందుల గురించి సంచలన విషయాలు వెల్లడించారు. రాజకీయాల్లోకి వెళ్లడం వల్ల ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయానని, ఆ నష్టాలను పూడ్చుకోవడానికి సొంత ఆస్తులను సైతం అమ్ముకోవాల్సి వచ్చిందని ఆయన తెలిపారు.హీరోగా మంచి అవకాశాలు వస్తున్న సమయంలోనే ప్రజాసేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి అడుగుపెట్టానని నరేశ్ చెప్పారు. డబ్బు సంపాదన తన లక్ష్యం కాదని, పార్టీ కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాల కోసం పెద్ద మొత్తంలో సొంత డబ్బు ఖర్చు చేశానని చెప్పారు. అదనపు ఆదాయం కోసం ప్రారంభించిన అడ్వర్టైజింగ్ ఏజెన్సీ వంటి వ్యాపారాలు కూడా ఆశించిన ఫలితాలు ఇవ్వలేదని వివరించారు.

తన ఉదార స్వభావం కూడా ఆర్థిక ఇబ్బందులకు ఒక కారణమని నరేశ్ అంగీకరించారు. 1998లో రాజకీయాల్లో పూర్తిగా చురుకుగా మారిన తర్వాత దాదాపు 12 నుంచి 15 ఏళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉన్నానని తెలిపారు. చిన్నప్పటి నుంచే ఆర్ఎస్ఎస్, బీజేపీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడినయ్యానని, హిందూపురం లోక్‌సభ స్థానం నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశానని కూడా ఆయన గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో సంపాదించిన డబ్బును భూముల వంటి స్థిరాస్తులపై పెట్టుబడి పెట్టి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని నరేశ్ అభిప్రాయపడ్డారు

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at SRI VENKATESWARA PRINTING SOLUTIONS, peerzadi guda, GHMC, medchal malkaj giri AND PUBLICATIONS, , Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONSContact No : 9440032006. MAIL ID : prajavaani006@gmail.comepaper.prajavaani.net